

ఈనాడు



విజయవాడ 2-3-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 201
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ప్రపంచ లక్ష్యం



రష్యా అధ్యక్షుడు పుతిన్ కొత్త అణ్వాయుధ సంపత్తిని ఆవిష్కరించారు. ప్రపంచంలోని ఏ ప్రాంతాన్నైనా అవి లక్ష్యాన్ని ఛేదించగలవని, వాటిని ఏ రక్షణ వ్యవస్థా నిలువరించలేదని స్పష్టం చేశారు. ఏ దేశంవద్దా లేని క్షిపణులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

2లో


ఛార్జింగ్ విప్లవం



అరనిమిషం కన్నా తక్కువ వ్యవధిలోనే ఛార్జ్ అయ్యే కొత్త తరహా బ్యాటరీని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ బ్యాటరీ వల్ల పర్యావరణానికి హాని ఉండదు. పైగా భద్రమైనది. త్వరగా ఛార్జ్ అవుతుంది. శక్తి సాంద్రత అధికంగా ఉండటంతో.. చిన్న చిన్న ఎలక్ట్రానిక్ పరికరాల్లోనూ దీన్ని ఉపయోగించుకునేందుకు వీలుంది.

2లో

విద్యా విజయం



ప్రపంచ మేటి వర్సిటీల జాబితాలో అమెరికా సత్తాచాటింది. తొలి పది విద్యాసంస్థల్లో ఐదు అగ్రరాజ్యానివే. బ్రిటన్ కూడా నాలుగు వర్సిటీలతో హవా కొనసాగించింది. మరోవైపు భారత విద్యా సంస్థలు మంచి ర్యాంకులను ఒడిసిపట్టలేకపోయాయి. చాలా ఆసియా దేశాల విద్యాసంస్థల కంటే వెనకబడ్డాయి.

2లో



రూ.4.62 కోట్ల మాటున
రూ.305 కోట్ల ప్రవాహం

- నిబంధనలు ఉల్లంఘించి విదేశీ పెట్టుబడులు
- కార్తి సాయంతో అక్రమాలకు మసిపూత
- ఇదీ ఐఎన్ఎక్స్ మీడియా అసలు కథ!

కార్తికి 5 రోజుల రిమాండ్

- దిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఆదేశం

14లో

రాష్ట్రంలో గ్రేహౌండ్స్ కేంద్రం

- రూ.219 కోట్లతో ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ ఆమోదం
- ఇప్పటికే అమరావతిలో 250 ఎకరాల కేటాయింపు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 9(3) కింద చెప్పినట్లుగా ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ ఆమోదముద్ర వేసింది. గురువారం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన కారణంగా అది తెలంగాణకు వెళ్లిపోవడంతో (మిగతా 2లో)

అగ్గి బరాటా!



- కోస్తా, తెలంగాణల్లో సగటుకన్నా ఒక డిగ్రీ పెరగనున్న ఉష్ణోగ్రతలు
- ఇప్పటికే మొదలయిన వేసవి తాపం
- వడగాల్పుల తీవ్రత ఎక్కువే
- ఐఎండీ అంచనా

దిల్లీ, ఈనాడు - విశాఖపట్నం

తెలుగు రాష్ట్రాల్లో ఈ సారి ఎండలు మండిపోనున్నాయి. ఇప్పటికే అగ్గి సెగ గట్టిగా తగులుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాలు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సాధారణ సగటు ఉష్ణోగ్రతల కన్నా 0.5 నుంచి ఒక డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తాజా నివేదికలో పేర్కొంది. ఈ సీజన్లో మార్చి 1 నుంచే వేసవికాలం మొదలైంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ మధ్య, తెలంగాణలో 36 నుంచి 38 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లోనూ గ్రీష్మ తాపం చాలా ముందుగానే తాకింది. చాలా చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రత.. సరాసరి కన్నా 2-5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదవుతోంది.

వడగాల్పులు వీచిన రోజులు

కోస్తా జిల్లాల్లో..

సంవత్సరం	రోజులు
2015	12
2016	14
2017	10

రాయలసీమ జిల్లాల్లో..

సంవత్సరం	రోజులు
2015	లేవు
2016	8
2017	2

తెలంగాణ రాష్ట్రంలో...

సంవత్సరం	రోజులు
2015	13
2016	27
2017	23



వేసవిలో రికార్డయిన అత్యధిక ఉష్ణోగ్రతలు (డిగ్రీలు సెల్సియస్‌లో) ఆంధ్రప్రదేశ్

సంవత్సరం	తేదీ	ఊరు	ఉష్ణోగ్రత
2015	మే 30	జంగమహేశ్వరపురం	47.2
2016	మే 28	జంగమహేశ్వరపురం	45.6
2017	మే 19	మచిలీపట్నం	47.3

వడగాల్పుల ప్రభావం

తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి కోస్తా, తెలంగాణ జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. ఈ సీజన్లో సగటున 20 రోజులకు మించి వడగాలులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ విభాగం హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్ వై.కె.రెడ్డి తెలిపారు. రాజస్థాన్ నుంచి దక్షిణాదికి వేడిగాలులు వీచే ప్రమాదం ఉండటంతో తెలంగాణ (మిగతా 2లో)



ఇంటికి, బండికి వడ్డీంపు

గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు ప్రియం కానున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రుణాల వడ్డీ రేట్లను పెంచడమే ఇందుకు నేపథ్యం. మిగిలిన బ్యాంకులు వీటిని అనుసరించే అవకాశం ఉంది. రుణాల వడ్డీ రేటుకు ప్రామాణికమైన ఎంసీఎల్ఆర్‌ను ఎస్‌బీఐ 0.20 శాతం పెంచి 8.15 శాతానికి సవరించింది. పీఎన్‌బీ 0.15 శాతం పెంచి 8.30 శాతానికి మార్పు చేసింది. భారీ (బల్క్), చిన్న (రిటైల్) మొత్తం డిపాజిట్లపై వడ్డీ రేటును ఎస్‌బీఐ పెంచిన మరునాడే రుణ రేట్లు పెరగడం గమనార్హం.

- బిజినెస్ పేజీలో

ఆస్తులన్నీ జప్తే



- నీరవ్‌మోదీ తరహా కేసుల్లో విక్రయించి బకాయిలు రాబట్టుకోవచ్చు
- బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

దిల్లీ

బ్యాంకు రుణాలను ఎగవేయడం, రుణాలను దారి మళ్లించడం వంటి ఆర్థిక నేరాలకు పాల్పడి చట్టం నుంచి తప్పించుకోవడానికి విదేశాలకు పరారయ్యే వారి చుట్టూ ప్రభుత్వం గట్టి ఉచ్చుని సిద్ధం చేసింది. నీరవ్ మోదీ, విజయ్‌మాల్యా లాంటి నిందితులపై కఠిన చర్యలకు వీలు కల్పించే బిల్లుకు కేంద్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. 'ఫ్యుజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ బిల్లు' పేరుతో తీసుకొచ్చిన ఈ బిల్లు.. కుంభకోణాలకు పాల్పడి, రుణాలు ఎగవేసి పరారయిన నిందితుల అన్ని ఆస్తులను జప్తు చేయడానికి వీలు కల్పిస్తుంది. బకాయిలను త్వరగా రాబట్టుకునే లక్ష్యంతో జప్తు చేసుకున్న ఆస్తులను విక్రయించుకోవడానికి ప్రతిపాదిత చట్టం అధికారాలను కల్పిస్తుంది. రూ.100 కోట్లు, అంత కన్నా ఎక్కువ మొత్తం బకాయి పడి దేశం విడిచి పరారయిన ఎగవేతదారులకు ఈ ప్రతిపాదిత చట్టం వర్తిస్తుంది. ఈ నెల 5 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల రెండో విడత భేటీలో బిల్లును పార్లమెంట్ ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి జైట్లీ తెలిపారు. ఆర్థిక నేరానికి పాల్పడి కోర్టు నుంచి అరెస్టు వారెంటు జారీ అయిన, క్రిమినల్ విచారణను తప్పించుకోవడానికి భారత్ వీడి వెళ్లిపోయిన, విచారణ ఎదుర్కోవడానికి భారత్‌కు తిరిగి రావడానికి నిరాకరించే వారిని పలాయిత (ఫ్యుజిటివ్) నేరగాడుగా ఈ బిల్లు నిర్వచిస్తున్నట్లు చెప్పారు. ఈ కొత్త చట్టం... అక్రమ నగదు చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)కన్నా భిన్నమైనదని తెలిపారు. పీఎంఎల్‌ఏ కింద.. నేరంవల్ల (మిగతా 2లో)



'సంధి'గ్ధం!

- అమిత్‌షాతో తెదేపా నేతల సమావేశం
- వెంకయ్య సమక్షంలో చర్చలు
- ఆర్థిక సాయంపై ఫార్ములా ఇచ్చాం
- స్పందన కోసం చూస్తున్నాం
- జైట్లీ వెల్లడి

ఈనాడు - దిల్లీ

విభజన చట్టంలో చెప్పిన హామీలు, రాజ్యసభ వేదికగా నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేసిన వాగ్దానాల అమలు విషయంలో కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య నెలకొన్న సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. రాష్ట్రానికి చేయూతనివ్వడంలో కేంద్రం అలసత్వం ప్రదర్శిస్తోందని రాష్ట్రం, హామీలకు కట్టుబడి ఉన్నామంటూ కేంద్రం చెపుతూ వస్తున్నా ఇప్పటికీ ఆమోదయోగ్య పరిష్కారం రాలేదు. ఈ క్రమంలో సందిగ్ధతకు తెరదించడానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మరోసారి చొరవ తీసుకొన్నారు. సమస్య పరిష్కారం కోసం గురువారం భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, తెదేపా ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావులతో గురువారం మాట్లాడారు. వెంకయ్య సమక్షంలోనే నేతలు సుమారు ముప్పావుగంటపాటు సమాలోచనలు జరిపారు. అయితే ఈ చర్చల్లో ఎలాంటి నిర్దిష్ట పరిష్కారం లభించినట్టు కనిపించలేదు. సమావేశం అనంతరం వివరాలు చెప్పడానికి ఇరుపార్టీల నేతలు ఇష్టపడలేదు. మరోవైపు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారమే మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రానికి ఆర్థిక సాయంపై ఒక ఫార్ములా చెప్పామని, దానిపై స్పందించాలని కోరినా ఏపీ అధికారులు ఇంకా ముందుకురాలేదని అన్నారు. ఆ 'ఫార్ములా' ఏమిటో చెప్పేందుకు ఆయన నిరాకరించారు. అమిత్‌షాతో చర్చలు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ కోరుకుంటున్న 19 అంశాల గురించి రామ్మోహన్‌నాయుడు, కుటుంబరావులు ఆయన (మిగతా 2లో)

నేటి నుంచి సినిమా ప్రదర్శనల నిలిపివేత?

ఏలూరు, న్యూస్‌టుడే: డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్స్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ ఈనెల 2 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సినిమా ప్రదర్శనలు నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, రంగస్థల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ అంబికా కృష్ణ తెలిపారు. ఏలూరులో ఆయన 'ఈనాడు- ఈటీవీ'కి ఈ విషయం తెలిపారు.

రోడ్డెక్కిన మిర్చి రైతు

- గుంటూరు మిర్చియార్డు వద్ద ఆందోళన
- జాతీయ రహదారిపై రాస్తారోకో

2లో



గుంటూరు మిర్చియార్డు ఎదుట చిలకలూరిపేట జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

30.38 టీఎంసీలు కావాలి

- కేటాయించిన 60 టీఎంసీలు ఇంకా వాడుకోలేదు
- తెలంగాణ లెక్కల ఆధారంగా ఎలా నిర్ధరిస్తారు?
- కృష్ణా బోర్డుకు ఈఎన్‌సీ లేఖ
- నేడు త్రిసభ్య కమిటీ భేటీ

ఈనాడు, అమరావతి: కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 60 టీఎంసీలను తాము ఇంకా పూర్తిగా వాడుకోనేలేదని, అందులో మిగిలిన కోటాతో పాటు కలిపి ఇంకా తమకు 30.38 టీఎంసీల నీటి అవసరాలు ఉన్నాయని రాష్ట్ర ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు లేఖ రాశారు. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శికి విడివిడిగా రెండు లేఖలు పంపారు. గతంలో కేటాయించిన 60 టీఎంసీల్లో వాస్తవ లెక్కలను, నష్టాలను వివరించడంతో పాటు ఇకపై ఎంత డిమాండ్ ఉందో లేఖల్లో పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల (మిగతా 2లో)

ఇదీ సంగతి!



రేపు ఇచ్చే పేపర్ ఏంటో తెలియక అన్నీ చదువుతున్నా!

పోలవరానికే 13 వేల కోట్లు!

- సాగునీటికి రూ.24వేల కోట్లు?
- బడ్జెట్‌లో కేటాయించే అవకాశం

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్(2018-19)లో సాగునీటి రంగానికి భారీగా నిధులు కేటాయించనున్నట్లు సమాచారం. ఈ రంగానికి దాదాపు రూ.24 వేల కోట్లు ఇవ్వనున్నారు. ఇందులో ఒక్క పోలవరం ప్రాజెక్టుకే అత్యధికంగా రూ.13 వేల కోట్లు కేటాయించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ మొత్తంలో పోలవరం కుడి కాలువ, ఎడమ కాలువ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనుల కేటాయింపులు కలిపి ఉండనున్నాయి. ఇవికాక హంద్రీనీవా, గాలేరు నగరి, వెలిగొండ, వంశధార వంటి భారీ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలో చేపడుతున్న మొత్తం 60 ప్రాజెక్టులు, జలసంరక్షణ పనులు, చిన్ననీటి వనరులకు కలిపి దాదాపు 11 వేల కోట్ల కేటాయించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్ కసరత్తు దాదాపు పూర్తయింది. ఈ ఏడాది జలవనరులశాఖకు తొలుత రూ.35 వేల కోట్లకు పైగా నిధులు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తర్వాత ఆర్థికశాఖ విధించిన పరిమితి మేరకు... ప్రాధాన్యాలు రీత్యా అవసరమైన మార్పులు చేసి ప్రతిపాదనలు సమర్పించింది.

ఇప్పటికే రూ.11240 కోట్ల ఖర్చు!

రానున్న బడ్జెట్‌లో కేటాయింపులు ప్రస్తుత సంవత్సరం ఖర్చును లెక్కలోకి తీసుకుని జరుపుతున్నట్టు కనిపిస్తోంది. 2017-18 బడ్జెట్‌లో జలవనరులశాఖకు రూ.12770.26 కోట్లు కేటాయించారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు 11240.67 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో పోలవరం ప్రాజెక్టు కేటాయింపులు, దానికి చేసిన ఖర్చు కూడా కలిపి ఉంది. కొత్త బడ్జెట్‌లో పోలవరం కాకుండా మిగతా ప్రాజెక్టులకు దాదాపు 11వేల కోట్లు కేటాయించేందుకు ఆర్థికశాఖ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. పోలవరానికి కేటాయించే మొత్తం మినహాయిస్తే కొత్త బడ్జెట్‌లో సాగునీటికి కేటాయింపులు పెరిగినట్లే భావించాలి. పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్రమే తొలుత నిధులు ఖర్చు చేసి ఆనక కేంద్ర నుంచి రాబట్టుకోవలసి ఉంది. బడ్జెట్‌లో పోలవరానికి రూ.13వేల కోట్లు చూపినా ఆ మేరకు రాష్ట్రంపై భారం ఉండదు. పోలవరానికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా కేంద్రం నుంచి రూ.2800 కోట్ల వరకు రావలసి ఉంది. సకాలంలో పోలవరం సొమ్ములు వస్తే ఆ నిధులు ఇతర ప్రాజెక్టులపై ఖర్చు చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. మిగిలిన ప్రాజెక్టుల కేటాయింపులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేసిన ఖర్చుకు అనుగుణంగా ఉండబోతున్నాయి. దాదాపు పూర్తి కావచ్చిన ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైనన్ని నిధులు కేటాయించనున్నారు.



ప్రపంచంలో ఎక్కడి లక్ష్యాన్నైనా ఛేదించే క్షిపణి

- క్రూయిజ్ క్షిపణిని అభివృద్ధి చేసినట్లు పుతిన్ వెల్లడి
- ఏ రక్షణ వ్యవస్థా దీన్ని నిలువరించలేదని స్పష్టీకరణ
- కొత్త అణ్వాయుధ సంపత్తిని ఆవిష్కరించిన రష్యా అధ్యక్షుడు



గురువారం రష్యా ఆవిష్కరించిన అత్యాధునిక క్షిపణి

మాస్కో: అధ్యక్ష ఎన్నికలకు కొద్ది వారాల ముందు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కొత్త అణ్వాయుధ సంపత్తిని ఆవిష్కరించారు. ప్రపంచంలోని ఏ ప్రాంతాన్నైనా అవి లక్ష్యాన్ని ఛేదించగలవని, వాటిని ఏ రక్షణ వ్యవస్థా నిలువరించలేదని స్పష్టం చేశారు. ఏ దేశం వద్దా లేని క్షిపణులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఫెడరల్ అసెంబ్లీని ఉద్దేశించి గురువారం పుతిన్ కదనోత్సాహంతో మాట్లాడారు. రష్యా భాగస్వామ్య పక్షాలపై జరిగే ఎటువంటి అణు దాడినైనా తాము రష్యాపైన దాడిగానే భావిస్తామని, తక్షణ ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. దీనిపై ఎవరికీ ఎటువంటి సందేహాలు అవసరం లేదన్నారు. పుతిన్ ప్రసంగం సందర్భంగా భారీ తెరపై కొత్త క్షిపణుల్లో కొన్నింటి వీడియోక్లిప్‌లను ప్రదర్శించారు. 'రష్యాను నిలువరించడంలో వారు విజయవంతం కాలేదు. ఈ రోజు నేను చెబుతున్నది బుకాయింపు కాదని వారు అర్థం చేసుకోవాలి." అని పశ్చిమదేశాలనుద్దేశించి అన్నారు. పుతిన్ ప్రస్తావించిన కొత్త ఆయుధాల్లో కొన్ని ఇప్పటికే సిద్ధమై ఉన్నవి కాగా మరికొన్ని అభివృద్ధిలో ఉన్నవి. ముఖ్యంగా ఆయన రెండు అణుసామర్థ్య ఆయుధాల గురించి వివరించారు. ఒకటి హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి కాగా మరొకటి జలాంతర్గామి నుంచి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణి. 2017లో విజయవంతంగా పరీక్షలు పూర్తి చేసుకున్న క్రూయిజ్ క్షిపణి.. ప్రపంచంలో ఎక్కడి లక్ష్యాన్నైనా ఛేదించగలదని పుతిన్ తెలిపారు. అణుశక్తితో దూసుకెళ్లే ఈ అణ్వాయుధం ప్రపంచంలోని ఏ రక్షణ వ్యవస్థలనయినా నిర్వీర్యం చేయగలదన్నారు. తక్కువ ఎత్తులో దూసుకెళ్లే దీన్ని గుర్తించడం కష్టమని, అణుపేలోడ్‌ను మోసుకెళ్తుందని చెప్పారు. అంచనాలకు అందకుండా దూసుకెళ్లే ఈ ఆయుధం.. క్షిపణి నిరోధక వ్యవస్థలకు దొరకదని, క్షిపణి రక్షణ, గగన రక్షణ వ్యవస్థలకు సంబంధించి ప్రస్తుత, భవిష్యత్తు ఆయుధ వ్యవస్థల్లో ఇది అజేయమైనదని పేర్కొన్నారు. జలాంతర్గామి నుంచి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణి.. అణు వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదని తెలిపారు. అమెరికా కొత్త అణ్వాయుధ సిద్ధాంతం పట్ల పుతిన్ ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా సిద్ధాంతం రక్షణాత్మకమని, ఎవరైనా దాడి చేస్తే ప్రతిస్పందనగానే అణ్వాయుధాలను ఉపయోగించాలన్నది రష్యా విధానమని స్పష్టం చేశారు.

20 సెకన్లలోనే ఛార్జ్ అయ్యే బ్యాటరీ



సియోల్: అరనిమిషం కన్నా తక్కువ వ్యవధిలోనే ఛార్జ్ అయ్యే కొత్త తరహా బ్యాటరీని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మండే గుణమున్న రసాయనిక ద్రావణాలకు బదులుగా ద్రవరూప ఎలక్ట్రోలైట్లను ఉపయోగించి దీన్ని దక్షిణకొరియాలోని కైస్ట్ విశ్వవిద్యాలయ పరిశోధక బృందం తయారుచేసింది. ఈ బ్యాటరీ వల్ల పర్యావరణానికి హాని ఉండదు. పైగా భద్రమైనది కూడా. త్వరగా ఛార్జ్ అవుతుంది. శక్తి సాంద్రత అధికంగా ఉండటంతో.. చిన్న చిన్న ఎలక్ట్రానిక్ పరికరాల్లోనూ దీన్ని ఉపయోగించుకునేందుకు వీలుంది. గ్రాఫీన్‌పై ఫైబర్‌లా ఉండే పాలిమర్ గొలుసు ఆనోడ్‌లను, సూక్ష్మమైన మెటల్ ఆక్సైడ్ కాథోడ్‌లను కూర్చడం ద్వారా దీన్ని శాస్త్రవేత్తలు తయారుచేశారు. తక్కువ వోల్టేజీ వాహకత, ఆనోడ్ పదార్థ కొరత కారణంగా సంప్రదాయ ద్రావణ బ్యాటరీలు త్వరగా ఛార్జ్ అవ్వలేవు. కొత్త పదార్థాలు, నిర్మాణాలను ఉపయోగించి శాస్త్రవేత్తలు ఈ సవాలును అధిగమించారు. ఎలక్ట్రోడ్ల ఉపరితలంపై శక్తి మార్పిడి త్వరగా జరిగేలా చేయడంతో పాటు.. శక్తి నష్టాన్నీ తగ్గించారు. సంప్రదాయ ద్రావణ బ్యాటరీల కన్నా 100 రెట్లు అధిక శక్తి సాంద్రతను.. ఈ కొత్త బ్యాటరీలు సంతరించుకున్నాయని పరిశోధకులు తెలిపారు.

రోడ్డెక్కిన మిర్చి రైతు

ఈనాడు, అమరావతి: కేంద్రం ప్రవేశపెట్టిన 'ఈనామ్' విధానాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపారులు మిర్చి కొనుగోళ్లను నిలిపివేయడంతో మిర్చి రైతులు రోడ్డెక్కారు. గుంటూరు మిర్చియార్డు ఎదుట చిలకలూరిపేట జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈనామ్ విధానంలో భాగంగా మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు మార్చి1 గురువారం నుంచి కొనుగోలుదారులు మిర్చి క్రయవిక్రయాలు పూర్తయిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలన్న నిబంధనను అమల్లోకి తీసుకువచ్చారు. దీనిని వ్యతిరేకిస్తూ ఎగుమతి వ్యాపారులు మిర్చియార్డులో కొనుగోళ్లను నిలిపివేశారు. తాము ఎగుమతి చేస్తున్న ఇతర రాష్ట్రాల్లో ఉన్న వ్యాపారులు పక్షం రోజులు తర్వాత నగదు ఇస్తున్నారని, క్రయవిక్రయాలు ముగిసిన వెంటనే నగదు ఇవ్వమంటే ఎక్కడ నుంచి తీసుకు రావాలంటూ పేర్కొంటూ.. మిర్చి కొనడం ఆపేశారు. వ్యాపారులు ఎంత సమయానికీ కొనేందుకు రాకపోవడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు.

చివరకు పాత పద్ధతిలోనే..: రైతులు గంటకు పైగా రాస్తారోకో చేయడంతో జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు యార్డు వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించారు. చేసేదిలేక.. పాత పద్ధతిలోనే మిర్చి కొనుగోళ్లు నిర్వహించుకోవచ్చని మార్కెటింగ్‌శాఖ అధికారులు మైకుల్లో ప్రకటించారు.

ఆస్తులన్నీ జప్తే

(మొదటి పేజీ తరువాయి)

ఆర్జించిన మొత్తాన్ని మాత్రమే జప్తు చేస్తారు. అదీ దోషిగా నిరూపితమయితేనే. కొత్త చట్టం మాత్రం అన్ని ఆస్తులనూ... అవి నేరచర్య వల్ల సమకూరినవా లేదా అన్నదానితో సంబంధం లేకుండా జప్తు చేయడానికి వీలు కల్పిస్తుందని మంత్రి చెప్పారు. నిందితుడు లొంగిపోవడం లేదని కోర్టు నిర్ణయించి వారెంటు జారీ చేసిన మరుక్షణం నుంచే కొత్త చట్టం వర్తిస్తుందని తెలిపారు.

కోర్టు పలాయిత నేరగాడిగా ప్రకటించడానికి ముందే నిందితుడు భారత్‌కు వచ్చి సంబంధిత కోర్టులో లొంగిపోతే ఈ చట్టం కింద చర్యలను నిలిపివేయచ్చు అని ఒక అధికారిక ప్రకటన తెలియజేసింది.

ఈ ప్రతిపాదిత చట్టాన్ని 2017-18 బడ్జెట్‌లో ప్రకటించారు. నీరవ్‌మోదీ, మెహుల్ ఛోక్సీలు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)ని మోసం చేసి, విచారణకు సహకరించడానికి నిరాకరిస్తున్న నేపథ్యంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చే ప్రక్రియను వేగవంతం చేశారు. విచారణను తప్పించుకోవడానికి దేశం విడిచి వెళ్లిపోయిన వారి కొత్త, పాత కేసులకు కొత్త చట్టం వర్తిస్తుందని మంత్రి వెల్లడించారు.

అవకతవకలకు పాల్పడే ఆడిటర్లపై చర్యలకు గట్టి అధికారాలతో కూడిన నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథార్టీ (ఎన్ఎఎఫ్ఆర్ఏ) ఏర్పాటు చేయడానికి ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది.

రూ. 12,700 కోట్ల పీఎన్‌బీ కుంభకోణం సహా వివిధ కార్పొరేట్ కుంభకోణాల్లో ఆడిటర్ల పాత్రను కూడా దర్యాప్తు సంస్థలు పరిశీలిస్తున్న నేపథ్యంలో ఎన్ఎఫ్ఆర్ఏ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ప్రస్తుతం ఆడిటర్లపై చర్యలు తీసుకునే అధికారం ఐసీఏఐకు ఉండగా ఎన్ఎఫ్ఆర్ఏ ఏర్పాటు తర్వాత ఆ అధికారాలు కొత్త సంస్థకు వస్తాయి. ఆడిటింగ్ వృత్తికి సంబంధించి ఎన్ఎఫ్ఆర్ఏ. . స్వతంత్ర నియంత్రణ సంస్థగా వ్యవహరిస్తుందని మంత్రి జైట్లీ చెప్పారు.

అన్ని లిస్టెడ్ కంపెనీలు, పెద్దవైన అన్‌లిస్టెడ్ పబ్లిక్ కంపెనీలు ఎన్ఎఫ్ఆర్ఏ పరిధిలోకి వస్తాయి. ప్రజాప్రయోజనం ఇమిడి ఉన్న కేసుల్లో ఇతర సంస్థల్లోనూ విచారణ జరపాలని ప్రభుత్వం ఈ సంస్థను కోరవచ్చు. తప్పు చేసిన ఆడిటర్ లేదా ఆడిటింగ్ సంస్థను పదేళ్ల వరకు డిబార్ చేసే అధికారం ఎన్ఎఫ్ఆర్ఏకు ఉంటుంది. భారీ జరిమానాలు కూడా విధించవచ్చు. ఈ సంస్థలో ఛైర్‌పర్సన్, ముగ్గురు పూర్తికాలపు సభ్యులు సహా 15 మంది సభ్యులుంటారు. వీరు కాక ఒక కార్యదర్శి ఉంటారు. మరో పక్షం రోజుల్లో ఈ సంస్థ ఏర్పాటుకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ వెల్లడించారు. వ్యక్తులకయితే కనీస జరిమానా రూ. లక్ష ఉంటుంది. తీసుకున్న రుసుములకు ఐదింతల వరకు జరిమానా విధించవచ్చు. ఆడిటింగ్ సంస్థలకయితే కనీస జరిమానా రూ. 10లక్షలుంటుంది. గరిష్ఠంగా.. తీసుకున్న రుసుములకు పదింతలు జరిమానా విధించవచ్చు.



హోలీ సందర్భంగా దహనం చేసేందుకు హోలీకా బొమ్మ బదులు గురువారం ముంబయిలో ఏర్పాటు చేసిన నీరవ్ మోదీ 58 అడుగుల దిష్టిబొమ్మ

రాష్ట్రంలో గ్రేహౌండ్స్ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

దానికి సమానమైనస్థాయిలో అత్యాధునిక శిక్షణ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనిపై 2016 డిసెంబర్ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంప్రదింపులు జరుగుతూ వచ్చాయి. ఎట్టకేలకు గురువారం దానికి ఆమోదముద్ర వేశారు. అమరావతి సమీపంలో 250 ఎకరాల్లో రెండు యూనిట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. గుంటూరు జిల్లాలో మొత్తం పోలీసు హెడ్‌క్వార్టర్స్, ప్రత్యేక విభాగాల ఏర్పాటుకు 2014లో రాష్ట్ర ప్రభుత్వం 2,700 ఎకరాల పలుచబడ్డ అటవీప్రాంతాన్ని గుర్తించింది. దీని మళ్లింపునకు కేంద్ర అటవీశాఖ ఇప్పటికే ఆమోదముద్ర వేసింది. ఇందులో 250 ఎకరాలను గ్రేహౌండ్స్ కేంద్రానికి కేటాయించింది. హైదరాబాద్ తరహాలో పూర్తిస్థాయి మౌలిక వసతులతోకూడిన గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటుచేయాలంటే రూ. 853.37 కోట్లు ఖర్చవుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంచనావేసింది. కేంద్రం మాత్రం ప్రస్తుతం రూ. 219 కోట్ల ప్రాజెక్టుకే ఆమోదముద్ర వేసింది.

ఐరోపాను గజగజ వణికిస్తున్న హిమపాతం: 48 మంది బలి

లండన్: విధ్వంసక హిమపాతం ఐరోపాను గజగజ వణికిస్తోంది. విపరీతంగా మంచును కురిపిస్తూ అమాంతం గడ్డకట్టిస్తోంది. దీంతో రోడ్డు ప్రమాదాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆరుబయట నిద్రించే నిరాశ్రయులే ఎక్కువగా దీనివల్ల గడ్డకట్టి మరణిస్తున్నారు. గత శుక్రవారం నుంచి ఇప్పటివరకూ మొత్తంగా 48 మంది మృతి చెందినట్లు తేలింది.

అగ్గి బరాటా!

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో ఈ మూడు నెలలు వడగాల్పుల తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ హైదరాబాద్ కేంద్రం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా జిల్లాలతో పోలిస్తే రాయలసీమలో వడగాల్పుల ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం ప్రాథమిక అంచనాలను మాత్రమే వెల్లడించామని, మరో నెలరోజుల్లో మరింత లోతుగా నివేదిక ఇస్తామని ఐఎండీ డైరెక్టర్ జనరల్ కెజె రమేష్ చెప్పారు.

ఉత్తర భారత దేశంలో

మార్చి నుంచి మే వరకూ ఉత్తర భారత దేశంలో సాధారణం కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని ఐఎండీ తెలిపింది. బుధవారం ముంబయిలో 37.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కన్నా 5.5 డిగ్రీలు అధికం. ఇలాంటి తీవ్రస్థాయి తాపం నమోదు కావడం ఇక్కడ వరుసగా ఇది మూడోరోజు. మహారాష్ట్రలోని మిగతా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.

వర్షాలు తక్కువ

అల్పపీడన వ్యవస్థ (ఎల్‌పీఎస్) చర్యల్లో తగ్గుదల వల్ల భారత్‌లో ఈ శతాబ్దం చివరినాటికి రుతుపవన వర్షాలు గణనీయంగా తగ్గుతాయని అమెరికాకు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ప్రచురితమైన అధ్యయనం హెచ్చరించింది. 2071-2095 మధ్యకాలంలో ఎల్‌పీఎస్ చర్యల్లో 45 శాతం మేర తగ్గుదల ఉంటుందని తెలిపింది. మరోవైపు కొన్నిచోట్ల కుంభవృష్టి వర్షాలూ పెరుగుతాయని హెచ్చరించింది. ఝార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది.

వడగాల్పుల నుంచి రక్షణ తీసుకోవాలి

ఈ వేసవిలో వడగాల్పుల తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. సాధారణంగా కన్నా ఒక డిగ్రీ అధికంగా ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. ఈ ఏడాది తెలంగాణ అంతటా ఈ పరిస్థితి ఉండే అవకాశం ఉంది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి.

- వైకే రెడ్డి, ఐఎండీ డైరెక్టర్, హైదరాబాద్

నీటిని పొదుపుగా వాడుకోవాలి

వేసవి తీవ్రత దృష్ట్యా రైతులు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడుకోవాలి. వరి పంట మే వరకు ఉండే అవకాశాలు ఉన్నందున పద్ధతి ప్రకారం బోర్లు, చెరువుల్లో నీటిని పొదుపుగా వినియోగించుకుని తడులు పెట్టుకోవాలి. ఇప్పటికే బోర్లలో నీళ్లు అడుగంటిన రైతులు ముందు జాగ్రత్తలు పాటించాలి. వరి మినహా ఇతర పంటలకు మల్చింగ్ లేదా నీడ ఏర్పాటుచేసుకుని రక్షించుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారులను ఈ మేరకు సూచనలు ఇచ్చేందుకు అప్రమత్తం చేస్తాం.

- పార్థసారథి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయశాఖ

'అగ్ర వర్సిటీ'ల జాబితాలో అగ్రరాజ్యం హవా

- తొలి పదిలో ఐదు అమెరికావే
- క్యూఎస్ ర్యాంకింగ్స్ విడుదల

వాషింగ్టన్: ప్రపంచ మేటి వర్సిటీల జాబితాలో అమెరికా సత్తాచాటింది. తొలి పది విద్యాసంస్థల్లో ఐదు అగ్రరాజ్యానివే. బ్రిటన్ కూడా నాలుగు వర్సిటీలతో హవా కొనసాగించింది. మరోవైపు భారత విద్యా సంస్థలు మంచి ర్యాంకులను ఒడిసిపట్టలేకపోయాయి. చాలా ఆసియా దేశాల విద్యాసంస్థల కంటే వెనకబడ్డాయి. ప్రస్తుత ఏడాది(2018)కిగాను క్వాక్వారెల్లీ సైమండ్స్ (క్యూఎస్) సంస్థ ఈ జాబితాను విడుదలచేసింది. సబ్జెక్టుల వారీగానూ ర్యాంకులు ప్రకటించింది. ఆసియాలో సింగపూర్‌కు చెందిన నాన్యంగ్ టెక్నికల్ వర్సిటీకి 11, నేషనల్ వర్సిటీ ఆఫ్ సింగపూర్‌కు 15వ స్థానాలు దక్కడం విశేషం. చైనాకు చెందిన షింగ్హువా వర్సిటీ 25వ ర్యాంకు సంపాదించింది. అంతేకాదు తొలి వంద వర్సిటీల్లో చైనావి ఆరున్నాయి. జపాన్‌వి ఐదున్నాయి. భారత్ విద్యా సంస్థ ఒక్కటీలేదు. మొదటి 200 విద్యా సంస్థల్లో మాత్రం మూడింటికి చోటు దక్కింది. గత నెలలో విడుదలైన టైమ్స్ ప్రపంచ వర్సిటీల జాబితాలోనూ మన విద్యాసంస్థలకు మంచి ర్యాంకులు దక్కలేదు.

ప్రపంచ మేటి వర్సిటీలు ర్యాంకింగ్స్ - 2018

ర్యాంకింగ్ 2018	2017	తొలి పది విద్యాసంస్థలు	దేశం
◆ 1	1	మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)	అమెరికా
◆ 2	2	స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం	అమెరికా
◆ 3	3	హార్వర్డ్ విశ్వవిద్యాలయం	అమెరికా
▲ 4	5	కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కాల్‌టెక్)	అమెరికా
▼ 5	4	కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం	బ్రిటన్
◆ 6	6	ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం	బ్రిటన్
◆ 7	7	యూనివర్సిటీ కాలేజీ లండన్ (యూసీఎల్),	బ్రిటన్
▲ 8	9	ఇంపీరియల్ కాలేజీ లండన్	బ్రిటన్
▲ 9	10	షికాగో వర్సిటీ	అమెరికా
▼ 10	8	ఈటీహెచ్ జ్యూరిచ్- స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	స్విట్జర్లాండ్

ర్యాంకింగ్ 2018	2017	భారత విద్యా సంస్థలు
▲ 172	185	ఐఐటీ దిల్లీ
▲ 179	219	ఐఐటీ బాంబే
▼ 190	152	ఐఐఎస్‌సీ బెంగళూరు
▼ 264	249	ఐఐటీ మద్రాస్
▲ 293	302	ఐఐటీ కాన్పూర్
▲ 308	313	ఐఐటీ ఖరగ్‌పూర్
▼ 431-440	399	ఐఐటీ రూర్కీ
▲ 481-490	501-550	దిల్లీ వర్సిటీ
▼ 501-550	481-490	ఐఐటీ గువాహటీ

మంచి నీరు అనుకుని యాసిడ్ తాగిన బాలుడు

పొన్నూరు, న్యూస్‌టుడే: ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ బాలుడు మంచినీరు అనుకుని యాసిడ్ తాగి గాయపడ్డాడు. గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామానికి చెందిన బాలుడు ఆకాష్ (7) అనారోగ్యంతో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఆకాష్‌ను పరీక్షించి మందులు ఇచ్చి వేసుకోమని చెప్పారు. మంచినీరు కావాలని ఆకాష్ అడగ్గా.. అక్కడే డబ్బాలో ఉన్నాయని నర్స్ చెప్పింది. దీంతో ఆకాష్ అక్కడున్న డబ్బాను తీసుకుని తాగే ప్రయత్నం చేయగా.. దాంట్లోని కొన్ని చుక్కల యాసిడ్ కడుపులోకి వెళ్లడంతోపాటు.. కొన్ని చుక్కలు ముఖంపై పడి గాయపడ్డాడు. తల్లిదండ్రులు ఆకాష్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

30.38 టీఎంసీలు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

మధ్య నీటి పంపకాలకు సంబంధించి శుక్రవారం కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం కానుంది. ఇందులో తాజా కేటాయింపులు, అవసరాలపై చర్చిస్తారు. రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లతో పాటు బోర్డు సభ్య కార్యదర్శి కూడా ఈ కమిటీలో సభ్యులు. 60 టీఎంసీలకు మించి తాము వాడుకున్నామని కృష్ణా బోర్డు ఏ లెక్కల ఆధారంగా నిర్ధరణకు వస్తుందని ఏపీ ఈఎన్‌సీ ప్రశ్నించారు. కేవలం తెలంగాణ అధికారులు ఇచ్చిన లెక్కలను ఆధారంగా చేసుకుని ఖరారు చేసేస్తారా? మా అభిప్రాయాలు, మేం చెప్పే లెక్కలు తెలుసుకోరా? అని ఈఎన్‌సీ ఆ లేఖలో ప్రశ్నించారు. ఇందులోని వివరాలు ఇలా ఉన్నాయి.

- ☛ జనవరి 10న త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏపీకి కేటాయించిన 60 టీఎంసీలకు మించి వాడుకున్నామని బోర్డు సభ్యకార్యదర్శి లేఖ రాశారు. ఇలా అనడం అభ్యంతరకరం. రెండు వైపులా సమాచారం తీసుకుని తుది అభిప్రాయానికి రాకపోతే ఎలా?
- ☛ నాగార్జునసాగర్ ఎడమ కాలువకు ఫిబ్రవరి 26 వరకు 16.728 టీఎంసీలు ఏపీ వాడుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు. నిజానికి ఏపీ సరిహద్దు వద్ద కేవలం 7.49 టీఎంసీలు మాత్రమే చేరింది. మధ్యలో ప్రవాహ నష్టాలు లెక్కించేందుకు ఇరు రాష్ట్రాల సంయుక్త అధికారులతో నియమించిన కమిటీ పని చేస్తోంది. ఆ కమిటీ లెక్కల ప్రకారం 26.7శాతం నష్టాలున్నట్లు చెబుతున్నారు. ఆ లెక్కలు పరిగణనలోకి తీసుకుంటే సాగర్ ఎడమ కాలువలో ఏపీ వాడుకున్నది 10.21 టీఎంసీలు. ఇంకా 4.217టీఎంసీలు ఎడమ కాలువకు విడుదల కావాల్సి ఉంది. ఈ కమిటీ అధికారికంగా తన నివేదిక ఇవ్వాల్సి ఉంది. నీటి నష్టాలను బోర్డు హేతుబద్ధంగా పరిగణనలోకి తీసుకోవాలి.
- ☛ కృష్ణా డెల్టా విషయంలోనూ ప్రధాన విద్యుత్కేంద్రం ద్వారా నీటి విడుదల తిరిగి పంపు చేసిన నీటిని లెక్కలోకి తీసుకుంటే ఏపీకి దిగువకు చేరింది 14.918 టీఎంసీలే.
- ☛ చెన్నయ్ తాగునీటి అవసరాల అంశాన్ని లెక్కించి అన్నింటినీ పరిశీలనలోకి తీసుకుంటే 60 టీఎంసీలకు ఏపీ వాడుకున్నది 53.581 టీఎంసీలే. కేటాయింపులకు మించి వాడుకున్నామనడం సరికాదు.
- ☛ ప్రస్తుతం మాకు సాగర్ కుడి కాలువకు 10.66 టీఎంసీలు, ఎడమ కాలువకు 7.72 టీఎంసీలు, కృష్ణాడెల్టాకు 8 టీఎంసీలు, హంద్రీనీవాకు 4 టీఎంసీలు అవసరం. ఆ మేరకు కేటాయింపులు జరపాలి.

ఉష్ణోగ్రతల్లో ఆకస్మిక మార్పులతో గుండెకు ముప్పు!

లండన్: ఉష్ణోగ్రతల్లో సంభవించే ఆకస్మిక మార్పులు గుండెకు హాని కలిగించి.. ప్రాణాపాయానికి కూడా దారి తీయవచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఒక రోజులో ఉష్ణోగ్రతల్లో వచ్చే ప్రతి 5 డిగ్రీల సెల్సియస్ హెచ్చుతగ్గులతో గుండెపోటు వచ్చే ప్రమాదం.. 5 శాతం పెరుగుతుందని చెబుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందనే అంశంపై పూర్తి స్పష్టత లేనప్పటికీ.. "బయటి ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పులను తట్టుకునే సమర్థమైన వ్యవస్థ శరీరానికి ఉన్నా.. వాతావరణంలో తరచుగా, వేగంగా కలిగే విపరీతమైన మార్పులతో ఆయా వ్యవస్థలపై ఒత్తిడి పెరిగి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది" అని మిచిగాన్ యూనివర్సిటీ పరిశోధకుడు డాక్టర్ హెడ్విగ్ అండర్సన్ వివరిస్తున్నారు. రోజువారీ ఉష్ణోగ్రతల్లో మార్పులు 25 డిగ్రీల సెల్సియస్ దాటితే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.

'సంధి'గ్ధం!

(మొదటి పేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. విభజన చట్టం ప్రకారం అమలు చేయాల్సిన 19 అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. అయితే అందులోని చాలా అంశాలపై ఇప్పటికే ఫిబ్రవరి 9న రాజ్యసభలో ప్రకటన ద్వారా చెప్పామని అమిత్‌షా కూడా గుర్తుచేసినట్లు సమాచారం. అందులో చెప్పిన అంశాలన్నింటికీ తాము కట్టుబడి ఉన్నామని, సమస్యల పరిష్కారానికి తాను ముఖ్యమంత్రితో మాట్లాడతానని పేర్కొన్నట్లు తెలిసింది. చాలా అంశాలపై చర్చించారని సమాచారం. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవానికి వెళ్లిన వెంకయ్యనాయుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని, సమస్య పరిష్కారానికి తనవంతు చొరవ తీసుకుంటానని ఆరోజు చంద్రబాబుకు హామీ ఇచ్చినట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఆ నేపథ్యంలోనే గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

ఏపీ నుంచి స్పందన రాగానే నిర్ణయం.. అరుణ్‌జైట్లీ: రెవెన్యూలోటు భర్తీ, ప్రత్యేక ప్యాకేజీ కింద ఆర్థిక సాయానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక ఫార్ములాను ఆంధ్రప్రదేశ్ అధికారులకు చెప్పిందని, దానిపై ఆ ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. గురువారం కేబినెట్ సమావేశం వివరాలు వెల్లడించడానికి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. ఫిబ్రవరి తొలివారంలో జరిగిన సమావేశంలో ఆర్థికశాఖ అధికారులు తమ అభిప్రాయాన్ని ఏపీ అధికారులకు చెప్పారని, దానిపై ప్రభుత్వం అభిప్రాయం తెలుసుకొని వస్తామని వెళ్లినవారు ఇంతవరకూ తిరిగిరాలేదని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తమ అభిప్రాయం చెప్పిన మరుక్షణమే తాము నిర్ణయం వెలువరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తమ ఫార్ములాను ఏపీ ప్రభుత్వానికి చెప్పినందున దాన్ని బహిర్గతం చేయలేనని పేర్కొన్నారు. తాము మాత్రం చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నామని, అందులో వెనక్కుతగ్గే ప్రసక్తేలేదన్నారు. విభజన చట్టం కింద ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రకటించిన ఈఏపీ మొత్తాన్ని ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉందని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌గార్గ్ పేర్కొన్నారు. వారికి ఏ తేదీ నుంచి ఏ తేదీ వరకు ఈఏపీ సాయం అందిస్తామని చెప్పామో, ఆ మధ్యకాలంలో మంజూరైన ఈఏపీ రుణాల చెల్లింపు బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందని, ఈ విషయం ఇప్పటికే ఏపీకి స్పష్టం చేశామన్నారు. ప్రత్యేక ప్యాకేజీ నిధులను విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కాకుండా దేశీయ ఆర్థిక సంస్థలైన నాబార్డ్, హడ్కో నుంచి అందించే విషయం తనకు తెలియదన్నారు. అయితే ఏపీ అధికారులు మాత్రం ఇప్పటికే తమ అభిప్రాయాన్ని చెప్పేశామని, తమ విధానంలో మార్పులేదని స్పష్టంచేస్తున్నారు. కేంద్రం తొలుత అంగీకరించిన రూ. 7,500 కోట్ల రెవిన్యూలోటులో ఇప్పటివరకూ ఇచ్చిన రూ. 4వేల కోట్లు మినహాయించి, మిగిలిన రూ. 3,500 కోట్లు విడుదల చేయాలని ఇదివరకే కోరినట్లు తెలిపారు. కాగ్ నిర్ధారించిన రూ. 16వేల కోట్ల లెక్క సరైందో కాదో తేల్చడానికి 14వ ఆర్థికసంఘం అధ్యక్షుడు వైవీరెడ్డి నేతృత్వంలో కమిటీ వేయాలని సూచించారు. అయితే ఇంతవరకూ కేంద్రం మాత్రం తాను చెప్పిన దారిలోకే రావాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఏపీ ప్రభుత్వం మాత్రం తన నిర్ణయంలో మార్పులేదని చెప్పినట్లు తెలుస్తోంది.

అమిత్‌షాతో భేటీలో..: అమిత్‌షాతో సమావేశంలో తెదేపా నాయకులు ప్రధానంగా 19 అంశాల గురించే పట్టుబట్టారు. అందులో... 1. ప్రత్యేకహోదా 2. రెవిన్యూలోటు భర్తీ 3. పోలవరం ప్రాజెక్టు 4. రైల్వే జోన్ ఏర్పాటు 5. పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు 6. అమరావతికి మరిన్ని నిధులు 7. జాతీయ విద్యాసంస్థల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయడానికి అవసరమైన నిధుల కేటాయింపు 8. దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు 9. విభజన చట్టంలో ఉన్న పన్ను లోపాలను సరిదిద్దడం 10. కడపలో స్టీల్‌ప్లాంటుపై వెంటనే నిర్ణయం 11. వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ 12. విశాఖ, విజయవాడ మెట్రో 13. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలనుంచి అమరావతికి వేగవంతమైన రైలు, రోడ్డు నెట్‌వర్క్ ఏర్పాటు. 14. వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్, కేబీకే తరహా ప్యాకేజీ 15. విద్యుత్తు డిస్కంలకు బకాయిల చెల్లింపు 16. షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన అంశాలు ప్రధానమైనవి. ఇందులో కొన్నింటిపై రాజకీయ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

గ్రహం అనుగ్రహం

2-3-2018 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
పూర్ణిమ: ఉ. 6-32 తదుపరి
బహుళ పక్ష పాడ్యమి తె. 5-06
పుబ్బ నక్షత్రం: రా. 11-04 తదుపరి ఉత్తర
అమృత ఘడియలు: సా. 4-54 నుంచి 6-24 వరకు
వర్జ్యం: ఉ. 7-40 నుంచి 9-13 వరకు
తిరిగి తె. 6-05 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 8-41 నుంచి 9-28 వరకు
తిరిగి మ. 12-35 నుంచి 1-22 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ. 6-22; సూర్యాస్తమయం: సా. 6-02

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
మెదక్	38.8	14.7
శ్రీకాకుళం	38.5	19.5
కర్నూలు	38.0	20.8
రాజమహేంద్రవరం	38.0	20.0
గుంటూరు	37.5	19.0
విశాఖపట్నం	37.4	19.2
హన్మకొండ	37.0	19.5
విజయవాడ	36.7	21.0
తిరుపతి	36.6	15.6
హైదరాబాద్	35.6	18.3
అనంతపురం	35.5	18.2
కడప	35.0	18.0
ఒంగోలు	33.8	22.5
తాడేపల్లిగూడెం	33.5	21.0
నరసాపురం	32.7	21.5
నెల్లూరు	32.0	20.0


Reliance
Growth is Life
TRENDS
GET THEM TALKING
ఉగాది శుభాకాంక్షలు
Rana
మోడ్ మాండ్రైన్స్ ప్రారంభం ₹799 నుంచి
షాప్ చెయ్యండి మరియు అద్భుతమైన బహుమతులు పొందండి*
*షరతులు వర్తిస్తాయి. ఎంపికచేసిన మర్చండైజ్‌పై ఆఫర్ చెల్లుతుంది. ఈ ఆఫర్ లేకుండా కూడా మర్చండైజ్ లభిస్తుంది.
2 బిల్లులను కలపడం లేదా విభజించడం అనుమతించబడదు. వివరమైన షరతుల కోసం దయచేసి స్టోర్ సిబ్బందిని అడగండి.
www.reliancetrends.com

ఈనాడు

పదును తేలాల్సిన కార్యాచరణ

సాటి మనుషుల్ని చెరపట్టి వాళ్లను కోళ్లు, గొర్రెలుగా జమకట్టి విక్రయించి సొమ్ము చేసుకునే అమానుష దందా ఆధునిక కాలవైపరీత్యాల్లో ఒకటి. చాపకింద నీరులా విస్తరిస్తూ దేశంలో అంతకంతకు పెచ్చరిల్లుతున్న మనుషుల అక్రమ రవాణా ఎందరో ఆడపిల్లలు, పసికందుల బతుకుల్ని, భవిష్యత్తును కర్కశంగా చిదిమేస్తోంది. అభాగినులు, పిల్లల రక్తమాంసాలే పెట్టుబడిగా చిలవలు పలవలు వేసుకుపోతున్న అక్రమ రవాణాను నిరోధించే లక్ష్యంతో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొస్తామంటోంది. మోదీ మంత్రిమండలి తాజాగా ఆమోదముద్ర వేసిన మానవ అక్రమ రవాణా(నివారణ, పరిరక్షణ, పునరావాసం) బిల్లు నిర్దిష్ట గడువులోగా కేసుల విచారణ పరిపూర్తి కావాలంటోంది. జిల్లాస్థాయిలో ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటును అది అభిలషిస్తోంది. మనుషుల అక్రమ రవాణా కేసుల్ని ఇకమీదట జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) విచారిస్తుందంటున్న కేంద్రం ఆ మేరకు చట్ట సవరణ, నిర్భయనిధి ద్వారా ఆర్థిక సాయం అందజేతకు కట్టుబాటు చాటుతోంది. నేర తీవ్రత ప్రాతిపదికన కనిష్ఠంగా ఏడేళ్లు, గరిష్ఠంగా జీవిత ఖైదు విధించే నిబంధనలతో రూపుదిద్దుకొన్న చరిత్రాత్మక బిల్లు- ఈ పరిధిలో నేరాల్ని స్పష్టంగా నిర్వచించింది. వెట్టిచాకిరి కూపంలోకి నెట్టడం, కృత్రిమ ఎదుగుదలకు ఇంజెక్షన్లు ఇవ్వడం, పడుపు వృత్తిలో దించడం, మాదకద్రవ్యాలు ఉపయోగించడం తదితరాల్ని తీవ్ర నేరాలుగా పరిగణిస్తామంటున్న బిల్లు బాధితులకు తక్షణ పునరావాసాన్ని లక్షిస్తోంది. అభియోగ పత్రం దాఖలైన రెండు నెలల్లోగా బాధితులకు తోడ్పాటు అంది తీరాలంటున్న బిల్లు- సాక్షుల వివరాలు గోప్యంగా ఉంటాయనీ అభయమిస్తోంది. అక్రమ రవాణా మూలాన రాష్ట్రాలవారీగా కన్నీటి సాగరాలు పోటెత్తే దురవస్థను అరికట్టే నిర్ణాయక చొరవ కార్యరూపం దాల్చేందుకు సహకరించడం రాజకీయ పక్షాలన్నింటి మౌలిక విధి!

వెట్టిచాకిరి, వ్యభిచారాలే- అక్రమ రవాణా ముఠాల్ని ఉరకలెత్తించే ఇంధనం, ఇరుసు. మభ్యపెట్టి, ప్రలోభాల ఎరవేసి, బలవంతాన అభాగ్యుల్ని తరలించుకుపోతున్న వంచక తండాలు- మగపిల్లల్ని బానిస శ్రామికులుగా, అమ్మాయిల్ని అంగడి బొమ్మలుగా విక్రయించి కాసుల పంట పండించుకుంటున్నాయి. మనుషుల అక్రమ రవాణాలో దేశీయంగా పశ్చిమ్ బంగ ముందున్నట్లు జాతీయ నేర నమోదు సంస్థ గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, ఝార్ఖండ్‌లతోపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ నికృష్ట వ్యాపారం పెచ్చరిల్లుతోంది. అలా తప్పిపోతున్న పిల్లల్లో దాదాపు సగంమంది ఆచూకీ అసలెప్పటికీ తెలియడం లేదంటున్న సర్కారీ నివేదికల 'నిజనిర్ధారణ' దిగ్భ్రాంతపరుస్తోంది. వాస్తవానికి రికార్డులకు ఎక్కని, వెలుగులోకి రాని అపహరణలెన్నో లెక్కే లేదు! ఉద్యోగాల పేరిట అరబ్ దేశాలకు మహిళల అక్రమ రవాణాతో ఎడాపెడా దండుకోవడంలో ఆరితేరిన దుబాయ్ శీను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో ఏజెంట్లను ఏర్పరచుకున్న వైనం అయిదారు వారాల క్రితమే బహిర్గతమై తీవ్ర కలకలం రేపింది. తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లో మాటువేసి యూపీఏ, రాజస్థాన్ ముఠాలు పేట్రేగుతున్నాయన్న కథనాలు మొన్న జనవరిలో గగ్గోలు పుట్టించాయి. ఏళ్ల తరబడి కొనసాగుతున్న అటువంటి అరాచకాలపై 2004లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సర్వోన్నత న్యాయస్థానం రెండున్నరేళ్ల క్రితం వివరణాత్మకంగా స్పందించింది. వ్యవస్థీకృత నేరాల దర్యాప్తు సంస్థనొకదాన్ని కొలువు తీర్చాలని సుప్రీంకోర్టు అప్పట్లో నిర్దేశించగా, ఇప్పటికే ఉన్న ఎన్ఐఏకి ఆ బాధ్యతలు దఖలుపరచాలని మోదీ ప్రభుత్వం నిశ్చయించింది. తాను పండై, తనువు పుండైన అభాగినుల మూత్రపిండాలు, కాలేయాల్నీ ముఠాలు అమ్ముకుంటున్నాయన్న కథనాల నేపథ్యంలో- ప్రభుత్వాల ఏకోన్ముఖ కార్యాచరణ అక్రమ రవాణా వ్యవస్థ కూసాలు కదల్చాలి!

విశ్వవ్యాప్తంగా వ్యవస్థీకృత నేర సామ్రాజ్యాలకు కనకవర్షం కురిపిస్తున్న ప్రధాన పద్దులు మూడు- చీకటి ఆయుధ వ్యాపారం, మాదక ద్రవ్యాలు, మనుషుల అక్రమ రవాణా. దక్షిణ, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లోని మానవ తరలింపులో సగం దాకా లైంగిక దోపిడి కోసమేనన్నది- యూఎన్ఓడీసీ (మాదక ద్రవ్య నేరాలపై ఐరాస కార్యాలయం) కూలంకష విశ్లేషణ. రోజూ 180మంది వరకు బాలికలు 'అదృశ్యమవుతున్న' భారత్‌నుంచి లక్షలమంది ఆడపిల్లలు వ్యభిచారంలోకి అక్రమ రవాణా అయ్యుంటారని రెండేళ్లనాడే అంతర్జాతీయ కార్మిక సంస్థ మదింపు వేసింది. 'ఆధునిక బానిసత్వం'గా ప్రపంచ దేశాలు గర్హిస్తున్న మానవ అక్రమ రవాణాపై కలిసికట్టుగా స్థిరమైన చర్యలు చేపట్టాలని ఐక్యరాజ్య సమితి పిలుపిచ్చి ఏడేళ్లు గతించినా, ఉమ్మడి కార్యాచరణ ఇప్పటికీ ఎండమావినే తలపిస్తోంది. ప్రపంచంలో ఏటా లక్షలమంది అక్రమ రవాణా పాలబడుతుండగా- పెద్దపద్దు దక్షిణాసియాది, అందునా భారత్‌దేనంటున్న గణాంకాలు తక్షణ దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను ఉద్బోధిస్తున్నాయి. దేశంలోని సగం జిల్లాల్లో అక్రమ రవాణా విష సంస్కృతి జడలు విరబోసుకుంటున్నదన్న విశ్లేషణలు- జాప్యం, అలసత్వం అనర్థదాయకాలని హెచ్చరిస్తున్నాయి. బాధితులను సాంత్వనపరచే మూడంచెల వ్యవస్థను దేశంలో అవతరింపజేయడంతోపాటు యూఎన్ఓడీసీ మేలిమి సూచనలకూ కేంద్రం చెవొగ్గాల్సి ఉంది. అంతర్జాతీయ నేరముఠాల ఆనుపానుల్ని పసిగట్టేందుకు దేశాల మధ్య మెరుగైన సమాచార మార్పిడి ఆవశ్యకమనడంలో మరో మాట లేదు. మనుషుల అక్రమ రవాణాపై అంతర్జాతీయ ఒప్పందాలు దస్త్రాలకే పరిమితమైనన్నాళ్లు నరరూప రాబందుల్లాంటి శరీర బేహారుల దారుణ అకృత్యాలకు అంతుండదు. పిల్లలకు మహిళలకు సామాజికంగా రక్షణ ఛత్రం ఏర్పరచాలన్న సంఘటిత స్పృహ, రాష్ట్రాల తోడ్పాటుతో జాతీయ స్థాయిలో పకడ్బందీగా చట్టం అమలు, అంతర్జాతీయంగా పాలన యంత్రాంగాల నడుమ సమన్వయ సాధన- ఈ త్రిముఖ వ్యూహాన్ని చురుగ్గా అమలుపరచడమే ముష్కర మాఫియా దాష్టీకాలకు సిసలైన విరుగుడు!


'ఈశాన్య' పవనాలు ఎటువైపు?

దేశంలోని వాయవ్య, ఈశాన్య ప్రాంతాలు ఎప్పుడూ వార్తల్లో నానుతూ ఉంటాయి. అభివృద్ధి సంబంధిత అంశాలకన్నా వేర్పాటు, విభజన, తీవ్రవాద సమస్యలే అక్కడ సాధారణంగా చర్చకు వస్తుంటాయి. ఈశాన్య భారతంలో ఈ అంతర్గత సమస్యలు, సంక్లిష్టతలు మరీ ఎక్కువ. సుమారు 200కు పైగా తెగలు, ఉపతెగలు, భాషలు ఉన్న ఈ ప్రాంతంలో- స్వాతంత్ర్యానికి ముందూ ఆ తరవాతా ఉద్రిక్త వాతావరణమే ఉంది. స్వాతంత్ర్య సమయానికి కేవలం అసోం ప్రావిన్సు; త్రిపుర, మణిపూర్ సంస్థానాలే ఉండేవి. తరవాతి దశల్లో సిక్కిం భారత్‌లో విలీనమైంది. ఈశాన్య భారతంలో అసోం, త్రిపుర మినహా మిగిలినవి కొండ ప్రాంతాలు, అవన్నీ పూర్తిగా గిరిజన తెగలతోనే నిండి ఉండేవి. భారత ప్రభుత్వం గట్టిగా పూనుకొని మౌలిక సదుపాయాలు కల్పించి, సమాచార వ్యవస్థను విస్తరించడంతో అక్కడి పరిస్థితుల్లో మార్పు వచ్చింది. అయినప్పటికీ విభజన, వేర్పాటు, తీవ్రవాదాల తాకిడికి ఈశాన్య భారతం అతలాకుతలమవుతూనే ఉంది. ముఖ్యంగా నాగాలాండ్, మిజోరంలలో సంక్షోభం పెచ్చుమీరింది. భారతీయ దళాలు ఏడు దశాబ్దాల కాలంలో ఈశాన్య భూభాగంపై సంపూర్ణ పట్టు సాధించాయనే చెప్పవచ్చు. క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించడం, స్థానిక పాలనకు పెద్దపీట వేయడం, అభివృద్ధికి శ్రీకారం చుట్టడం, దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తూ సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యలవల్ల వేర్పాటువాదం తగ్గుముఖం పట్టింది. అయితే దేశంలోని మిగిలిన భూభాగంతో పోలిస్తే 'ఈశాన్యం' ఇప్పటికీ బాగా వెనకబడి ఉందన్నది కాదనలేని వాస్తవం. అభివృద్ధిపరంగా విస్తరించిన ఈ అగాధాన్ని ఎంత సత్వరం పూడ్చగలిగితే అంత త్వరగా దేశసమగ్రత బలపడుతుంది.

పుట్టెడు సమస్యలు

ఈశాన్య భారతంలో మూడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హిందూ, బెంగాలీ మెజారిటీ ఉన్న త్రిపురపై దేశ రాజకీయాల ప్రభావం ఎక్కువ. జాతీయ పార్టీలదే అక్కడ హవా. 'ఈశాన్యం'లోని మిగిలిన కొండ ప్రాంతాలతో త్రిపురను పోల్చిచూడలేం. మొదట్లో కాంగ్రెస్, ఆ తరవాత మార్క్సిస్టు పార్టీలు త్రిపురలో అధికారం నెరిపాయి. పశ్చిమ్ బంగ తరహాలోనే సుదీర్ఘకాలం మార్క్సిస్టు పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రమిది. పశ్చిమ్ బంగలో జ్యోతిబసు తరహాలోనే అత్యంత ప్రజాకర్షణగల నృపేన్ చక్రవర్తి త్రిపురను చాలా కాలం పాలించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న మాణిక్ సర్కారు సైతం నిజాయతీగా, సాధారణ జీవితం గడిపే వ్యక్తిగా పేరు ప్రఖ్యాతులు గడించారు. ఈశాన్య భారతంలో రెండో అత్యధిక అక్షరాస్యతగల రాష్ట్రమిది. అయితే మౌలిక సదుపాయాల కల్పనలో, పారిశ్రామికీకరణలో, ఉద్యోగాల కల్పనలో ఈ రాష్ట్రం వెనకబడి ఉంది. కొత్తతరం ఆకాంక్షలు అందిపుచ్చుకోవడంలో త్రిపురలోని ప్రస్తుత ప్రభుత్వం విఫలమైనట్లు కనిపిస్తోంది. అయితే ఈ అసంతృప్తిని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మలచుకోలేకపోయింది. ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడంలో భాజపా చాలావరకు సఫలమైందన్న సంకేతాలే ప్రస్తుతం అందుతున్నాయి. కిందటి ఎన్నికల్లో త్రిపురలో భాజపా పాత్ర నామమాత్రం. కానీ, ఈసారి ఆ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా భాజపా మాత్రం బాగా లాభపడబోతోందనడంలో సందేహం లేదు.

మేఘాలయలో కాశీ, జయంతియా, గారో కొండల్లోని తెగలు; కుటుంబాలు ఎన్నికలను ప్రభావితం చేస్తాయి. ఈసారి ఆ రాష్ట్రంలో ఎన్నికలను కుటుంబాల మధ్య కొట్లాటగానే చూడాల్సి ఉంటుంది. మేఘాలయ రాజకీయాలను లోక్‌సభ మాజీ స్పీకర్ పి.ఎ.సంగ్మా సుదీర్ఘకాలం ప్రభావితం చేశారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. సంగ్మా కుమారుడు కాన్రడ్ సంగ్మా ఆధ్వర్యంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ అక్కడ కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇస్తోంది. ఈ దఫా ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్నది విశ్లేషకుల అంచనా! అదే జరిగితే దాన్ని కాంగ్రెసుకి పెద్ద దెబ్బగానే పరిగణించాలి.



మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రేపే

అప్పుడు మొత్తం ఈశాన్య భారతంలో కాంగ్రెస్ దాదాపుగా కనుమరుగైనట్లే భావించాల్సి ఉంటుంది. ప్రస్తుతం మిజోరంలో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో ఉంది. అక్కడ కూడా ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇక భాజపా పాత్ర మేఘాలయలో నామమాత్రమే. ఒకవేళ సమీకరణలు కుదిరితే ఎన్‌పీపీతో కలిసి ఆ పార్టీ అధికారం పంచుకునే అవకాశాలు కొట్టిపారేయలేం. మేఘాలయలో పలుకుబడిగల ఒక్కో కుటుంబంనుంచి ఇద్దరు ముగ్గురు పోటీ చేస్తున్నారు. అక్కడి ప్రధానమైన మూడు కొండ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆ రాష్ట్రంలో మూసివేసిన బొగ్గు గనుల్ని తిరిగి తెరిపించడం అన్నది ప్రధానాంశం. కోర్టు ఆదేశాల కారణంగా మూతపడిన బొగ్గుగనుల వల్ల నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణ జాగ్రత్తల పేరిట బొగ్గు గనుల్ని తెరిపించలేకపోయిందని ప్రజలు భావిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను ఈ అంశం ప్రభావితం చేసే అవకాశాలున్నాయి.

నాగాలాండ్ వ్యవహారం భారత ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగానే తయారైంది. నాగాల కోరికల్ని ఒక్కొక్కటిగా ప్రభుత్వం పరిష్కరిస్తూ వస్తోంది. నాటి అరుణాచల్ ప్రదేశ్ (అప్పుడు ఎన్ఈఎఫ్ఏ అనేవారు)లోని కొంత భాగాన్ని, అసోంలోని కొండ ప్రాంతాన్ని కలిపి మొదట్లో ఓ స్వతంత్ర ప్రాంతం ఏర్పరిచి 1963లో నాగాలాండ్ పేరిట కొత్త రాష్ట్రం ఏర్పరిచారు. అక్కడి పౌరస్మృతి, క్రిమినల్ చట్టాల్లో మరొకరు జోక్యం చేసుకోకుండా అధికారం కల్పించారు. అయినా అసంతృప్తి పూర్తిగా చల్లారలేదు. మణిపూర్ ఉత్తర ప్రాంతం, అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లలో కొన్ని ప్రాంతాలు కలిపి 'గ్రేటర్ నాగాలిమ్' పేరుతో రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని, అధికారాల పరిధిని పెంచాలని ఆందోళనలు కొనసాగాయి. 1990లో ఫిజో మరణం తరవాత 'నాగా నేషనల్ కౌన్సిల్' బలహీనపడింది. రెండుగా చీలిపోయింది. అనంతరం చైనాలో శిక్షణ అందుకున్న 'నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్' పేరిట విభజన వాదులు చురుకుగా కార్యకలాపాలు నిర్వహించారు. ఇదీ ప్రస్తుతం రెండుగా చీలింది. ఇసాక్-ముయిరలు ఒక వర్గంగా; కప్లాంగ్ మరో వర్గంగా విడిపోయారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత 2015లో ఇసాక్-ముయిర వర్గంతో భారత ప్రభుత్వం రహస్య ఒప్పందం కుదుర్చుకొంది. అయితే స్వతంత్ర దేశం తప్ప మరే ప్రతిపాదనకూ అంగీకరించబోమని తెల్చిచెప్పిన కప్లాంగ్ వర్గం ఆ ఒప్పందాన్ని తిరస్కరించింది. ఇప్పుడు అది మియన్మార్‌లో తలదాచుకొని భారత సరిహద్దుల్లో కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

ఎన్నికల ప్రకటన వెలువడిన తరవాత ఆ రహస్య ఒప్పందాన్ని బయటపెట్టాలని, 'గ్రేటర్ నాగాలిమ్' ఏర్పాటు చేయాలని అన్ని తెగలతో కూడిన నాగా సమాజం తీర్మానించింది. అప్పటివరకూ ఎన్నికలను బహిష్కరించాలని తీర్మానించింది. దానిపై ప్రభుత్వం తరఫున సంప్రతింపులు నిర్వహించిన సంధానకర్త రవి- నాగా సమాజానికి సవివర ప్రత్యుత్తరం ఇచ్చారు. ఎన్నికలు, కొత్త ప్రభుత్వ ఏర్పాటు- సమస్య పరిష్కారానికి అవరోధం కాబోవని హామీ ఇవ్వడంతో ఉద్రిక్తతలు తాత్కాలికంగా సమసిపోయాయి. ఎన్నికలు సక్రమంగా జరిగాయి. రాష్ట్రంలో సుమారు 75శాతం పోలింగ్ జరిగింది. కానీ, సుదీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యకు పరిష్కారం కనుగొనడం మాత్రం అంత తేలిక కాదన్నది పరిశీలకుల అభిప్రాయం. 'గ్రేటర్ నాగాలిమ్' ఏర్పాటు క్రమంలో తమ భూభాగం వదులుకునేందుకు ఏ రాష్ట్రమూ అంగీకరించడం లేదు. ఇది మోదీ ప్రభుత్వానికి ఒకరకంగా అగ్నిపరీక్షే! మొన్నటివరకూ 'నాగా' ప్రాంతీయ వాదమే ఎన్నికల అంశంగా ఉంది. తొలిసారి అత్యంత ప్రభావవంతమైన బాప్టిస్టు చర్చి రంగంలోకి దిగింది. ఈ ఎన్నికను త్రిశూలానికి-శిలువకు మధ్య పోటీగా అభివర్ణించింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ బీజేపీకి ఓటు వేయరాదని పిలుపిచ్చింది. నాగాలాండ్‌లో 90శాతానికి పైగా ప్రజలు క్రైస్తవ మతస్థులే. ప్రస్తుతం అధికారంలో ఉన్న నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) గడచిన మూడు దఫాలుగా గెలుస్తూ వస్తోంది. ఆ రాష్ట్రానికి దీర్ఘకాలం ముఖ్యమంత్రిగా చేసిన రియో- ప్రస్తుతం నేషనల్ డెమోక్రటిక్ పీపుల్స్ పార్టీ(ఎన్‌డీపీపీ)ని స్థాపించి భాజపాతో కలిసి బరిలోకి దిగారు. విశేషమేమిటంటే ఎన్‌పీఎఫ్, ఎన్‌డీపీపీ రెండూ ఎన్డీయే భాగస్వామ్య పక్షాలే! నిజానికి అక్కడ ఎవరు గెలిచినా ఎన్‌డీఏ విజయం సాధించినట్లే! కాంగ్రెస్ పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. మొత్తం స్థానాల్లో పోటీ పెట్టేందుకు అభ్యర్థులు దొరక్క- ఆ పార్టీ కొన్ని స్థానాల్లోనే పోటీ చేస్తోంది.

అభివృద్ధే తారక మంత్రం

కొంతకాలం క్రితం వరకూ నాగాలాండ్‌లో మతకోణం లేదు. ఇప్పుడు ఆ ధోరణి బాగా విస్తరించింది. మున్ముందు దీని ప్రభావం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం. ఈశాన్య భారతంలో అసోం, త్రిపురలు హిందూ మెజారిటీ రాష్ట్రాలు. మిజోరం, మేఘాలయ, నాగాలాండ్ పూర్తిగా క్రైస్తవ రాష్ట్రాలు. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లలో హిందువులు, క్రైస్తవులు సమానంగా, పోటాపోటీగా ఉన్నారు. సిక్కిం హిందువులు, బౌద్ధులు ఉన్న రాష్ట్రం. అరుణాచల్ ప్రదేశ్‌లో బౌద్ధం ప్రబలంగా ఉండేది. గడచిన ఇరవయ్యేళ్ల కాలంలో మత మార్పిడుల కారణంగా ఆ రాష్ట్రంలో క్రైస్తవ మతం యాభైశాతానికి చేరింది. వేర్పాటువాద సమస్యలతో అట్టుడికిన ఈశాన్య భారతానికి మత సమస్య సైతం జతకూడితే పరిస్థితి మరింత దిగజారుతుంది. అన్ని సమస్యలకూ అభివృద్ధి మాత్రమే ఏకైక పరిష్కారంగా కనిపిస్తోంది. 'తూర్పు దిశగా అడుగు' పేరిట భారత ప్రభుత్వం ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకునేందుకు కొంతకాలంగా చురుగ్గా కదులుతోంది. అందులో భారత్-మియన్మార్-థాయ్‌లాండ్ 'త్రిముఖ రహదారి'ని అభివృద్ధి చేస్తోంది. సుమారు 1400 కి.మీ మేర విస్తరించే ఈ రహదారిని 2019 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని సంకల్పించారు. దీనితో ఈశాన్య భారతం దశ, దిశ మారిపోతుందనడంలో సందేహం లేదు. ఈ రహదారి ద్వారా మున్ముందు వియత్నాం, లావోస్, కంబోడియా వరకు రోడ్డుమార్గం ద్వారా సరకు రవాణా చేపట్టవచ్చు. ఈ రహదారి పూర్తయ్యేలోపే మౌలిక సదుపాయాల్ని విస్తృత పరుచుకోవాలని భారత ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. అదే గనక జరిగితే ఈశాన్య భారతానికి మహర్దశ పట్టినట్లేనని భావించాలి.

- కె.రామకోటేశ్వరరావు

వేర్పాటు వాదాలు-విదేశీ కుట్రలు



భారత్ పక్షాన బంగ్లా ప్రధాని షేక్ హసీనా

నాగాల్లో ఫిజో, మిజోరంలో లాల్‌డెంగా వేర్పాటు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఆరు, ఏడు దశకాల్లో వేర్పాటువాదులకు పాకిస్థాన్, చైనాల నుంచి పూర్తి సహాయ సహకారాలు అందాయి. ఆనాటి తూర్పు పాకిస్థాన్‌లో వేర్పాటువాదులకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి, శిక్షణ ఇవ్వడంతోపాటు ఆయుధాలనూ సమకూర్చారు. చైనా సైతం బర్మా సరిహద్దుల్లో ఉన్న యున్నాన్ 'ప్రావిన్సు'లో వేర్పాటువాదులకు శిక్షణ ఇచ్చింది. ఒకరకంగా ఈశాన్య ప్రాంతంలో భారతదేశం అంతర్యుద్ధాన్నే చవిచూసిందని చెప్పవచ్చు. 1971లో బంగ్లాదేశ్ విమోచన జరగడం 'ఈశాన్యం'లో వేర్పాటువాదులకు కోలుకోలేని దెబ్బ! 1978లో చైనాలోనూ డెంగ్ జియావో పింగ్ నాయకత్వాన అధికార మార్పిడి వారి ఆశలను నీరుగార్చింది. లాల్ డెంగా, ఫిజోల తరవాతి దశలో పోరాటం తగ్గుముఖం పట్టింది. మరీ ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నాయకత్వాన అవామీలీగ్ అధికారంలోకి వచ్చాక వేర్పాటువాదుల ఆటలు సాగలేదు. భారత ప్రభుత్వానికి హసీనా పూర్తి సహాయ సహకారాలందించారు.

ఉపాధి బాటలో చదువు

అనేక సమస్యలకు ఏకైక సమాధానం విద్య! అందుకే సామాజిక సంస్కర్తలు దేశంలో స్వాతంత్ర్య ఉద్యమానికి దీటుగా విద్యావ్యాప్తి కోసం కృషి సాగించారు. నాడు 1931లో 7.2 శాతం ఉన్న అక్షరాస్యత, 1947నాటికి 12.2 శాతానికి పెరిగింది. దాన్ని మరింత పెంచేందుకు స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపట్టాయి. 2011 అంచనాల ప్రకారం, భారత్‌లో అక్షరాస్యత 74 శాతం. విద్యావ్యాప్తిలో భాగంగా వివిధ ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారు. విద్యాహక్కు చట్టం (2009) తెచ్చారు. చదువు అనేది అందరి హక్కు. విద్యావంతులైన పౌరులు ఉన్నప్పుడే, వివేకవంతమైన సమాజం రూపొందుతుంది. ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల వయసు గల ప్రతి బాలుడు, బాలికకు విద్యను పొందే హక్కు ఉంది. వ్యక్తి నిర్మాణం, విలువల స్థాపన దాని లక్ష్యాలు. ప్రస్తుత విద్యారంగ స్థితిపై ప్రభుత్వం, ఇతర సంస్థలు నిర్వహించిన సర్వేలు విద్య లక్ష్యాల్ని తిరిగి నిర్వచించాల్సిన ఆవశ్యకతను ప్రస్ఫుటం చేస్తున్నాయి.

దేశంలో సామర్థ్యాలకు భిన్నంగా కోర్సుల్ని ఎంచుకుంటున్నవారు 74.70 శాతం ఉన్నారు. చదువుతున్న పాఠ్యాంశాల పట్ల 13.54 శాతం విద్యార్థులకు మాత్రమే పూర్తి సంతృప్తి ఉంది. పాక్షికంగా సంతృప్తి కలిగినవారు 68.89 శాతం అని సర్వే ఫలితాలు విశ్లేషిస్తున్నాయి. పదో తరగతి అనంతర కోర్సులు, వాటికి అవసరమైన సామర్థ్యాలు, ఎలాంటి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నవి తెలియనివారి శాతమే ఎక్కువగా ఉంటోంది. విద్య ప్రధాన ప్రయోజనం పట్టభద్రుల్ని తయారుచేయడం ఒక్కటే కాదు. వ్యక్తి తన కాళ్లపై తాను నిలబడేలా చేయాలి. కుటుంబపోషణ చేసుకునే సామర్థ్యం, కౌశలాన్ని మెరుగుపరచుకోవడం విద్య ద్వారా సులభసాధ్యం కావాలి. నైపుణ్యం గలవారి కోసం వ్యవస్థ ఎదురుచూపులు ఒక వైపు. విద్యాసంస్థల నుంచి నైపుణ్యరహితంగా బయటికొస్తున్న యువత మరొక వైపు! ఈ స్థితిగతులు చదువు మూలాధార లక్ష్యాల్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నిపుణుల్ని తయారుచేయలేకపోవడం, ఎటువంటి ఉపాధీ కల్పించలేకపోవడం- కచ్చితంగా దూరదృష్టి లోపమే! ఒక ఇంజినీరు తయారు కావడానికి రూ.6.5 లక్షలు ఖర్చవుతుంది. అది ప్రభుత్వ ఉపకార వేతనం, లేదా తల్లిదండ్రుల శ్రమ ఫలితం ఏదైనా కావచ్చు. పాఠశాలల్లో ఒకటి నుంచి పది తరగతుల పిల్లల సంఖ్య, ఉపాధ్యాయులకు వచ్చే జీతాల్ని గణిస్తే- సగటున ఒక విద్యార్థిపై ప్రభుత్వం పెడుతున్న ఖర్చు నెలకు రూ.2,700. సంవత్సరానికి ఆ మొత్తం రూ.32,400 ఉంటుంది. దీనికి నిర్వహణ వ్యయం, పుస్తకాల ఖర్చు వంటివి అదనం. 2018-19 ఆర్థిక సంవత్సరానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాల వాటా కాక, కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కేటాయించింది రూ.85,010 కోట్లు. ఇది సగటు పౌరులు తమ సంపాదన నుంచి కట్టే వివిధ పన్నుల మొత్తం! విద్య ముఖ్య లక్ష్యం- సంపూర్ణ అక్షరాస్యత సాధించడం. చదువుకున్నవారికి ఉపాధి చూపించడం ఆ లక్ష్యాన్ని దృఢతరం చేస్తుంది.

విశ్వవిద్యాలయాల నియమాల్ని అనుసరించి, తరగతులకు 80 శాతం హాజరు ఉన్నవారినే పరీక్షలకు అనుమతిస్తారు. అంటే, పట్టభద్రులందరూ సాంకేతికంగా ఆ మేరకు హాజరుతో విద్యను పూర్తిచేసి, పరీక్షల్లో విజేతలుగా నిలిచి



పంథా మారితేనే ప్రయోజనం

నవారే! అలాంటిది, పీజీ అయిన వ్యక్తి తక్కువ మొత్తాలకు ప్రైవేటు పాఠశాలలో ఉద్యోగం చేయడం, ఇంజినీరింగ్ పూర్తయిన వ్యక్తి మరోచోట పనిచేయడం వంటివి సమర్థనీయాలేనా? ప్రజలందరినీ అక్షరాస్యుల్ని చేయడం ప్రభుత్వాల బాధ్యత. వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల వద్ద నమోదైన శిక్షిత ఉపాధ్యాయ అభ్యర్థుల వివరాలుండాలి. రానున్న సంవత్సరాలకు ఏర్పడే ఉపాధ్యాయ ఖాళీల సమాచారం తెలియాలి. ఎంతమందిని శిక్షితులుగా చేయాలన్న అంచనాలు ప్రభుత్వం వద్ద ఉండాలి. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేయండని చెప్పడం సరికాదు. విద్య, సమాజం పరస్పర ఆధారితాలు. చదువు సమాజ వికాసానికి ఉపయోగపడాలి. విద్య లక్ష్యాల్ని సమాజమే నిర్వచిస్తుంది. పిల్లల్ని పాఠశాలకు పంపే తల్లిదండ్రుల లక్ష్యాల్లో 'సామాజిక స్థిరీకరణ' అతి ముఖ్యమైనది. తమ పిల్లలకు విద్య ద్వారా ఉత్తమ ఉపాధి లభించాలని వారు కోరుకుంటారు. తమకన్నా మెరుగైన ఆర్థిక స్థితిలో తమ పిల్లలుండాలని ఆశిస్తారు. దానికి విద్యే సాధనంగా మారాలి. దాని లక్ష్యం ఉపాధి కానప్పుడు, పాఠశాలకు తమ పిల్లల్ని పంపే తల్లిదండ్రులు ఎందరుంటారు? చదువు సమున్నత విలువల పరిరక్షణతో పాటు, ఉపాధినీ చూపాల్సిన బాధ్యత వ్యవస్థకు ఉంటుంది. పురోగమిస్తున్న దేశానికి సమర్థులు, నైపుణ్యవంతులైన మానవ వనరుల్ని అందించడమే విద్య ప్రధాన లక్ష్యం కావాలి. బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలన్న లక్ష్యం ఉన్నతమైనదైనా, ఇరవై సంవత్సరాల తరవాత వారే కుటుంబ పోషణ చేయాలన్నది విస్మరించడం విద్యా వ్యవస్థ వైఫల్యమే! విద్య లక్ష్యాలను పునర్ నిర్వచించుకోవాల్సిన సమయమిది.

విద్యాసంస్థలు తమ విద్యార్థులకు మార్గనిర్దేశక సమావేశాలు నిర్వహించాలి. పాఠశాల మొత్తం విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయుల సంఖ్యతో భాగించి, ప్రతి ఒక్కరికీ తరగతి నుంచి కేటాయించాలి. ఆ ఉపాధ్యాయుడు తనకు కేటాయించిన విద్యార్థుల వివరాల రికార్డును, వారి పాఠశాల ప్రవేశం నుంచి నిష్క్రమణ వరకు నిర్వహించాలి. ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు సహజ సామర్థ్య, కౌశల, అభిరుచి పరీక్షలు జరపాలి. మూల్యాంకనం చేసి, గుర్తించిన విషయాల్ని విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో చర్చించాలి. తగిన సూచనలు చేయాలి. పదో తరగతిలో ఉన్నప్పుడే, తరవాత చదవాల్సిన కోర్సుల మార్గదర్శనం ఉండాలి. ఎక్కువమంది పిల్లలు వృత్తివిద్య కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలి. పారిశ్రామిక, సమాజ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు ప్రవేశపెట్టాల్సిన అవసరముంది. సంప్రదాయ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు అదనంగా ప్రతి విద్యా సంవత్సరంలోనూ స్వల్పకాలిక ఉపాధి కల్పన అంశాల్ని తప్పనిసరి చేయాలి. పారిశ్రామిక, సేవా రంగాల నిపుణుల సలహాలతో- రానున్న సంవత్సరాల్లో ఏర్పడే ఉపాధి అవకాశాల అంచనాల్ని తరచుగా రూపొందించాలి. విద్యార్థుల సహజ సామర్థ్యాలకు అనుగుణంగా చదువు చెబితేనే, అది సమాజానికీ ప్రయోజనకారి అవుతుంది. సెకండరీ స్థాయిలోనే వారి అభిరుచుల ప్రాతిపదికన లక్ష్యాలు నిర్ణయించాలి. అందుకు కావాల్సింది భారీ మొత్తాలు కాదు- విద్యావ్యవస్థను తిరిగి నిర్మించాలన్న కృతనిశ్చయం ఉంటే అదే పది వేలు!

- డాక్టర్ మండల చంద్రశేఖర్ గౌడ్

ఈనాడు లేఖలు

పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

కొత్త పరిశ్రమల స్థాపన, విస్తరణ, అభివృద్ధిపై ఉభయ రాష్ట్రాలూ దృష్టి కేంద్రీకరించాలి. అనేక సహజ వనరులున్నాయి. ఆసక్తి, శక్తి గల యువత ఉంది. అటువంటి ఔత్సాహికులకు భరోసా ఇవ్వడం ద్వారా రెండు ప్రభుత్వాలూ సత్వర పురోగతి సాధిస్తాయి. ముందుగా నూతన పారిశ్రామిక సంస్థల్ని స్థాపించే అవకాశాలపై అవి సమగ్ర అధ్యయనం సాగించాల్సి ఉంది. పెట్టుబడులకు ఎన్ని అవకాశాలున్నాయో అన్నింటినీ వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. ఆయా పరిశ్రమలకు వివిధ రకాల అనుమతులు సత్వరమే లభించేలా చర్యలు చేపట్టాలి. అనుమతులు మంజూరుచేయడంలో జాప్యం చోటుచేసుకుంటే, వాటికి కారణాల్ని సంబంధిత శాఖల నుంచి రాబట్టాలి. అవసరమైతే అధికారులకు సంజాయిషీ నోటీసులు జారీచేయడంలో, కఠినంగా వ్యవహరించడంలో ఎంతమాత్రం వెనకాడకూడదు. ప్రభుత్వాలు తీసుకునే ముందు జాగ్రత్తలు, చేపట్టే చర్యలు రెండు రాష్ట్రాల్లోనూ పారిశ్రామిక అభ్యున్నతికి ఎంతో దోహదపడతాయనడంలో సందేహం లేదు.

- ప్రభాకర్ తల్లాప్రగడ, హైదరాబాద్

'సారాక్షసి' పనిపట్టాలి

వ్యసనంగా మారిన మద్యపానం పలువురి జీవితాల్ని ఛిన్నాభిన్నం చేస్తోంది. అనేకచోట్ల చిన్నపాటి దుకాణాల్లోనూ మద్యం విక్రయిస్తున్నారు. దాన్ని సేవించి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నవారు ఎంతోమంది ఉన్నారు. బహిరంగ మద్యసేవనాన్ని ప్రభుత్వం అరికడితే తప్ప, పరిస్థితి అదుపులోకి రాదు. అధికారులు బృందాలుగా ఏర్పడి సోదాలు జరపాలి. విచ్చలవిడిగా సాగిపోతున్న సారా క్రయ విక్రయాల్ని అరికట్టేందుకు ప్రాంతాలవారీగా మెరుపు దాడులు నిర్వహించడం ముఖ్యం.

- కె.వి.ప్రహాస్, చెన్నై

మానవీయ మహేతిహాసం

రామకథను వాల్మీకి వినిపించి ఎన్ని వేల ఏళ్లు గడిచాయో! అది మొదలు, సీతారాములు భారతీయులకు ఆరాధ్య దంపతులయ్యారు. సర్వ పశు పక్షి జాతుల నుంచి విడివడి విశుద్ధం, విశిష్టం అయిన జీవనపథాన్ని ఏర్పరచుకుంది మానవజాతి. వారికి లభించిన వరం దాంపత్య జీవితం. ఆ జీవన రహస్యాన్ని వాల్మీకి మహర్షి తన రామాయణం నిండా నిక్షేపించాడు.

లోక వ్యవహారాన్ని విస్పష్టంగా బోధించిన మహాకావ్యం రామాయణం. ఆదికవి వాల్మీకి నుంచి నేటి వరకు రమణీయమైన ఆ రామకథ పలు భాషల్లో, అనేక రీతుల్లో రూపుదిద్దుకొంది. భారతావనిలోనే కాకుండా, ఈ సంస్కృతి ప్రసరించిన అన్యదేశాల్లోనూ ప్రశస్తి పొందింది.

రామాయణం మానవజాతికి ధర్మ పద్ధతిని ఉపదేశిస్తుంది. అది వేదం వంటిది. పురాణాలు రామాయణాన్ని 'మిత్ర సమ్మితం'గా చెబుతాయి. కావ్యాలు నెచ్చెలిగా వర్ణిస్తాయి.

లోకంలో రామాయణం ఒక ఇక్షు సాగరం. ఎక్కడ దోసిలిపట్టి తాగినా తియ్యదనమే! మానవజాతి తాపత్రయాలను పోగొట్టి, శరణాగతి తత్వానికి ప్రాధాన్యమిచ్చి, ఒక్కొక్క కాండలో ఒక్కో రసావిష్కరణ చేశాడు వాల్మీకి.

మానవ విలువల్ని అన్వేషిస్తూ రాముడు పయనం సాగించాడు. తాను మానవుడైనందుకు గర్వించాడు. మనసా వాచా కర్మణా పరిపూర్ణ మానవుడిగా జీవించాడు. ప్రతి దేహంలోనూ రాముడు అంతర్యామి. ప్రతి అంతరంగంలోనూ ఆయన ఆనందధాముడు, ఆత్మారాముడు. 'రామ' శబ్దం రామణీయకానికి మారుపేరు.

సీతాదేవి ధైర్య, కరుణా సమన్విత. మహోన్నత ప్రేమమూర్తి. కలవరపరచే కష్టాలు, అవరోధాలను జీవితం నిండా దర్శించింది. తన భర్త పట్ల అచంచల విశ్వాసం, అంకిత భావం గల నారీ శిరోమణి. ఆమె అంటే రావణుడికీ గౌరవభావమే. రామచంద్రుడి ఘనతను ఆమె పెంచింది. ఆయనను సంపూర్ణ మానవుణ్ని చేయడానికి తన జీవితాన్నంతా వెచ్చించింది.

లక్ష్మణ భరత శత్రుఘ్నులు ఓంకారంలోని అకార ఉకార మకారాలనే బీజాక్షరాలకు



అంతర్యామి

రూపాలు. ఆ మూడూ చేరి 'ఓంకారం' అనే రామశబ్దం ఏర్పడింది. రాముడు శబ్ద బ్రహ్మం. లక్ష్మణుడు గొప్ప సేవకుడు. భరతుడు సత్యశీలుడు. శత్రుఘ్నుడు గుణవంతుడు. హనుమ శక్తి సంపన్నుడైన రామదూత, నీతివర్తనుడు.

విశ్వ సోదరభావానికి, మానవ గౌరవానికి, సామాజిక సమన్వయానికి పునాది కుటుంబం అని రామాయణం గుర్తించింది. భిన్న సంస్కృతుల్ని అది దర్శించింది. వాటి మధ్య సమతూకం సాధించగలిగింది. అయోధ్య, కిష్కింధ, లంక- ఆ మూడు చోట్ల భిన్న పరిస్థితులున్నాయి. అక్కడ సంస్కృతీ సంపన్నులైన రామ సోదరులు, సుగ్రీవుడు, విభీషణుడు- వీరందరి మధ్యనా వాల్మీకి సమతుల్యత సాధించడాన్ని రామాయణం ప్రస్ఫుటీకరిస్తుంది.

వేద సంస్కృతి ఒక్కటే కాదు- క్రూర దానవ సంస్కృతి, పక్షి సంస్కృతి వంటివీ రామాయణంలో ప్రతిబింబిస్తాయి. జటాయువు, సంపాతి వంటి విహంగాల్లో నిస్వార్థ సేవ, నిబద్ధత, త్యాగచింతన గోచరిస్తాయి.

మానవజాతికి రామాయణం బహుముఖ సందేశమిస్తుంది. నిత్యసత్యాలతో ప్రకాశించే కావ్యమది. శాశ్వత విలువల్ని బోధించే మహేతిహాసంగా అది ఖ్యాతి గడించింది. మానవాళికి ఎప్పటికీ అవసరమైన మహోన్నత కావ్యం రామాయణం. దాన్ని విన్నా, చదివినా, దృశ్యరూపంలో చూసినా జీవితం చరితార్థమవుతుందని భారతీయుల ప్రగాఢ విశ్వాసం!

- డి.భారతీదేవి

పార్లమెంటు వేదికగా తేల్చుకుందాం

- ప్రత్యేక హోదా సాధన కోసం అఖిలపక్షం కార్యాచరణ
- పార్టీలన్నీ ఒకే అజెండాగా పోరాడాలని పిలుపు

ఈనాడు డిజిటల్ – గుంటూరు



గుంటూరులో జరిగిన సదస్సులో నినదిస్తున్న అఖిలపక్ష నాయకులు రఘువీరారెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మధు, రామకృష్ణ, చలసాని శ్రీనివాస్, సినీనటుడు శివాజీ, కొణతాల రామకృష్ణ, తదితర నాయకులు

ప్రత్యేక హోదా సాధన కోసం పార్లమెంట్ వేదికగా తాడో పేడో తేల్చుకుందామని ప్రత్యేక హోదా సాధన సమితి తీర్మానించింది. పార్టీలన్నీ జెండాలను పక్కన పెట్టి ఒకే అజెండాగా ముందుకు రావాలని పిలుపునిచ్చింది. గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అధ్యక్షతన ప్రత్యేక హోదా రాష్ట్ర సదస్సు గురువారం నిర్వహించారు. కాంగ్రెస్, వైకాపా, వామపక్షాలు, లోక్‌సత్తా, జనసేన తదితర దాదాపు 16 రాజకీయ పార్టీలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రత్యేక హోదా సాధించేందుకు కేంద్రంపై ఏ విధంగా ఒత్తిడి తీసుకురావాలో కార్యాచరణ రూపొందించారు. 5 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో తెలుగువారి గళాన్ని బలంగా వినిపించేందుకు కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

కేంద్రం వద్ద ఆత్మగౌరవం తాకట్టు

తెలుగువారి ఆత్మగౌరవం కోసమంటూ పుట్టిన తెదేపా ప్రస్తుతం కేంద్రం వద్ద ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతోందని పీసీసీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల రెండో తేదీన జాతీయ రహదారుల దిగ్బంధం, మార్చి 6, 7వ తేదీల్లో దిల్లీలో ఆత్మగౌరవ దీక్ష చేపడతామన్నారు. హోదా కోసం వైకాపా ఎంపీలు రాజీనామా చేస్తారని ఆ పార్టీ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధన కోసం అఖిలపక్షంతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా ఇవ్వకపోతే మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం ప్రత్యేక హోదా సాధ్యంకాదని సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. జనసేన, లోక్‌సత్తా, ఆమ్‌ఆద్మీ పార్టీల రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని ప్రత్యేక హోదా సాధన కోసం కలిసి కట్టుగా పోరాడుదామని ప్రతినబూనారు.

గవర్నర్ రాజకీయాలు చేస్తున్నారు: శివాజీ

సినీనటుడు శివాజీ మాట్లాడుతూ గవర్నర్ నరసింహన్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుపై విమర్శలు చేశారు. గవర్నర్ నరసింహన్ రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ భాజపా, తెదేపాల మధ్య రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్రం వద్ద తాకట్టు పెట్టి ఉపరాష్ట్రపతి అయ్యారన్నారు.

15 పార్టీలు, 45 ప్రజాసంఘాలతో...

ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలు, పార్లమెంటులో నాడు ప్రధాని ఇచ్చిన హామీల సాధన కోసం ఐక్య కార్యాచరణ సమితి(ఐకాస) ఏర్పాటు చేసేందుకు ప్రజా సంఘాలు యోచిస్తున్నాయి. హోదా సాధన సమితి రాష్ట్ర స్థాయి సదస్సులో ఈ అంశంపై ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు ఐకాస ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా వైకాపా, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), జనసేన, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. 15 రాజకీయ పార్టీలు, 45 ప్రజాసంఘాల భాగస్వామ్యంతో ఐకాసను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. విద్యార్థి సంఘాల ఐకాస ఏర్పాటుకు అందరూ అంగీకరించినట్లు సమాచారం. త్వరలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఎయిడెడ్ పోస్టుల భర్తీకి ప్రత్యేక షెడ్యూల్

గతంలో నియామకాలపై ఇప్పటికీ పూర్తికాని విచారణ

ఈనాడు, అమరావతి: ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక షెడ్యూల్ విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. గతంలో నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం పోస్టుల భర్తీని నిలుపుదల(అభయాన్స్)లో పెట్టింది. ఈ ఉత్తర్వులపై చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇటీవల పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో ప్రత్యేక షెడ్యూల్ విడుదల చేసి భర్తీని పర్యవేక్షించాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 78 పాఠశాలల్లో పోస్టుల భర్తీకి గతంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీటిల్లో సుమారు 350వరకు పోస్టులున్నట్లు అంచనా. ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లో ఈ పోస్టులు ఎక్కువగా ఉన్నాయి. ఒక్క ప్రకాశంలోనే సుమారు 140 వరకు ఉన్నాయి. కడప, గుంటూరు, కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకుల(ఆర్జేడీ) పరిధిలో ఇప్పటికే 77 ఉద్యోగాల వరకు నియామకాలు పూర్తి చేసినట్లు తెలిసింది. ఈ ప్రక్రియలో ఒకవైపు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు విచారణ కొనసాగుతుండగానే నియామక ఉత్తర్వులు జారీ చేయడం, ఎంపికైన వారు పాఠశాలల్లో చేరిపోవడంపై ఆరోపణలు వచ్చాయి.



కందిపప్పు పంపిణీ చేస్తున్న పుష్పరాజ్. చిత్రంలో జేసీ మల్లికార్జున, అధికారులు

చౌక దుకాణాల్లో రూ.40కే కిలో కందిపప్పు

ఆహార కమిషన్ ఛైర్మన్ పుష్పరాజ్

కాకినాడ, న్యూస్‌టుడే: చౌక దుకాణాల్లో ఈ నెల నుంచి కిలో కందిపప్పు రూ.40కు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ జేఆర్ పుష్పరాజ్ చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని ఓ చౌక దుకాణంలో రూ.40కే కిలో కందిపప్పు పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని తెల్లకార్డులకు ఈ నెల నుంచి బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు కిలో చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. డీలర్లు వీటిని సక్రమంగా అందజేయాలని ఆదేశించారు. డీలర్లు సమయపాలన పాటించకపోతే అపరాధ రుసుములతో పాటు అనుమతులు రద్దు చేస్తామన్నారు. కార్డుదారుడు, డీలరు, రైస్ మిల్లర్లు రేషన్ బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ మల్లికార్జున, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాదరావు, జిల్లా మేనేజరు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

స్థలాల లభ్యతను బట్టి ఇళ్ల నిర్మాణం

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ నగరాలు సహా పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో స్థలాల లభ్యతను బట్టి జీ ప్లస్ టు, ఆపై తరహాలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ అధికారులకు సూచించారు. ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీపై గురువారం సచివాలయంలో రెవెన్యూ, పురపాలక శాఖ ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మీ కోసం' పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు మీ కోసం పోర్టల్‌లో ఇళ్లస్థలాల కోసం 18,78,970 మంది దరఖాస్తు చేసుకోగా 14,900 మందికి ఇళ్ల పట్టాలు అందించినట్లు సీసీఎల్‌ఏ అనిల్‌చంద్ర పునేఠ. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మరో 2 లక్షల దరఖాస్తులను వివిధ కారణాలతో అనర్హమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా 2014 జూన్ నుంచి ఇప్పటివరకు 2,29,891 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ స్థలాలకు సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 1,73,526 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్‌మోహన్‌సింగ్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే కందులు కొనుగోలు చేయాలి

కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 5450 ప్రకారం రైతుల నుంచి కందులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కందుల కొనుగోలుపై గురువారం సచివాలయంలో సీఎస్ అధికారులతో సమీక్షించారు. కేంద్రం ఎక్కువ మొత్తంలో కందులను కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున లేఖ రాసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ ఎండీ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా 45 వేల మెట్రిక్ టన్నులకు అనుమతిచ్చిందని తెలిపారు. అదనంగా మరో 55 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అనిల్‌చంద్ర పునేఠ, మన్మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చకుంటే సేవలు ఆపేస్తాం: వైద్యుల సంఘం

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఎంబీబీఎస్ వైద్యులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ, పదవీ విరమణ వయస్సు 63 సంవత్సరాలకు పెంచకుండా అన్యాయం చేసిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం(ఏపీజీడీఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భరత్ రావు ఆరోపించారు. విజయవాడలో సిద్ధార్థ వైద్య కళాశాలలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌రావు మాట్లాడుతూ కేంద్ర సర్వీసులో డాక్టర్లందరికీ(స్పెషలిస్టు, ఎంబీబీఎస్) పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పరిధి ఆసుపత్రుల్లో పనిచేస్తున్న స్పెషలిస్ట్ వైద్యులకు రిటైర్మెంట్ వయస్సు 63 ఏళ్లకు పెంచి, గ్రామాల్లో పేదలకు సేవలందిస్తున్న ఎంబీబీఎస్ వైద్యులకు 60ఏళ్లే ఉంచి వివక్ష చూపుతోందని విమర్శించారు. ఇలాంటి అసమానతలతో పదోన్నతుల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందారు. వైద్యులందరికీ ఒకేలా పదవీ విరమణ వయస్సు ఉండాలని ఆయన కోరారు. తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 5 నుంచి 15 వరకు రోగులకు ఇబ్బందులు రాకుండా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే గ్రామీణ పీహెచ్‌సీలతో పాటు, ఏరియా ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలోని ఎంబీబీఎస్ వైద్యుల సేవలు నిలిపివేస్తామని ప్రకటించారు. 18న చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీజీడీఏ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ దుర్గా ప్రసాద్, గులాబ్ రాజ్‌కుమార్, గోపాలకృష్ణ, రామారావు, పుష్పరాజ్ పాల్గొన్నారు.

సీఎం పదవి జగన్‌కు అందని ద్రాక్షే: శిద్దా రాఘవరావు

ఈనాడు డిజిటల్, అమరావతి: ముఖ్యమంత్రి పదవి కోసం తహతహలాడుతున్న జగన్‌కు అది అందని ద్రాక్షే అవుతుందని మంత్రి శిద్దా రాఘవరావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జగన్ వాడుతున్న పదజాలం తలదించుకునేదిగా ఉందని విమర్శించారు. గురువారం మంత్రి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధికారం కోసం సాధ్యం కాని హామీలిస్తే ప్రజలు నమ్మరని పేర్కొన్నారు.

ఆర్కేనగర్‌లోనే కొత్త పార్టీ ప్రకటన

టీటీవీ దినకరన్ వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ఆర్కేనగర్‌లోనే తన కొత్త పార్టీ గురించి ప్రకటన విడుదల చేయనున్నట్టు ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ తెలిపారు. నియోజకవర్గంలోని కొరుక్కుపేట కన్నగి నగర్‌లో గురువారం జరిగిన జయలలిత జయంత్యుత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల సందర్భంగా ప్రసంగిస్తూ... ఆర్కేనగర్‌లో తన విజయం ద్వారా మరో అధ్యాయాన్ని ఇక్కడి ప్రజలు ప్రారంభించారని దినకరన్ తెలిపారు.

రాష్ట్రానికి హోదానే సంజీవిని

- ప్యాకేజీతో మోసపోవద్దు
- దండుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్యాకేజీ అంటున్నారు
- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడిలో వైకాపా నేతలు
- పార్టీ నేతలతో సమీక్షించిన విపక్ష నేత జగన్



విశాఖలో నిర్వహించిన ఆందోళనలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న వైకాపా నాయకులు

ఈనాడు అమరావతి: ప్రత్యేక హోదానే రాష్ట్రానికి సంజీవిని..ప్రత్యేక ప్యాకేజీతో మోసపోవద్దు అంటూ వైకాపా నేతలు, కార్యకర్తలు నినదించారు. ప్రత్యేకహోదా ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడి చేపట్టారు. కలెక్టర్లు, ఇతర అధికారులకు నేతలు విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద వైకాపాకు మద్దతుగా సీపీఐ, సీపీఎం పార్టీ జిల్లా నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. "ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పిందంటూ రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నారు..అలా మేమేమీ చెప్పలేదని అదే 14వ ఆర్థిక సంఘం ఛైర్మన్ స్వయంగా లేఖద్వారా సమాధానమిచ్చారు. చంద్రబాబు చెబుతున్న ప్యాకేజీతో ప్రజలు మోసపోవద్దు. ప్రత్యేకహోదా కోసం పోరాటం చేయడంలో దేనికీ వైకాపా భయపడదు. ఈనెల 21న కేంద్రంపై అవిశ్వాసం పెడతాం..అప్పటికీ కేంద్రంలో స్పందన రాకపోతే ఏప్రిల్‌లో పార్లమెంట్‌లోనే ఎంపీలంతా రాజీనామా చేసి వస్తాము"అని ఒంగోలులో ధర్నాలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి తీరని ద్రోహం చేసిన చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి ఇద్దరూ చిత్తూరు జిల్లావాసులే కావడం దౌర్భాగ్యమని.. ఆ జిల్లా వైకాపా సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో విమర్శించారు. ప్యాకేజీ అయితే దండుకోవచ్చనే చంద్రబాబు హోదా వద్దు ప్యాకేజీ కావాలంటున్నారని మండిపడ్డారు. విశాఖ నగరపాలక సంస్థ వద్ద ధర్నాలో పాల్గొన్న వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదా కోసం కేంద్రంపై పార్లమెంట్‌లో అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, వేరే పార్టీలు అవిశ్వాసం పెట్టినా మద్దతిస్తామన్నారు. విజయవాడలో ప్రదర్శన నిర్వహించిన పార్టీ నేతలు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ ఆళ్లనాని మాట్లాడారు.

చీమకుర్తిలో జగన్

ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా చీమకుర్తిలో ఉన్న వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి గురువారం అక్కడి క్యాంపు నుంచే ఆందోళనలను పర్యవేక్షించారు. పార్టీ నేతలతో ఫోన్‌లో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించారు. జగన్‌ను ఆయన సతీమణి భారతి గురువారం అక్కడే క్యాంపులో కలిశారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులు జగన్‌తో భేటీ అయ్యారు.

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

ఉద్యోగుల సంఘం డిమాండ్

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం గడువు ముగుస్తున్నందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ప్రస్తుతం గుర్తింపులో ఉన్న ఎన్‌ఎంయూ గడువు ఈ నెల 3వ తేదీతో ముగుస్తుందనీ, సంస్థ యాజమాన్యంతో చర్చించి ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని కార్మిక శాఖ కమిషనర్‌కు ఈయూ నాయకులు గురువారం విజయవాడలో లేఖ ఇచ్చారు. ఈయూ ప్రధాన కార్యదర్శి కె.పద్మాకర్ మాట్లాడుతూ ప్రస్తుత గుర్తింపు సంఘం గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, జోనల్ వర్క్‌షాపుల దగ్గర ద్వార భేటీలు(గేట్ మీటింగ్) నిర్వహించబోతున్నామన్నారు.

26న ఎస్టీ కమిషన్ పోలవరం పర్యటన

- 27న ముఖ్యమంత్రి, అధికారులతో సమావేశం
- పునరావాస చర్యలపై కమిషన్‌కు వివరించిన రాష్ట్ర అధికారులు

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఈ నెల 26న జాతీయ ఎస్టీ కమిషన్ బృందం పర్యటించనుంది. పునరావాసం, పరిహారం తదితర అంశాలపై స్థానికులతో సమావేశం కానుంది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూడా భేటీ అవుతుంది. గురువారమిక్కడ పునరావాసం, పరిహారాలకు సంబంధించి జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఏపీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ) ద్వారా సమగ్రంగా వివరించారు. కమిషన్ కార్యదర్శి రాఘవచంద్ర, సంయుక్త కార్యదర్శి ఎస్‌కే రథ్, పోలవరం ప్రాజెక్టు పునరావాస కమిషనర్ రేఖారాణి, పశ్చిమగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ కోటేశ్వరరావు, ఐటీడీఏ రంపచోడవరం పీవో దినేష్, రంపచోడవరం సబ్‌కలెక్టర్ వినోద్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుమారు గంటకుపైగా ఈ సమావేశం జరిగింది. ఇప్పటి వరకు 3వేల మందిని ప్రాజెక్టు ప్రాంతం నుంచి తరలించామని రాష్ట్ర అధికారులు కమిషన్‌కు తెలిపారు. 2013 భూసేకరణ చట్టం, అంతకు ముందున్న చట్టం మధ్య తేడాలను వివరించారు. 2014 జనవరి తర్వాత జరిగే భూసేకరణకు 2013 చట్టం వర్తింపచేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం రేఖారాణి మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికులతో సమావేశం కావాలని ఎస్టీ కమిషన్ ఎప్పటి నుంచో భావిస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే కమిషన్ కార్యాలయంలో ప్రాథమిక సమావేశం జరిగిందన్నారు. పునరావాసం, పరిహారాలకు సంబంధించి తమ వివరణపై కమిషన్ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో కమిషన్ బృందం ఏపీకి రానుందన్నారు. 26న క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికులతో సమావేశమవుతారని, 27న ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికారులతో సమావేశమవుతారని వివరించారు. భూసేకరణ పశ్చిమగోదావరిలో దాదాపు 100 శాతం పూర్తయిందని, తూర్పు గోదావరిలో 50 శాతం పూర్తయిందని తెలిపారు.

కర్ణాటకలో పరువు హత్య!

- కుమార్తె ప్రాణం తీసిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు
- వేరేకులం యువకుడిని ప్రేమించడమే పాపం

మైసూరు, న్యూస్‌టుడే: వేరే కులానికి చెందిన యువకుడిని ప్రేమించిన పాపానికి తల్లిదండ్రులే తమ కుమార్తె ప్రాణాలను బలిగొన్నారు. కర్ణాటలోని మైసూరు జిల్లా హెగ్గడదేవనకోట తాలూకా గొల్లనబీడు గ్రామంలో ఫిబ్రవరి 21న చోటుచేసుకున్న ఈ ఘటన గురువారం వెలుగుచూసింది. అగ్రకులానికి చెందిన కుమార్ అనే రైతు కుమార్తె సుష్మ (20) అదే గ్రామానికి చెందిన వేరే కులం యువకుడిని ఏడాదిగా ప్రేమించేది. ఈ విషయం తెలిసిన వెంటనే కుమార్ దంపతులు కుమార్తెను కళాశాలకు పంపడం మానేశారు. అయినప్పటికీ.. ప్రేమాయణం కొనసాగుతూ వచ్చింది. ఇక ఫలితం లేదనుకున్న కుమార్ దంపతులు, ఇతర కుటుంబసభ్యులు ఫిబ్రవరి 21న సుష్మను పొలానికి తీసుకెళ్లి బలవంతంగా పురుగుల మందు తాగించారు. చనిపోయిన తర్వాత దహనం చేశారు. అనంతరం ఆ విషయాన్ని రహస్యంగా ఉంచినప్పటికీ.. గురువారం ఒక్కసారిగా బయటకు పొక్కింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు.

జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ సభ్యుడిగా రవీంద్రబాబు బాధ్యతలు



ఈనాడు, హైదరాబాద్: జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్సీఎల్టీ) హైదరాబాద్ బెంచ్‌లో జ్యుడిషియల్ సభ్యులుగా నియమితులైన బిక్కి రవీంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. అహ్మదాబాద్ ఎన్సీఎల్టీ బెంచ్‌లో పనిచేస్తున్న రవీంద్రబాబు హైదరాబాద్‌కి బదిలీ అయ్యారు. గుంటూరు ఏసీ కళాశాల నుంచి 1978లో న్యాయశాస్త్రంలో పట్టా పొందిన ఆయన 1979లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 1987లో జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. ఆ తర్వాత జిల్లా జడ్జిగా పదోన్నతి పొంది.. పలు జిల్లాలో న్యాయ సేవలు అందించారు. 2016 జూన్‌లో అహ్మదాబాద్ ఎన్సీఎల్టీ జ్యుడిషియల్ సభ్యులుగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఎన్సీఎల్టీలో ఇకపై రెండు బెంచ్‌లు పని చేయనున్నాయి. ఒక బెంచ్‌లో జ్యుడిషియల్ సభ్యులుగా విత్తనాల రాజేశ్వరరావు, మరో బెంచ్‌లో రవీంద్రబాబు విచారణ జరపనున్నారు.

'వెలిగొండ'ను త్వరగా పూర్తి చేయండి

ఈనాడు, హైదరాబాద్: వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతులను ఆదుకోవాలని రైతు సంక్షేమ సేవా సంఘం కోరింది. ఈ మేరకు సంఘం నాయకులు నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావును కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరుతూ జనవరి 24న నెల్లూరు జిల్లా సీతారాంపురం నుంచి మూడు జిల్లాల్లో చేసిన పాదయాత్ర విషయాలను మంత్రికి వివరించారు. పాత కాంట్రాక్టరు సరిగా పనులు చేయక ఇబ్బందులు వచ్చాయని, కొత్త కాంట్రాక్టరును పెట్టి డిసెంబరు నాటికి మొదటి దశ పూర్తి చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని, ఈ విషయంపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారావు ప్రకటనలో పేర్కొన్నారు.

సూక్ష్మసూదులతోనూ ఔషధాల వినియోగం!

- జంతువులపై ప్రయోగాలకు సానుకూలం
- మానవ శరీరంపై ప్రయోగాలకు ప్రయత్నాలు

ఈనాడు – అమరావతి



ఎలుక వీపు పైభాగంలో సూక్ష్మసూదుల ద్వారా ద్రవ రూపంలో ఔషధ ప్రయోగం

సూది ద్వారా మందును నేరుగా రక్తంలోనికి ప్రవేశపెట్టే విధానంలో ఫలితాలు బాగానే ఉంటున్నా కొన్ని సందర్భాల్లో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. సూది మందును నేరుగా కండరంలోకి పంపించడం, చర్మం కింద నుంచి ఇవ్వడం, నేరుగా నరం నుంచి రక్తంలోకి పంపించే ప్రక్రియల వల్ల కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర విజ్ఞాన సాంకేతిక శాఖ సూక్ష్మ సూదుల ద్వారా మందులను రోగులకు ఇచ్చే విషయమై ప్రాజెక్టును దేశంలోనే తొలిసారిగా సిద్ధార్థ ఫార్మాసూటికల్ కళాశాలకు అప్పగించింది. ఈ సంస్థ బ్రిటిష్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా సహకారంతో దీనిపై ప్రయోగాలు జరుపుతోంది. ఈ రెండు సంస్థలు ఇన్సులిన్‌ను సూక్ష్మసూదుల ద్వారా రోగులకు అందించే విధానంపై ప్రయోగాలు జరుపుతున్నాయి. వీటి శాస్త్రవేత్తలు 300 నుంచి 1200 మైక్రాన్ల పరిణామంలో సూక్ష్మసూదులను తయారుచేశారు. మాత్ర తయారీకి ఉపయోగించే మందును ద్రవరూపంలోకి మార్చారు. దీనిని సూక్ష్మసూదులతోను, అవి లేకుండాను పంది, ఎలుకల చర్మంలోకి పంపి 48 గంటలపాటు పరీక్షించారు. తద్వారా ద్రవరూపంలోని మందును నేరుగా చర్మంపై ప్రయోగించినప్పుడు అవసరానికి అనుగుణంగా వెళ్లలేదని నిర్ధరణ అయింది. సూక్ష్మసూదుల ద్వారా మాత్రం నిర్ణీత మోతాదులో మందును అందించేందుకు వీలు కలిగింది. ఇదే విధంగా.. 24గంటల పాటు కావాల్సిన మోతాదులో మందును రోగి రక్తంలోనికి ప్రవేశపెట్టేందుకు వీలుంది. ప్యాచ్ రూపంలో చర్మానికి అంటించినట్లయితే అవసరమైనంత సేపూ మందును రోగి శరీరంలోనికి పంపిస్తూనే ఉండొచ్చు. పార్శ్వపు నొప్పి, రక్తపోటు నివారణ మందులు మాత్రల రూపంలో ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి. ఒకటి అరా మాత్రమే ఇంజెక్షన్ల రూపంలో ఉన్నాయి. కానీ...పార్శ్వపు నొప్పి, రక్తపోటు నివారణ కోసం మాత్రలను ఉపయోగించినప్పుడు తగ్గినట్లే తగ్గి వెంటనే సమస్యలు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల మాత్రలు వేసుకోవటం అన్ని వయసుల వారికీ సాధ్యం కాదు. అదే సూక్ష్మసూదుల ద్వారా రోగికి అనుగుణంగా ఎప్పుడైనా ఎక్కడైనా తీసుకునేందుకు సాధ్యమవుతుంది. జంతువులపై జరిపిన పరీక్షలు విజయవంతమైనట్లు అంతర్జాతీయ స్థాయిలో ఏడు జర్నల్స్‌లో వ్యాసాలు ప్రచురితమయ్యాయని, ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి ఆమోదం లభించిన వెంటనే మానవ శరీరంపై 'ఫార్మా ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్' ద్వారా ప్రయోగాలు జరుపుతామని బుచ్చి ఎన్ నల్లూరి పేర్కొన్నారు.

నేను, శ్రీదేవి... అన్నాచెల్లెలు వంటివారం: కమల్‌హాసన్

చెన్నై, న్యూస్‌టుడే: తాను, శ్రీదేవి.. అన్నాచెల్లెలు వంటివారమని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం(ఎంఎన్ఎం) పార్టీ అధినేత కమల్‌హాసన్ వ్యాఖ్యానించారు. ఆయన ఓ వారపత్రికకు రాసిన కాలమ్‌లో ఈ మేరకు పేర్కొన్నారు. తమది హిట్‌పెయిర్ కావడంతో తొలుత సంప్రదించకుండానే సినిమాల్లో జోడీగా ఖరారు చేయడం ప్రారంభించారని గుర్తు చేసుకున్నారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం...: బలోపేతమైన తమిళనాడు కోసం విత్తనాన్ని నాటామని కమల్‌హాసన్ పేర్కొన్నారు. విద్యలో ప్రగతిపథంలో ఉన్న రాష్ట్రాన్ని నీట్ ద్వారా తిరోగమనానికి చేర్చవద్దని, దీనికి తాము మద్దతివ్వబోమని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు, వనరులను మనకు తగినట్టు రూపొందించుకోవడమే సబబని తెలిపారు. మహిళల ఓట్ల కోసమే సంపూర్ణ మద్యనిషేధం నినాదాన్ని తరచూ కొందరు ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు. ఒక్కసారిగా సమాజాన్ని మద్యాన్ని కోరని వారితో కూడినదిగా మార్చలేమని తెలిపారు. మద్యం అలవాటును క్రమంగా తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. 'ఒక్కసారిగా మద్యం మానుకోవడం సాధ్యమా?' అంటే.. అనుమానమేనని తెలిపారు.

లేపాక్షి ఉత్సవాల తేదీల మార్పు

హిందూపురం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో నిర్వహించ తలపెట్టిన లేపాక్షి ఉత్సవాలు వాయిదా పడ్డాయి. ఈ ఉత్సవాలను మార్చి 9, 10 తేదీల్లో జరపాలని తొలుత నిర్ణయించారు. ఈ నెలలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఉండటంతో పాటు లేపాక్షి అభివృద్ధి పనులు ఇంకా పూర్తికాకపోవటం, హంద్రీనీవా నీరు తీసుకువచ్చేందుకు మరికొంత సమయం పడుతుండటంతో ఉత్సవాలను మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీరపాండియన్ గురువారం లేపాక్షిలో ప్రకటించారు.

మచిలీపట్నం-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ బీదర్ వరకు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: మచిలీపట్నం-సికింద్రాబాద్‌ల మధ్య రాకపోకలు సాగిస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల(నెం.12749, 12750)ను బీదర్ వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్-బీదర్‌ల మధ్య ఈ రైళ్లు లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్ స్టేషన్లలో ఆగనున్నాయి. మచిలీపట్నం నుంచి బయల్దేరే రైలు పొడిగింపు గురువారం రాత్రినుంచి అమల్లోకి రాగా బీదర్-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు 2వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. మచిలీపట్నం నుంచి ఇప్పటివరకు రైలు రాత్రి 8.35కి బయల్దేరుతుండగా ఆ సమయం 8.40కి మారింది. విజయవాడకు ఎప్పటిలాగా రాత్రి 10.30కి చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు మరుసటిరోజు తెల్లవారుజామున 4.35కి బదులుగా 4.30కి, బీదర్‌కు 7.38కి చేరుకుంటుంది. తిరిగి బీదర్ నుంచి రాత్రి 7.25కి బయల్దేరి 9.34కి, సికింద్రాబాద్‌కు రాత్రి 10.20కి చేరుకుంటుంది. విజయవాడకు తెల్లవారుజామున 4.25కి, మచిలీపట్నంకు 6.23కి చేరుకుంటుంది.

కోర్టులో నా తండ్రిని హాజరుపరిచేలా ఆదేశించండి

కరుణానిధి మనవరాలు పిటిషన్ దాఖలు

చెన్నై, న్యూస్‌టుడే: తన తండ్రిని కోర్టులో హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి మనవరాలు పిటిషన్ దాఖలు చేశారు. కరుణానిధి పెద్ద కుమారుడు ఎం.కె.ముత్తు అలనాటి సినీ నటుడు. ఆయన రెండో భార్య కుమార్తె షీలారాణి ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. 'తన తండ్రి ముత్తుకు తన తల్లి రెండో భార్య. ఆయన గతంలో మమ్మల్ని బాగా చూసుకునేవారు. మూడేళ్లుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండటంతో తమను చూసేందుకు రావడంలేదు. ప్రస్తుతం మొదటి భార్య ఇంట్లోనే ఉంటున్నారు. నాన్న ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి తన తల్లితో కలిసి వెళ్లగా ఆయన తొలి భార్య కుమారుడైన అరివునిధి మమ్మల్ని అనుమతించలేదు. తన తండ్రిని చట్టవిరుద్ధంగా నిర్బంధంలో ఉంచారు. దీని గురించి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదని' వ్యాజ్యంలో పేర్కొన్నారు. తన తండ్రిని కోర్టులో హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. న్యాయమూర్తులు జస్టిస్ సెల్వం, జస్టిస్ సతీష్ కుమార్ సమక్షంలో ఈ పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. పోలీస్ కమిషనర్, సహాయ పోలీస్ కమిషనర్ ఇందుకు సంబంధించి స్పష్టమైన సమాధానం సమర్పించాలని న్యాయమూర్తులు ఆదేశించారు.

'మాబడి' కృష్ణమూర్తి కన్నుమూత

చౌడేపల్లె, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త నాయుని కృష్ణమూర్తి (67) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన.. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. నడిమిచెర్ల గ్రామానికి చెందిన రామయ్య, నరసమ్మ దంపతులకు కృష్ణమూర్తి నాలుగో సంతానం. 1951 నవంబరు 12న జన్మించారు. తండ్రి రామయ్య బడిపంతులు కావడంతో ఉద్యోగరీత్యా చౌడేపల్లె మండలం మేకలచిన్నేపల్లె పాఠశాలకు బదిలీపై వచ్చారు. దీంతో కృష్ణమూర్తి ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే కొనసాగింది. హైస్కూలు విద్య చౌడేపల్లె, మదనపల్లెలో, డిగ్రీ, పీజీ తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో కొనసాగించారు. అప్పటినుంచి సాహితీపరంగా ఎంతో కృషిచేసి పలు నవలలు రాశారు. ముఖ్యంగా ఆయన తీసుకొచ్చిన 'మాబడి', 'పాఠశాల' పుస్తకాలు విశేష ఆదరణ పొందాయి. సుమారు మూడున్నర దశాబ్దాల కిందట ఏడు, పదోతరగతి విద్యార్థులు సులభరీతిలో పరీక్షలు గట్టెక్కడానికి ప్రతి సబ్జెక్టులోను అన్ని అంశాలను విశ్లేషిస్తూ ఆయన ఈ పుస్తకాలను ప్రతినెలా ప్రచురించేవారు. వీటి ప్రచురణకుగాను అప్పట్లోనే మారుమూల గ్రామమైన చౌడేపల్లెలో 'విజయవాణి' ముద్రణాలయాన్ని స్థాపించారు. ఈ ప్రచురణల వల్ల చౌడేపల్లెకు రాష్ట్రంలోనే మంచి గుర్తింపు లభించింది. కేంద్రస్థాయిలో జాతీయ అక్షరాస్యత సంస్థ సభ్యుడిగా ఆయన అందించిన సేవలను పలువురు ఐఏఎస్ అధికారులు ప్రశంసించారు. 1995లో జాతీయ వయోజన విద్యాసంస్థ ప్రతినిధి గౌతమ్‌ఘోష్ ఆదేశంతో 'వెలుగుబాట' పత్రిక గురించి 30 నిమిషాల డాక్యుమెంటరీని రూపొందించారు. చిన్నపిల్లల కోసం 125 పుస్తకాలు ప్రచురించారు.



నాయుని కృష్ణమూర్తి

మహర్షి సినిమాలో 'సుమం ప్రతి సుమం సుమం' పాటను రాసింది కృష్ణమూర్తే. 'యామినీ కుంతలాలు', 'మనసు గుర్రము రోరి మనిషి..!' తదితర నవలలను రాశారు. ఇటీవల మహాభారతం మూలకథ 'జయమ్'ను నవల రూపంలో తెలుగు పాఠకులకు అందించారు. కృష్ణమూర్తి అంత్యక్రియలు శుక్రవారం స్వగ్రామంలో జరగనున్నాయి.

ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

నాయుని కృష్ణమూర్తి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాబడి, పాఠశాల మాస పత్రికలతో ఆయన విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు.

నెలాఖరు వరకూ రోజుకు 20 లక్షల పనిదినాలు: మంత్రి లోకేశ్

ఈనాడు డిజిటల్, అమరావతి: ఉపాధి హామీ పథకంలో ఈ ఆర్థిక సంవత్సరం 24 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నందున వాటిని ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని పంచాయతీరాజ్ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇపటికే 19.08 కోట్ల పనిదినాలు పూర్తిచేయగా.. గడువులోపు అనుకున్న లక్ష్యం పూర్తికావాలంటే ఇకనుంచి రోజుకి 20లక్షల పనిదినాలు కలించాలని సూచించారు. ఉపాధి హామీ పనులు, గ్రామాల్లో ఎల్ఈడీ దీపాల ఏర్పాటుపై పంచాయతీరాజ్ శాఖ అధికారులతో గురువారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను 150రోజులకు పెంచాలనే డిమాండ్ ఉన్నందున కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని మొత్తం 5,237 గ్రామాల్లో ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్) సంస్థ ఎల్ఈడీ దీపాలను ఏర్పాటుచేయనుందని, ఇప్పటికి 535 పంచాయతీల్లో 100శాతం పూర్తిచేసిందని అధికారులు వివరించారు. వీటన్నింటినీ అలర్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థకు అనుసంధానించాలని, తద్వారా దీపాలు వెలగకుంటే సిబ్బందికి సకాలంలో సమాచారం అందుతుందని మంత్రి వివరించారు. ఈ నెలాఖరులోపు ఈఈఎస్ఎల్, నెడ్‌క్యాప్ సంస్థలు ఏడు లక్షల బల్బులను అమర్చాలని మంత్రి ఆదేశించారు.

భారీ సౌర విద్యుదుత్పత్తి కేంద్రం ప్రారంభం

కర్ణాటకను వెలుగుదివ్వెను చేస్తుందన్న సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్- కర్ణాటక సరిహద్దు పావగడ సమీప తిరుమణిలో అతి పెద్ద సౌర విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం ప్రారంభించారు. 2,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం దీని సొంతం. తొలి దశలో 600 మెగావాట్ల శక్తి ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు. కర్ణాటకను వెలుగుదివ్వెగా ఈ కేంద్రం చేస్తుందని సిద్ధరామయ్య ఆశాభావం ప్రకటించారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ తాము నిత్యం ఏడు గంటల పాటు రైతులకు విద్యుత్తు అందిస్తూ వచ్చామని ఆయన గుర్తుచేశారు. పావగడ సమీప తిరుమణి, క్యాతగానచిర్లు, వళ్లూరు, బళసముద్ర, రాయచిర్లు గ్రామాల్లో రైతులు ఈ ప్రాజెక్టు కోసం 13 వేల ఎకరాల భూమిని అందించారు. ఓ శాస్త్రీయ అధ్యయనం ప్రకారం ఐదు దశాబ్దాలుగా కరవు కోరల్లో పావగడ తాలూకా చిక్కుకుంది. గత ఐదేళ్లలోనే పావగడ, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పదివేల మంది వేర్వేరు ప్రాంతాలకు వలస వెళ్లారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతంగానూ ముద్ర పడింది. ఇపుడీ సౌర విద్యుదుత్పాదన కేంద్రంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని సిద్ధరామయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్తు శాఖ మంత్రి డి.కె.శివకుమార్, న్యాయశాఖ మంత్రి టి.బి.జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.





జయేంద్ర సరస్వతి పార్థివదేహానికి అభిషేకం చేస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి
● జయేంద్ర పార్థివదేహాన్ని బృందావన ప్రవేశానికి తీసుకెళుతున్న భక్తులు


జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం

- భారీగా తరలివచ్చిన భక్తులు

కాంచీపురం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశ కార్యక్రమం గురువారం ఉదయం కంచి శంకర మఠంలో జరిగింది. కంచి పీఠం 69వ పీఠాధిపతి అయిన జయేంద్ర బుధవారం ఉదయం శివైక్యం పొందిన విషయం తెలిసిందే. ఆయన బృందావన ప్రవేశ కార్యక్రమాన్ని కంచి శంకర మఠంలో పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి నేతృత్వంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయేంద్ర సరస్వతి పార్థివదేహానికి విజయేంద్ర సరస్వతి అభిషేకం, ఇతర క్రతువులు నిర్వహించారు. అనంతరం పార్థివదేహాన్ని అలంకరించి జయ జయ ధ్వనులు, వేద మంత్రోచ్చరణ మధ్య ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు బృందావన ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. మఠం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయేంద్ర సరస్వతికి వీడ్కోలు పలికారు.

70వ పీఠాధిపతిగా శంకర విజయేంద్ర సరస్వతి

కాంచీపురం, న్యూస్‌టుడే: తమిళనాడులోని కంచి కామకోటి పీఠం 70వ పీఠాధిపతిగా శంకర విజయేంద్ర సరస్వతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన మఠం ఉత్తరాధికారిగా కొనసాగారు. పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువు జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయేంద్రను.. జయేంద్ర సరస్వతి 1983 మే 29న శంకర మఠానికి పరంపర వారసుడిగా ప్రకటించి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతిగా నామకరణం చేశారు.



హైకోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

- డిమాండ్ల సాధన కోసం ర్యాలీ

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయడంతోపాటు పలు డిమాండ్ల సాధన కోసం న్యాయవాదులు గురువారం హైకోర్టులో విధులను బహిష్కరించారు. హైకోర్టు వెలుపల ఆరో గేటు నుంచి చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ కూడలి వద్దకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించి, బైటాయించారు. కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాది సంఘాల అధ్యక్షులు జల్లి కనకయ్య, చల్లా ధనంజయ, కార్యదర్శులు, దిగువ కోర్టుల న్యాయవాదులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. హైకోర్టుకు శాశ్వత ప్రధాన న్యాయమూర్తిని నియమించాలని, సుప్రీంకోర్టు బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని, సెక్షన్ 41-ఏ సీఆర్‌పీసీని ఉపసంహరించాలని తదితర డిమాండ్లతో మార్చి 1, 2 తేదీల్లో హైకోర్టు విధులను బహిష్కరించాలని తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాది సంఘాలు తీర్మానించిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం కోర్టులు పనిచేయడం ప్రారంభించగానే.. పలువురు న్యాయవాదులు కోర్టు హాళ్ల వద్దకు వెళ్లి విధుల బహిష్కరణకు సహకరించాలని సహ న్యాయవాదులను కోరారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతున్న సమయంలో న్యాయవాదులు కోర్టు లోపలికి వచ్చి విధులకు దూరంగా ఉంటున్న వ్యవహారాన్ని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అందుకు ఏసీజే స్పందిస్తూ.. న్యాయవాదులు వచ్చి వాదనలు చెప్పే కేసులుంటే విచారణ జరుపుతామన్నారు. వారు హాజరు కాకపోతే వాయిదా వేస్తాము తప్ప వ్యాజ్యాల్ని కొట్టేయబోమని హామీ ఇచ్చారు. హైకోర్టు ప్రాంగణంలో భారీగా పోలీసులను మోహరించారు.




డిమాండ్ల సాధన కోసం బైఠాయించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చాగలమర్రిలో బార్న్‌ఓల్ గుడ్లగూబ

అరుదైన బార్న్‌ఓల్ జాతి గుడ్లగూబ గురువారం ఉదయం కర్నూలు జిల్లా చాగలమర్రిలో కనిపించింది. ప్రేమ చిహ్నం(లవ్) గుర్తు ఆకారపు ముఖంతో గోధుమ, శ్వేత వర్ణంలో ఉన్న ఈ పక్షిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. ఇది చాలా అరుదుగా కనిపిస్తుందని.. రాత్రి వేళల్లో మాత్రమే విహరిస్తుందని నంద్యాల డీఎఫ్ఓ శివప్రసాదు తెలిపారు.

–న్యూస్‌టుడే, చాగలమర్రి



ప్యాకేజీతో చుట్టేయండి..

పర్యాటకులకు పసందైన వినోదాన్ని అందించడానికి ఇండియన్ రైల్వే కేటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) కొత్త కొత్త ప్యాకేజీలు ప్రకటిస్తూనే ఉంటుంది. తెలుగు రాష్ట్రాల నుంచి దేశీయ యాత్రలతో పాటు విదేశీ విహార ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చింది. విశాఖ నుంచి సింగపూర్, హైదరాబాద్ నుంచి దుబాయ్ టూర్‌కు ప్యాకేజీలను సిద్ధం చేసింది. తిరుమల క్షేత్ర దర్శనానికి ప్రత్యేకంగా నాలుగు ప్యాకేజీలు నిర్వహిస్తోంది. నచ్చిన ప్యాకేజీని ఎంచుకొని మెచ్చిన ప్రదేశానికి సులభంగా చుట్టిరావొచ్చంటున్నారు ఐఆర్‌సీటీసీ అధికారులు. ఆ ప్యాకేజీల వివరాలు..

సింగపూర్ వయా మలేసియా

ధర: రూ.61,660 నుంచి రూ.70,025 (పెద్దలకు)
పిల్లలకు (2-11 సం) : రూ.50,940 నుంచి రూ.57,419

ఎప్పుడు: మార్చి 24న

ఎన్ని రోజులు: ఐదు రాత్రులు/ ఆరు పగళ్లు

ఏమేం చూపిస్తారు: తూర్పు మలేసియా, సింగపూర్

ప్రత్యేకతలు: సింగపూర్‌లో నైట్ సఫారీ, వైబ్రంట్ చైనాటౌన్, ప్రత్యేక విహార కేంద్రాల సందర్శన, సెంటోసా కేబుల్ కార్ విహారం, మేడమ్ టుస్సాడ్ మైనపు మ్యూజియం, యూనివర్సల్ స్టూడియో సందర్శన, కౌలాలంపూర్‌లో సాహస క్రీడలు, బాతూ గుహలు, సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, చారిత్రక ప్రదేశాల విహారం మరెన్నో..



చలో దుబాయ్

ధర: రూ.69,698 (ఒక్కొరికి)
పిల్లలకు (2 నుంచి 11 సం): రూ.56,507

ఎడారి దేశంలోని అద్భుతాలు చూడాలనుకునే పర్యాటకుల కోసం ఐఆర్‌సీటీసీ హైదరాబాద్-దుబాయ్-అబుదాబి ప్యాకేజీ నిర్వహిస్తోంది.

ఎప్పుడు: మార్చి 18న

ఎన్ని రోజులు: నాలుగు రాత్రులు/ ఐదు పగళ్లు

ఏమేం చూపిస్తారు: దుబాయ్, అబుదాబి

ప్రత్యేకతలు: దుబాయ్ నగర సందర్శన, క్రూయిజ్‌లో విహారం, షేక్ జయిద్ మసీదు, గ్లోబల్ విలేజ్, మిరాకిల్ గార్డెన్, ఎడారిలో జీప్ సఫారీ, అబుదాబి నగరం చుట్టిరావడం మరెన్నో..



మరిన్ని వివరాలకు క్లిక్.. www.irctctourism.com

తిరుమల ప్రత్యేకం

ఐఆర్‌సీటీసీ పర్యాటకుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి విరివిగా తిరుమల యాత్ర ప్యాకేజీ నిర్వహిస్తోంది. 'శ్రీ బాలాజీ దర్శనం టూర్', 'గోవిందం', 'వెంకటాద్రి', 'వెంకటాద్రి శ్రీపురం' ఇలా నాలుగు రకాల ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి.

విమానంలో..

విమానంలో తిరుమలకు వెళ్లదలచిన వారి కోసం 'శ్రీ బాలాజీ దర్శనం టూర్' ప్యాకేజీని ప్రకటించింది.

ఎప్పుడు: మార్చి 9, 10, 16, 17, 23, 24, 30, 31 తేదీల్లో

ఎన్ని రోజులు: 1 రాత్రి/ 2 పగళ్లు

ఏమేం చూపిస్తారు: తిరుపతి, కాణిపాకం, శ్రీనివాస మంగాపురం, శ్రీకాళహస్తి, తిరుచనూరు, తిరుమల

ధర: రూ. 10,135 నుంచి రూ. 12,112

పిల్లలకు (5–11 సం..): రూ. 8,999 నుంచి రూ. 10,135

వెంకటాద్రి-శ్రీపురం ప్యాకేజీ

ఎప్పుడు: ప్రతి శుక్రవారం

ఎన్ని రోజులు: 3 రాత్రులు/ 4 పగళ్లు

ఏమేం చూపిస్తారు: కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీపురం, తిరుమల, తిరుచానూరు


ప్యాకేజీ ధర: రూ. 5,575 నుంచి రూ. 9,213
పిల్లలకు (5–11 సం) రూ. 5,164 నుంచి రూ. 7,307

భజ 'గోవిందం'

ఎన్ని రోజులు: 2 రాత్రులు/ 3 పగళ్లు
ఎప్పుడు: ఆదివారం నుంచి గురువారం
ఏమేం చూపిస్తారు: తిరుమల, తిరుచానూరు

ధర: రూ. 3,785 నుంచి రూ. 6377

పిల్లలకు (5–11 సం): రూ. 2,974 నుంచి రూ. 4,745



చూస్తూ సాగిపోవచ్చు..



ప్రయాణ సమయంలో మెమొరీ కార్డులో పాటలు నింపుకోవడం, ఫోన్‌లో సినిమాలు చూడటం పాత ముచ్చట. వర్చువల్ రియాలిటీ ప్లేయర్లను ఆశ్రయించవచ్చు. కాకపోతే.. అవి కళ్లకు తగిలించుకుంటే ప్రపంచంతో సంబంధాలు ఉండవు. వేరబుల్ డిస్‌ప్లే మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తున్న గాడ్జెట్. దీనిని ధరిస్తే.. ఒక కన్నుతో కావాల్సినవి చూడొచ్చు.. మరో కన్నుతో ప్రపంచాన్ని దర్శించవచ్చు. దీనిని కళ్లజోడుతో జోడీగా, విడిగా కూడా ధరించవచ్చు. చెవి దగ్గరి నుంచి కంటికి అంగుళం దూరంలో ఉండేవిధంగా దీనిని ఏర్పాటు చేసుకోవాలి. బ్లూటూత్, హెచ్‌డీఎంఐ కేబుల్ సహాయంతో కనెక్ట్ చేస్తే సరి.. ఫోన్‌లో ఉన్న సినిమాలు, కెమెరాలో ఉన్న చిత్రాలు, డ్రోన్‌లో తీసిన వీడియోలు.. ఏవైనా చూసేయొచ్చు. ఈ కన్ను చూసింది ఆ కంటికి కూడా తెలియదు.

రామాయణంలో..




లేపాక్షికి చారిత్రక గొప్పదనమే కాదు.. పౌరాణిక ప్రాశస్త్యం కూడా ఉంది. రావణుడు అపహరించిన సీతను అన్వేషిస్తూ తిరుగుతున్న రాముడికి ఈ ప్రాంతంలో రెక్కలు కోల్పోయి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న జటాయువు కనిపించిందట. సీతమ్మను కాపాడేందుకు ప్రాణ త్యాగానికి సిద్ధపడిన జటాయువుకు మోక్షం ప్రసాదిస్తూ శ్రీరాముడు 'లే.. పక్షి' అన్నాడట. అదే నేడు లేపాక్షిగా రూపాంతరం చెందిందని అంటారు. లేపాక్షి ఆలయం సమీపంలోని పెద్ద రాతిగుండుపై పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన జటాయువు పక్షి విగ్రహం అందరినీ ఆకర్షిస్తుంది.

లే.. పక్షిలో..
ఒక పక్షి ఉంది.
దాని త్యాగం ఉంది.

లేపాక్షిలో
రెండు కన్నులున్నాయ్!
అవి కన్న కలలున్నాయ్!

ఈ రెండింటి కలబోత.. మరెన్నో కళల పూత.. లేపాక్షి. తెలుగు రాష్ట్రాల్లో అపురూప శిల్ప సంపదతో అలరారుతోన్న క్షేత్రాల్లో లేపాక్షి ప్రముఖమైనది. అనంతపురం జిల్లాలో ఉన్న ఈ అద్భుత పర్యాటక కేంద్రంలో మార్చి 31 నుంచి రెండు రోజుల పాటు 'లేపాక్షి ఉత్సవాలు' జరుగుతున్నాయి. ఈ సాంస్కృతిక వేడుకల్లో పాలుపంచుకోవాలని అనుకుంటున్నారా.. అయితే లేపాక్షికి వెళ్లిపోదాం.



వేలాడే స్తంభం

ఓ రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్తే.. నీలిరంగు అట్ట ఉన్న నోట్ పుస్తకాలు ఉండేవి. అదేనండి 'లేపాక్షి నంది' నోట్ పుస్తకాలు. ఆ అట్ట మీద వేలడంత సైజులో ఓ నంది చిత్రం ఉండేది. గుర్తొచ్చిందా. అట్టమీద అంగుళం పరిమాణంలో మురిపించిన నంది.. లేపాక్షిలో ఆకాశమంత కనిపిస్తుంది. దేశంలోనే అతిపెద్ద ఏకశిలా నంది విగ్రహం అది. 15 అడుగుల ఎత్తు.. 25 అడుగుల పొడవుతో.. మువ్వల పట్టీలతో.. మెడలో గంటలతో.. నిన్నో.. మొన్నో చెక్కారా అన్నంత చక్కగా దర్శనమిస్తుంది. ఈ నందిని చెక్కి దాదాపు ఐదు శతాబ్దాలు కావొస్తోంది. అప్పుడే ఆశ్చర్యపోకండి. అంతకుమించిన విషయాలు.. విశేషాలు.. మరెన్నో ఉన్నాయి లేపాక్షిలో.

వీరభద్రుడి కోసం..

లేపాక్షి విజయనగర సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. అచ్యుతరాయల పాలనా కాలంలో పెనుగొండ సంస్థానంలో విరూపణ్ణ కోశాధికారి. ఆయన వీరభద్రుడి వీరభక్తుడు. లేపాక్షిలోని కూర్మగిరిపై వీరభద్రుడికి ఆలయం కట్టించాలని భావించాడు. కోశాగారంలోని ధనం వెచ్చించి నిర్మాణం మొదలుపెట్టాడు. రాయల వైభవానికి తులతూగే విధంగా.. ఏడు ప్రాకారాలతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నాడు. ప్రభువుల అనుమతి లేకుండా ప్రజాధనంతో విరూపణ్ణ ఆలయం కట్టిస్తున్నాడని అచ్యుతరాయలుకు ఫిర్యాదు చేశారు గిట్టనివారు. ఆగ్రహించిన రాజు.. విరూపణ్ణుడి కనుగుడ్లు పెకిలించాల్సిందిగా ఆజ్ఞాపించాడట. ఆ విషయం తెలుసుకున్న విరూపణ్ణ తనకు తానుగా కను గుడ్లు పెకిలించి విసిరేశాడని గాథ ప్రచారంలో ఉంది. అందుకు తగ్గట్టే.. లేపాక్షి ఆలయంలో ఓ రాతిగోడపై రక్తపు మరకలు కనిపిస్తాయి. ఆలయంలోని కల్యాణ మంటపం అసంపూర్తిగా మిగిలిపోవడం వెనుక కారణం కూడా ఇదేనని చెబుతారు.

మిగిలినవి మూడే..

లేపాక్షి ఆలయం ఏడు ప్రాకారాలతో నిర్మించారు. కాలక్రమంలో నాలుగు ప్రాకారాలు శిథిలమై.. మూడు మాత్రమే మిగిలాయి. వీరభద్రుడి ఆలయం, ఉప ఆలయాలు, నాట్య మంటపం, కల్యాణ మంటపం అన్ని నిర్మాణాలూ ఆనాటి శిల్పకారుల చాతుర్యాన్ని కళ్లకు కడతాయి. ఆలయంలో మొత్తం 876 స్తంభాలు ఉండగా.. 246 స్తంభాలను ఒకదానితో ఒకటి పోలిక లేని విధంగా అద్భుతంగా చెక్కారు. కల్యాణ మంటపంలో పక్కనున్న లతా మంటపంలో 36 స్తంభాలపై 144 రకాల ఆకృతులకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఈ డిజైన్లను ధర్మవరం చేనేతలో వాడటం విశేషం.


భళా నర్తనశాల

70 స్తంభాలతో నిర్మించిన నాట్య మంటపం మధ్యలో 12 స్తంభాలు ప్రత్యేకమైనవి. మధ్యనున్న స్తంభంపై రంభ నాట్యం చేస్తున్నట్టుగా చెక్కారు. బ్రహ్మ మృదంగం వాయిస్తున్నట్టుగా, తుంబురుడు వీణను మీటుతున్నట్లుగా, భృంగీశ్వరుడు రంభకు నాట్యం నేర్పుతున్నట్టుగా, దత్తాత్రేయుడు, నటరాజు, శివుడు, పార్వతి తదితర దేవతలు నాట్యాన్ని చూస్తున్నట్టుగా స్తంభాలపై శిల్పాలు మలిచిన తీరు గొప్పగా అనిపిస్తుంది. మంటపం పైకప్పులో చెక్కిన శతపత్ర (వందరేకుల) పద్మం మరో ఆకర్షణ.



అచ్చెరువు.. చిత్తరువు..

లేపాక్షి ఆలయంలో అబ్బురపరిచే మరో విషయం తైలవర్ణ చిత్రాలు. తమ నైపుణ్యంతో ఎన్నో విశేషాలను శిలలపై పొదిగిన శిల్పకారులకు ఏమాత్రం తీసిపోని విధంగా.. అద్భుతమైన చిత్రాలతో పురాణేతిహాసాలను కళ్లముందుంచారు చిత్రకారులు. ప్రకృతి సిద్ధమైన రంగులతో వీటిని తీర్చిదిద్దారు. శతాబ్దాలు దాటినా ఆ చిత్రాల్లోని వన్నె తగ్గలేదు. ప్రధాన ఆలయం గర్భగుడి పైకప్పుపై 24 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పుతో గీసిన వీరభద్రుడి చిత్రాన్ని చూశాక ఎలా చిత్రించారా అనిపిస్తుంది. నాట్య మంటపంలో ఎటువైపు నుంచి చూసినా మనవైపే చూసేలా ఉండే శ్రీకృష్ణుని చిత్తరువును చూసి అచ్చెరువొందాల్సిందే. రామయాణ, మహాభారత ఘట్టాలను తెలిపే చిత్రాలు కనిపిస్తాయి. పార్వతీ పరమేశ్వరుల పరిణయం, శివతాండవం వంటి చిత్రాలు.. లేపాక్షికి వచ్చే పర్యాటకులకు ఆనందాన్ని పంచుతాయి. ఎన్నో అద్భుతాలకు నెలవైన లేపాక్షికి వారాంతాల్లో తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి వందల మంది పర్యాటకులు వస్తుంటారు. అక్కడి శిల్పాలను తరచి తరచి చూస్తారు. చిత్రాలను కోరి కోరి వీడియోలు తీస్తుంటారు. ఈ పర్యాటక ప్రాంత సందర్శన మరింత మధురానుభూతిగా మిగిలిపోవాలంటే.. 'లేపాక్షి ఉత్సవాల' కన్నా మంచి తరుణం ఏముంటుంది. సంప్రదాయ వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలు.. ఇన్నిటి మధ్య లేపాక్షి విహారం భలేగా సాగిపోతుంది.



మూలాధారం ఇదే!

లేపాక్షికి వెళ్లే పర్యాటకులు నంది విగ్రహాన్ని చూశాక... వెంటనే ఓ స్తంభం చుట్టూ మూగిపోతారు. నాట్య మంటపం ఈశాన్య దిశలో ఉంటుంది. పైకప్పు ఆధారంగా భూమికి అర అంగుళం ఎత్తులో.. గాలిలో తేలాడుతున్నట్టు ఉంటుంది. యాత్రికులంతా కాగితాన్నో, దుస్తులనో స్తంభం కిందుగా పంపించి.. వింత అనుభూతిని సొంతం చేసుకుంటారు. ఈ స్తంభాన్ని నాట్య మంటపం మూలాధార స్తంభంగా చెబుతారు. 1902 ప్రాంతంలో.. బ్రిటిష్ ఇంజినీరు హ్యాయిల్టన్ వేలాడే స్తంభాన్ని పరీక్షించాలని పక్కకు నెట్టించగా.. మంటపంలోని మిగిలిన స్తంభాలు కూడా పక్కకు జరిగాయట. దీంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడట ఆ ఇంజినీరు. ఇప్పటికీ మంటపంలోని స్తంభాలు ఓ పక్కకు ఒరిగినట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది.



ఏడు పడగల నీడలో..

ఆలయ ప్రాకారాల మధ్యలో ఉన్న ఏడుతలల నాగేంద్రుడి విగ్రహం.. సెల్ఫీ జోన్‌గా మారిపోయింది. ఒక పెద్ద శిలను ఏడు తలల సర్పంగా చెక్కి.. పడగల నీడలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఈ శిల్పం చెక్కడం వెనుక ఒక కథ ప్రచారంలో ఉంది. ఆలయ నిర్మాణ సమయంలో శిల్పులు మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లారట. అప్పటికి వారి తల్లి ఇంకా వంట చేస్తోందట. వంట పూర్తయ్యేలోపు శిల్పులంతా కలిసి.. భారీ శిలను నాగేంద్రుడిగా చెక్కేశారట.



ఎలా వెళ్లాలి..?

- లేపాక్షికి సుమారు 14 కిలోమీటర్ల దూరంలో హిందూపురం రైల్వే జంక్షన్ ఉంది. హైదరాబాద్, విజయవాడ, అనంతపురం, బెంగళూరు నుంచి హిందూపురానికి రైళ్లున్నాయి. అక్కడి నుంచి లేపాక్షికి బస్సులు, ఆటోలు దొరుకుతాయి.
- లేపాక్షికి కొడికొండ చెక్‌పోస్టు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. బెంగళూరు, అనంతపురం నుంచి కొడికొండ చెక్‌పోస్టుకు విరివిగా బస్సులు ఉన్నాయి. అక్కడి నుంచి లేపాక్షికి బస్సులు, ఆటోల్లో వెళ్లొచ్చు. లేపాక్షి, హిందూపురంలో బస చేయవచ్చు.

❒ వి.శివకుమార్, లేపాక్షి, చెన్నకేశవరెడ్డి, హిందూపురం
ఫొటోలు: సైదేశ్వర్‌రావు, హిందూపురం

❖❖❖❖❖❖❖❖



ఏనాటికైనా చూడాల్సిందే!

అక్కడ రైతును పలకరించినా మంచి డైలాగ్ చెప్పేస్తాడు.. కూలీని కదిపినా కమ్మని కాళిదాసు కావ్యాన్ని వినిపిస్తాడు.. దుకాణంలో పనిచేసే అబ్బాయి.. యజమాని.. ప్రభుత్వోద్యోగి.. ప్రైవేట్ మాస్టారు.. అందరూ స్టార్లే. స్టేజ్ ఎక్కితే చాలు.. నవరసనట సార్వభౌములే! ఇందరు నటులున్న ఆ ఊరి పేరు హెగ్గోడు. ఒకప్పుడు కర్ణాటకలో కుగ్రామం. ఇప్పుడు ఆ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు పట్టుగొమ్మ. 1949లో ఇక్కడ 'నీలకంఠేశ్వర నాట్య సేవా సంఘం' ప్రారంభమైంది. ఇదే 'నీనాసం'గా పేరుమోసింది. మొదట్లో సాహిత్యాభివృద్ధికి కృషి చేసేది ఈ సంస్థ.. ఆపై రంగస్థలంపై దృష్టి సారించింది. సంఘం చేస్తున్న కార్యక్రమాల్లో ఒక్కొక్కరుగా గ్రామస్థులంతా పాల్గొన్నారు. తొలిరోజుల్లో ప్రేక్షకులుగా నాటికలు చూసినవాళ్లే.. ఆ తరువాత నటీనటులుగా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. తరాలు మారాయి. అయినా వారి అభిరుచి మారలేదు. ఇప్పటి తరం కూడా నాటకాలు రక్తికట్టిస్తున్నారు. షేక్స్పియర్, టాల్‌స్టాయ్ నాటకాలు, సంస్కృత నాటకాలు, కన్నడ నాటికలు, నృత్యప్రదర్శనలు 'నీనాసం' కళాక్షేత్రంలో రోజూ చిన్నదో పెద్దదో కార్యక్రమం తప్పకుండా ఉంటుంది. వీటిని చూసేందుకు ఊళ్లో వాళ్లే కాదు..ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. బెంగళూరు, మంగళూరు, షిమోగా నుంచి వారాంతాల్లో పర్యాటకులు హెగ్గోడుకు చేరుకుంటారు. ఏటా అక్టోబర్‌లో జరిగే వర్క్‌షాప్‌లో దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులు పాలుపంచుకుంటారు.

ఇలా వెళ్లాలి..

- హెగ్గోడు జిల్లా కేంద్రం షిమోగా నుంచి 74 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఉడుపి నుంచి 140 కి.మీ
- హెగ్గోడు గ్రామానికి 12 కిలోమీటర్ల దూరంలో సాగర్ అనే పట్టణం ఉంటుంది. షిమోగ, మంగళూరు, ఉడుపి, భద్రావతి తదితర నగరాల నుంచి సాగర్‌కు బస్సు సౌకర్యం ఉంది. సాగర్ నుంచి బస్సులో గానీ, ట్యాక్సీలో గానీ హెగ్గోడు చేరుకోవచ్చు.

ప్రత్యేకం




ఆసియాలో నెం.1

ట్రిప్ అడ్వైజర్ నిర్వహించిన సర్వేలో గోవాలోని ఆగోందా బీచ్ ఆసియాలోనే అందమైన బీచ్‌గా ఎంపికైంది. ఏడాది కాలంగా ట్రిప్ అడ్వైజర్ యాప్‌లో యాత్రికులు తెలియజేసిన రివ్యూలు, రేటింగ్స్ ఆధారంగా ఈ అవార్డును ప్రకటించింది. మన దేశంలో ఆగోందా బీచ్ తర్వాత రాధానగర్ బీచ్ (అండమాన్) రెండో అత్యుత్తమ బీచ్‌గా ఎంపికైంది. కేరళలోని వర్కాల బీచ్ ఏడో స్థానంలో నిలువగా.. టాప్ 10లోని మిగిలిన అన్ని స్థానాలూ గోవాలోని వివిధ బీచ్‌లే ఆక్రమించాయి.



ఈనాడు సినిమా


రామ్‌చరణ్

రంగ... రంగ... రంగస్థలాన

అతని పేరు చిట్టిబాబు. అచ్చమైన కోనసీమ కుర్రాడు. కాకపోతే... కాస్త సౌండ్ ఇంజినీరంతే. ఊరేమో రంగస్థలం. అలాగని అక్కడ నాటకాల రాయుళ్లు ఉంటారనుకోనక్కర్లేదు. అంతా పసి మనసున్న మనుషులే. వాళ్ల మధ్య రామలక్ష్మి చుక్కల మధ్య చందమామ. మరి చిట్టమ్మకీ, ఆ చిట్టిబాబుకీ లింకు ఎలా కలిసిందో తెలియాలంటే 'రంగస్థలం' చూడాల్సిందే. రామ్‌చరణ్, సమంత జంటగా నటిస్తున్న చిత్రమిది. సుకుమార్ దర్శకుడు. మైత్రీ మూవీస్ సంస్థ నిర్మిస్తోంది. ఈనెల 29న ఈ చిత్రం విడుదల కానుంది. ఇప్పటికే 'ఎంత సక్కగున్నావె..' పాటని విడుదల చేశారు. శుక్రవారం రెండో పాట 'రంగ రంగ రంగస్థలాన..' బయటకు వస్తుంది. తొలిపాటని అతిలోక సుందరి శ్రీదేవికి అంకితమిచ్చినట్టు చిత్రబృందం ప్రకటించింది. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్

సూర్య దూకుడు


అల్లు అర్జున్

అల్లు అర్జున్ 'జవాన్'గా మారాడు. భరతమాత రక్షణలో సరిహద్దుల్లో శత్రుసైన్యం కోసం పోరాటానికి సిద్ధమయ్యాడు. ఇదంతా 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా' కోసం. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. వక్కంతం వంశీ దర్శకుడు. లడగపాటి శిరీషా శ్రీధర్ నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. హోళీ సందర్భంగా గురువారం ఫస్ట్ ఇంపాక్ట్ లుక్ విడుదల చేశారు. "రామోజీ ఫిల్మ్‌సిటీతో పాటు హైదరాబాద్‌లోని అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరుగుతోంది. ఈనెల 14 వరకూ హైదరాబాద్‌లోనే షూటింగ్ జరుపుతాం. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. మే 4న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. సంగీతం: విశాల్ - శేఖర్.


సమంత

డిమాండ్లు పరిష్కరిస్తేనే...


దామోదర ప్రసాద్, సి.కల్యాణ్, సురేష్‌బాబు, కిరణ్, మురళీమోహన్

"డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లతో రెండు వారాల నుంచీ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఇవి ఓ స్థాయి వరకూ వచ్చాయి. మా ప్రధానమైన మూడు డిమాండ్లనూ అంగీకరిస్తే... థియేటర్ల బంద్ ఉండదు. లేదంటే మాత్రం సినిమాల ప్రదర్శన నిలిపివేస్తామ"న్నారు దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు సురేష్‌బాబు. గురువారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ "వర్చువల్ ప్రింట్ ఫీజు (వి.పి.ఎఫ్)ను పూర్తిగా రద్దు చేయాలి. సినిమా ప్రదర్శిస్తున్నప్పుడు ఎక్కువ వాణిజ్య ప్రకటనలు వేయకూడదు. రాబోయే చిత్రాల ట్రయిలర్స్ విధిగా ప్రదర్శించాలి. ప్రధానంగా మేం కోరేవి ఇవే. ఎనలాగ్ నుంచి డిజిటల్ పద్ధతిలోకి వచ్చింతర్వాత ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు ఏర్పడ్డారు. వీళ్లు థియేటర్లలో ప్రత్యేకంగా డిజిటల్ ప్రొజెక్టర్లను ఏర్పాటు చేసి వి.పి.ఎఫ్‌తోపాటు సర్వీస్ ఛార్జీలను వసూలు చేస్తున్నారు. కొన్నేళ్ల నుంచీ ఇదే కొనసాగుతోంది. ఐదేళ్ల తర్వాత వి.పి.ఎఫ్‌ను ఉచితంగా అందజేస్తామని ఒప్పందాలు కుదిరాయి. వి.పి.ఎఫ్ లేకుండానే ఆంగ్ల చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. కేవలం ప్రాంతీయ సినిమాలకి మాత్రమే వి.పి.ఎఫ్‌ను వసూలు చేస్తున్నారు. మేం వాటిని రద్దు చేయమని ముందు నుంచీ అడుగుతూనే ఉన్నాం. 'కొంత తగ్గిస్తాం' అంటూ బేరం పెడుతున్నారు. మేం మాత్రం పూర్తిగా తీసేయమని కోరుతున్నాం. ఈ విషయంలో ప్రధానంగా క్యూబ్, యు.ఎఫ్.ఒ కంపెనీలు పట్టుగా ఉన్నాయి. ప్రదర్శనలు నిలపాలని మా ఉద్దేశం కాదు. వాళ్లు గెలిచారా? మేం ఓడామా? అనేం లేదు. వాళ్లకైనా, మాకైనా ఇది వ్యాపారం. ఎవరం నష్టపోకూడదు. నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు, పెద్ద, చిన్న నిర్మాతలనే తేడా లేకుండా చిత్ర పరిశ్రమలో అంతా బాగుండాలి. ఈ చర్చలు సఫలమైతే చిన్న నిర్మాతలకు లాభం. ఏ క్షణమైనా మా చర్చలు సఫలం అవుతాయనే ఆశాభావం ఉంది. మా డిమాండ్లకు ఒప్పుకుంటే... థియేటర్లని యధావిధిగా తెరుస్తాం. లేదంటే మాత్రం ముందు అనుకున్నట్టు బంద్ కొనసాగుతుంద"న్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం అధ్యక్షుడు కె.మురళీమోహన్, డిజిటల్ కమిటీ ఛైర్మన్ కె.ఎల్.దామోదర్ ప్రసాద్, సి.కల్యాణ్, పి.కిరణ్, ముత్యాల రాందాసు, సునీల్ నారంగ్, ఆర్.కె పాల్గొన్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో 'సాక్ష్యం'


బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. పూజా హెగ్డే కథానాయిక. శ్రీవాస్ దర్శకుడు. అభిషేక్ నామా నిర్మాత. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరణ జరుగుతోంది. అక్కడ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్‌లో ప్రధాన తారాగణంపై కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. త్వరలో అమెరికాలో మరో షెడ్యూల్ జరగబోతోంది. దాంతో షూటింగ్ పూర్తవుతుంది. మే 11న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తోంది. ఇప్పటికే డిజిటల్ రైట్స్ మంచి ధరకు అమ్ముడయ్యాయి. శాటిలైట్, డిజిటల్ రైట్స్ కలిపి రూ.13.5 కోట్లు పలికాయి. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న చిత్రమిది. శ్రీవాస్ కథని తీర్చిదిద్దుతున్న విధానం బాగుంది. పీటర్ హెయిన్స్ నేతృత్వంలోని యాక్షన్ సన్నివేశాలు అలరిస్తాయ"న్నారు. సంగీతం: హర్షవర్ధన్

'దండుపాళ్యం' చేయట్లేదు


పూజా గాంధీ

'దండు పాళ్యం' గ్యాంగ్ సృష్టించిన హంగామా అంతా ఇంతా కాదు. క్రైమ్ థ్రిల్లర్స్‌లో 'దండు పాళ్యం' ప్రత్యేక స్థానం ఆక్రమించుకుంది. ఇప్పుడు 'దండుపాళ్యం 3' కూడా వస్తోంది. అది విడుదల కాకముందే 'దండు పాళ్యం 4' మొదలైంది. ఈ చిత్రంలో 'దండు పాళ్యం'తో పేరు తెచ్చుకున్న రవికాలే, మకరంద్ దేశ్ పాండే, పూజా గాంధీ, రవి శంకర్‌లు కూడా నటిస్తున్నారని నిర్మాత వెంకట్ చెప్పారు. అంతేకాదు హైదరాబాద్‌లో ఫస్ట్ లుక్‌ని కూడా విడుదల చేశారు. ఆ పోస్టర్‌పై 'దండుపాళ్యం' గ్యాంగ్ అంతా ఉంది. అయితే 'దండుపాళ్యం' బృందం మాత్రం 'ఈ సినిమాలో మేం లేం. మా అనుమతి లేకుండా పోస్టర్లపై మా చిత్రాలు ఎలా వాడుకుంటారు' అని ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా పూజా గాంధీ మాట్లాడుతూ "దండుపాళ్యం 4లో నేను నటించడం లేదు. ఈ విషయమై నన్ను ఇప్పటి వరకూ ఎవరూ సంప్రదించలేదు. 'దండుపాళ్యం 4' పోస్టరుపై మా చిత్రాలు చూసి ఆశ్చర్యపోయాను. నేనే కాదు రవికాలే, మకరంద్ దేశ్‌పాండే, రవి శంకర్‌లు కూడా నటించడం లేద"ని చెప్పారు.

ఒక్క తప్పు చేసినా...

"స్టార్‌గా ఎదగడం ఎంత కష్టమో... ఆ స్థానంలో కొనసాగడంలోనూ అంతే కష్టం ఉంటుంద"ని చెబుతోంది సమంత. త్వరలోనే 'రంగస్థలం'తో సందడి చేయబోతున్న ఆమె, తమిళంలో పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా కొనసాగుతోంది. కథానాయికగా తొలి అడుగులు వేస్తున్న సమంతకీ, ప్రస్తుతం స్టార్‌గా కొనసాగుతున్న సమంతకీ మధ్య తేడాలేమైనా ఉన్నాయా? అని అడిగితే... బోలెడన్ని అంటూ తన మనసు విప్పింది. "నటులు ఉన్నతమైన స్థానానికి చేరుకొన్నాక అందరి కళ్లూ వాళ్లపైనే ఉంటాయి. కెరీర్‌లో ఒక్క తప్పు చేసినా, ఒక్క పరాజయం ఎదురైనా ప్రత్యేకంగా వేలెత్తి చూపించేందుకు అందరూ సిద్ధంగా ఉంటారు. అదే తొలి అడుగులు వేస్తున్న దశలో ఇలాంటి సమస్యలేమీ ఉండవు. అంతా ఆడుతూ పాడుతూ పని చేస్తున్నట్టే ఉండేది అప్పట్లో. స్టార్ అని ఎప్పుడైతే పిలవడం మొదలుపెట్టారో అప్పట్నుంచి ప్రతి రోజూ నాకొక సవాలే. ఎంచుకొనే కథ మొదలుకొని, చేసే ప్రతి సన్నివేశం వరకు అన్నింట్లోనూ వంద శాతం పక్కా అనిపించుకోవాల్సిందే. ఆ విషయంలో మొదట్లో ఒత్తిడికి గురయ్యేదాన్ని. కానీ ఇప్పుడు అలవాటైంది. మనం తీసుకొనే నిర్ణయాలు సరైన ఫలితాల్నిచ్చినప్పుడు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇప్పుడు స్టార్‌నే అయినా, స్వేచ్ఛగా నా పని నేను చేసుకొంటున్నా. ఇది నా కెరీర్‌లో ఓ ఉత్తమమైన దశ అనుకొంటాన"ని చెప్పుకొచ్చింది సమంత.

యువతరానికి ప్రతినిధిగా...


విజయ్ దేవరకొండ, శివానీసింగ్

విజయ్ దేవరకొండ, శివానీసింగ్ నాయకానాయికలుగా నటించిన చిత్రం 'ఏ మంత్రం వేశావే'. శ్రీధర్ మర్రి దర్శకుడు. ఈ చిత్రాన్ని ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. గురువారం ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర సమర్పకుడు మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ "క్రీడా నేపథ్యంలో నడిచే విభిన్నమైన కథ ఇది. విజయ్ దేవరకొండ పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. నేటి యువతరానికి ప్రతినిధిగా కనిపిస్తాడు. విదేశాల్లో చిత్రీకరించిన సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. 'పెళ్లిచూపులు', 'అర్జున్ రెడ్డి' తరహాలోనే ఈ చిత్రం విజయ్‌కు మంచి పేరు తీసుకువస్తుంద"న్నారు. శివ నారాయణ, ఆశిష్‌రాజ్, రాజబాబు, నీలాక్షీసింగ్ తదితరులు నటిస్తున్నారు. సంగీతం: అబ్బుత్ సమత్, ఛాయాగ్రహణం: శివారెడ్డి

నాలుగు రోజులు.. మూడు కథలు


అన్ను ఆంటోని

అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, అన్ను ఆంటోని ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఆనందం'. గణేష్ రాజ్ దర్శకుడు. ఎత్తరి గురురాజ్ నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈనెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "కాలేజీ నేపథ్యంలో సాగే కథ ఇది. నాలుగు రోజుల పాటు సాగే ఓ టూర్‌లో మూడు ప్రేమ కథలు... ఆసక్తికరమైన మజిలీకి చేరుకుంటాయి. ఎలా అనేది ఆసక్తికరంగా తీర్చిదిద్దాం. కాలేజీ యువతకు బాగా చేరువ అయ్యే చిత్రమిద"న్నారు. సంగీతం: సచిన్ వారియర్

నందికొండ వాగుల్లో...


పూజా సింగ్, లక్కీ

షఫీ, లక్కీ ఎకారి, సాయికిరణ్, పూజా సింగ్, మేఘన ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'నందికొండ వాగుల్లోన'. సత్యనారాయణ దర్శకుడు. రఘు నిర్మాత. హైదరాబాద్‌లో పాటలు, ప్రచార చిత్రాలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "వినోదం, ఉత్కంఠ, రొమాన్స్ కలగలిపిన చిత్రమిది. 'అర్జున్ రెడ్డి' ఫార్ములాలోనే ఆసక్తికలిగించేలా ఉంటుంది. మాస్‌ని లక్ష్యంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించామ"న్నారు. "ఈనెల 2న ఈ చిత్రాన్ని విడుదల చేద్దామనుకున్నాం. కానీ చిత్రసీమ బంద్‌ని ప్రకటించింది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామ"న్నారు నిర్మాత.

పంచ్ డైలాగ్


క్లాసులో ఉన్నప్పుడు ఎవడైనా ఆన్సర్ చెబుతాడు. కానీ ఎగ్జామ్‌లో రాసేవాడే టాపర్ అవుతాడు.

చిత్రం: జులాయి - పంపినవారు: షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

'గులేబకావళి' కథ

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. రేవతి కీలక పాత్రధారి. కల్యాణ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని తెలుగులో అదే పేరుతో విడుదల చేస్తున్నారు. ఈనెల 16న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ "నిధుల అన్వేషణ నేపథ్యంలో సాగే కథ ఇది. గులేబకావళి అనే గ్రామం చుట్టూ తిరుగుతుంది. అందుకే ఆ పేరు పెట్టాం. ప్రభుదేవా నటన, నృత్యాలు.. హన్సిక అందాలు ప్రధాన ఆకర్షణ" అన్నారు. సంగీతం: వివేక్ మెర్విన్


ప్రభుదేవా, హన్సిక

కంచిపట్టు కళతెచ్చేట్టు!



కంచిపట్టు చీరపై విభిన్న మోటిఫ్‌లూ, మయూరాలూ, పోల్కాడాట్ల కలయికతో తయారు చేసిన ప్రత్యేక వస్త్రశ్రేణి ఇది. వివాహాది వేడుకల్లో ముదురురంగులతో మెరిసిపోవాలనుకున్న వాళ్లకు ఇవి సరైన ఎంపిక. ఇంకెందుకు ఆలస్యం... ఏ రంగు నచ్చిందో ఎంచుకోండి మరి!

ఫ్యాషన్ ఫ్యాషన్

ఆకుపచ్చ కంచిపట్టు బ్రొకేడ్ చీరపై నేసిన పసిడి రంగు నెమళ్ల మోటిఫ్‌లూ... దానికి జతగా గులాబీ రంగు అంచూ, కొంగు చీరకు కొత్త వన్నె తెచ్చాయి.

ముదురు నీలం, ఎరుపు రంగుల మేళవింపులో వచ్చిన చీర ఇది. అంచుపై నెమళ్లూ, ఏనుగుల మోటిఫ్‌లు... చీరంతా పరచుకున్న వజ్రాకృతి గళ్లు మొత్తంగా అదనపు హంగు తెచ్చాయి.

ఆకుపచ్చ కంచిపట్టు చీరపై పసిడి రంగులో నేసిన గళ్లూ, మయూరాల మోటిఫ్‌లు... ముదురు గులాబీ రంగు కొంగు మీద పరుచుకున్న హోలీ మోటిఫ్‌లు మరో ఆకర్షణ.

మోడల్: కృతికా సింగ్ రాథోడ్

ఫొటోలు: దండాశ్రీనివాసరావు

పసిడి రంగు బ్రొకేడ్ కంచిపట్టు చీరపై పరచుకున్న పూలతలూ, గుర్రం మోటిఫ్‌లూ, గులాబీ రంగు అంచుపై మామిడి పిందెలు... చీర అందం పెంచాయి.

కుంకుమ రంగులో మెరిసిపోతున్న బ్రొకేడ్ కంచిపట్టు చీరపై పసిడి రంగులో నేసిన చిన్న చిన్న పోల్కాడాట్లు... దానికి హంగుతెచ్చే ముదురు ఆకుపచ్చ, గులాబీ రంగుల మేళవింపులో వచ్చిన అంచు, నెమలి మోటిఫ్‌ల గురించి ఎంత చెప్పినా తక్కువే.

నగలు, దుస్తులు:
KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
✆ 08662496464,
విజయవాడ.

బంగారం-వెండి



1న ముగింపు-క్రితం

హైదరాబాద్	ముగింపు	క్రితం
బంగారం (24క్యా)	31,300	31,450
ఆర్నమెంట్	29,210	29,370
వెండి (కిలో)	39,172	39,360
విజయవాడ		
బంగారం (24క్యా)	31,400	31,400
ఆర్నమెంట్	29,150	29,150
వెండి (కిలో)	39,700	39,700
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,380	31,400
ఆర్నమెంట్	29,060	29,050
వెండి (కిలో)	39,400	39,400
రాజమండ్రి		
బంగారం (24క్యా)	30,930	31,110
ఆర్నమెంట్	28,930	29,080
వెండి (కిలో)	38,500	38,800
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,160	31,160
ఆర్నమెంట్	28,980	28,980
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
బంగారం ఆర్నమెంట్ (గ్రా)	2,893	2,908
వెండి (గ్రా)	41.10	41.30

(రూ. లలో)

చేతివృత్తులకు చేయూతనిస్తాం!

కొన్ని ఊరిపేర్లు చెప్పగానే... అక్కడ ప్రసిద్ధికెక్కిన కళానైపుణ్యం గుర్తొస్తుంది. కానీ బొమ్మలూ, కళాకృతుల తయారీ వెనుక ఆ కళాకారుల కష్టం కూడా ఎంతో ఉంటుంది. దాన్ని గుర్తించిన వంద్యా లక్కరాజు, రేఖా ముత్యాల... ఆ కళాకారులకు మేలు చేయాలనుకున్నారు. వాళ్ల ఆదాయ మార్గాన్ని పెంచాలనుకున్నారు. అందుకోసం ఉద్యోగాల్ని వదిలేసి ఊరూరా తిరిగారు. తరువాత ఏం చేశారో వసుంధరకు వివరించింది వంద్య.

పెంబర్తి, ఏటికొప్పాక... ఇలా కొన్ని గ్రామాల పేరు చెప్పగానే అక్కడి కళలూ, కళాకారుల కష్టాలు గుర్తొస్తాయి. అవన్నీ చూశాక వాళ్ల ఆదాయ మార్గాన్ని పెంచాలనుకున్నాం. వాళ్లు తయారుచేసే వస్తువులే ఆధునికంగా ఉండేలా చేశాం. మా ఇద్దరిదీ హైదరాబాదే. నిఫ్ట్‌లో చదువుతున్నప్పటినుంచీ నగలకు సంబంధించిన వ్యాపారం చేయాలనుకున్నాం. కానీ ఎలా అనేదే తెలియదు. అందుకే చదువయ్యాక మార్కెటింగ్, ముడి పదార్థాల సేకరణ మీద అవగాహన వస్తుందని డిజైనింగ్ రంగంలోనే ఉద్యోగం చేశాం. అప్పుడే మాకు కళాకారుల కష్టాలు తెలిశాయి. చాలా ప్రాంతాల్లో వారు తయారుచేసే వస్తువులు పెద్దగా అమ్ముడుపోవు. ఉదాహరణకు పెంబర్తిలో తయారయ్యే ఇత్తడి తాపడాలూ, మొమెంటోల్ని ప్రత్యేక సందర్భాల్లోనే వాడతారు. మరి వారికి డబ్బు. ఈ ఆలోచన రాగానే వివిధ గ్రామాలకు వెళ్లి, అక్కడున్న కళాకారుల జీవనశైలీ, వారు చేసే రకరకాల ఆకృతుల గురించి తెలుసుకున్నాం. ఆ ప్రాంతం, కళాకారుల ప్రత్యేకత తెలిసేలా, తరచూ ఉపయోగపడే వస్తువుల్ని అందుబాటులోకి తేవాలనుకున్నాం. వారికొచ్చిన పనితోనే ఇంకా ఏమేం తయారు చేయొచ్చో వివరించాం. కొన్ని ఉత్పత్తులు చేయించాం.









కళ చెక్కుచెదరకుండా... అనంతపూర్‌లోని నిమ్మలకుంట నుంచి మా ప్రయాణం మొదలుపెట్టాం. అక్కడ ఎక్కువగా తోలు బొమ్మలు చేస్తారు. వాళ్లతో అవే కాకుండా లెదర్ పర్సులూ, కార్ హ్యాంగింగ్‌లతో పాటూ మరికొన్ని యాక్సెసరీలూ చేయించాం. ఇదే సూత్రాన్ని ఇతర ప్రాంతాలకూ ఉపయోగించాం. ఏటికొప్పాక కళాకారులతో పెళ్లిళ్లకు ఉపయోగపడే ఉత్పత్తులూ, కార్పొరేట్ బహుమతులు చేయిస్తున్నాం. బంజారా ప్రజలు వారు పెట్టుకునే వెండి నగలను పోలిన అల్యూమినియం నగల్ని చేస్తారు. వాళ్లకూ ఎంబ్రాయిడరీ కూడా వచ్చు. అందుకే ఆ కళకు కాస్త ఆధునికతను కలగలిపి చెవిరింగులూ, నెక్లెస్‌లు తయారుచేయిస్తున్నాం. పెంబర్తిలోనూ అంతే. ఇప్పుడు ఇరవైఅయిదు ప్రాంతాల నుంచి.. ఐదుగురు చొప్పున మొత్తం 20 నుంచి 25 మంది కళాకారులతో కలిసి పనిచేస్తున్నాం.

తొలి వినియోగదారుడక్కడే... మొదటిసారి ఓ ఎక్స్‌పోలో వాళ్లు తయారుచేయించిన వస్తువుల్ని ఉంచాం. ఎవరూ కొనకపోయినా ఫరవాలేదు. కనీసం బాగున్నాయని చెప్పినా చాలనుకున్నాం. కానీ మంచి స్పందన వచ్చింది. క్రమంగా ఆదరణ పెరిగింది. ఒకప్పుడు సొంతంగా పనిచేసిన కళాకారులే ఇప్పుడు మిగతా వాళ్లకూ శిక్షణ ఇస్తున్నారు. ఏడాదంతా ఆదరణ ఉండే వస్తువుల్నే చేయిస్తున్నాం. ఇదంతా రెండేళ్లుగా చేస్తున్నా.. కిందటి జూన్‌లో ఇష్మా పేరుతో ఓ వెబ్‌సైట్ ప్రారంభించాం. దానర్థం పునర్జన్మ అని! అంటే కళలకు మరో రూపం ఇవ్వడమే. ఇప్పుడు సంవత్సరానికి పదిలక్షల్లోపల ఆదాయం వస్తోంది. ఆస్ట్రేలియాలో కూడా వాటిని అమ్మిపెడతాం అంటూ కొందరు ముందుకొచ్చారు. ప్రస్తుతం హైదరాబాద్‌తోపాటూ చెన్నై, బెంగళూరులోనూ ఎగ్జిబిషన్లలో పాల్గొన్నాం. మా మేమెంత కష్టపడినా ఫరవాలేదు వాళ్ల ఆదాయమార్గాన్ని పెంచడమే మా ప్రయత్నం.

నజరానా హ్యాండ్‌బ్యాగులో గులాబీ నీరులో ముంచిన దూది ఉండ ఉంచితే పరిమళభరితమవుతుంది.

వసుంధర వంటల పోటీ!



మీరు చక్కగా వంట చేయగలుగుతారా? నోరూరించే పదార్థాలను చకచకా చేయడంలో సమర్థులా... అయితే రానున్న మహిళా దినోత్సవం సందర్భంగా **'ఈనాడు - వసుంధర'** మీకు ఆహ్వానం పలుకుతోంది. తక్కువ నూనె, ఉప్పు వాడుతూ నోరూరించే పదార్థాలు మాకు చేసి పంపండి. చిరుతిళ్లు, అల్పాహారాలు, కూరలూ, జంక్‌ఫుడ్.. ఇలా ఏవయినా సరే మాకు పంపొచ్చు. మీరు చేయాల్సిందల్లా.. వంటను చేసి వీడియో తీసి, మాకు వాట్సాప్ చేయడం, ఆ పదార్థాల వివరాలను తెలియజేయడం.

మీ వంటల వీడియోలను పంపించాల్సిన చివరితేదీ.. 04.3.2018. ఇక, వీడియోలు పంపించాల్సిన వాట్సాప్ నంబరు 9121167517.

ఎలా పంపాలంటే..

- మీ పేరు, ఫొటో, ఊరు వివరాలు.
- వంటకం పేరు..
- పదార్థం వీడియో!

మొదటి ఐదుగురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ఇంకెందుకాలస్యం! ప్రయత్నించండి మరి.

లేజర్ చేయించుకున్నా... ముఖం నల్లబడింది!

నా వయసు ఇరవై నాలుగు సంవత్సరాలు. మా ఇంట్లో అందరిలానే నేనూ లావుగానే ఉంటాను. నా సమస్య ముఖంపై అవాంఛిత రోమాలు. ఆసుపత్రికి వెళితే పరీక్షించకుండానే లేజర్ చేశారు. ఇలా రెండేళ్ల విరామంతో కనీసం పదిహేను సార్లు లేజర్ చేయించుకున్నా. దాంతో ఆ భాగంలో ముఖం అంతా నల్లగా మారిపోయింది. ఈ మధ్య నెలసరిలో సమస్య లొస్తే... డాక్టర్ దగ్గరకు వెళ్లా. పరీక్షలు చేసి పీసీఓఎస్ అన్నారు. మందులు వాడుతున్నా కానీ నా సమస్య అదుపులోకి రావడం లేదు. నలుగురిలోనికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. దీనికి పరిష్కారం చూపించగలరు?

-శ్రీ, విజయవాడ

మీకున్నది పాలిసిస్టిక్ ఒవేరియన్ సింగ్రోమ్(పీసీఓఎస్). దీనివల్ల మొదట పై పెదవిపై వెంట్రుకలు పెరుగుతున్నట్లు అనిపిస్తుంది. కొంతకాలానికి చెంపల మీదా, గడ్డం కిందా, కొంతమందిలో రొమ్ముపైనా, పొట్టమీదా కూడా కనిపిస్తాయి. మామూలు స్థాయిలు కంటే యాండ్రోజెన్, టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లు ఎక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి ఎదురవుతుంది. మరికొంతమందిలో అధివృక్కగ్రంథి సమస్యలు ఉన్నప్పుడూ, కంజినైటల్ అడ్రినల్ హైపర్ ప్లేసియాలాంటి వాటివల్ల కూడా ఈ అవాంఛిత రోమాలు కనిపిస్తాయి. నిజానికి పీసీఓఎస్ సమస్య వల్లే అంతా బరువు పెరిగామనుకుంటారు. కానీ బరువు పెరగడం వల్లే ఈ సమస్య ఎదురవుతుంది. అవాంఛిత రోమాల పెరుగుదల విషయంలో మీరు మొదటినుంచీ అశ్రద్ధ చేశారు. ఇక కొన్నిసార్లు ఐదు నుంచి పదిశాతం మందిలో వంశపారంపర్యంగానూ అవాంఛిత రోమాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు సరైన కారణం లేకుండానే ఈ సమస్య పెరుగుతుంది. దీనికి చికిత్స అంటే...వైద్యులు మొదట బరువు తగ్గమని సూచిస్తారు. హార్మోన్లలో హెచ్చుతగ్గులు ఉంటే మందుల ద్వారా చికిత్స చేస్తారు. అవాంఛిత రోమాల్ని నియంత్రించడంలో లేజర్ ప్రక్రియ శక్తిమంతంగా పనిచేస్తుంది. కానీ ఇది నిపుణుల పర్యవేక్షణలో చేయించుకోవాలి. చైనీస్ లేజర్ వంటివి ప్రయత్నించడం వల్ల చర్మం రంగుమారుతుంది. మీకూ అలాంటి సమస్య ఎదురై ఉండొచ్చు. బరువు తగ్గాక, హార్మోన్ల సమన్వయం అయ్యాయనుకుంటే లేజర్‌తో పాటు ఎలక్ట్రాలసిస్ చేయించుకుంటే వందశాతం సమస్యను తగ్గించుకోవచ్చు. అలానే అవాంఛిత రోమాలు పెరగకుండా క్రీంలు ఉంటాయి. ఈ చికిత్సకు కనీసం ఏడాది పడుతుంది. కాబట్టి మరోసారి నిపుణుల్ని సంప్రదించండి.

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజిషియన్

– మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

అజీర్తికి నిమ్మరసం

బయట ఆహారం తిన్నప్పుడు కొన్నిసార్లు సరిగ్గా జీర్ణం కాదు. కడుపు ఉబ్బరం కూడా తప్పదు. అలాంటప్పుడు వైద్యుల్ని సంప్రదించేకన్నా ముందే ఇంట్లో ఉండే పదార్థాలతో సమస్య తీవ్రం కాకుండా చూసుకోవచ్చు.



- నిమ్మకాయకుండే ఆమ్ల గుణాలు బ్యాక్టీరియాను వేగంగా చంపుతాయి. చెంచా నిమ్మరసంలో కాస్త పంచదార కలిపి తాగితే జీర్ణశక్తి మెరుగవుతుంది. రోజుకు రెండు మూడు సార్లు ఇలా తాగుతూ ఉండాలి. లేదంటే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం పిండి ఆరారగా తాగాలి. నారింజ రసంతో కూడా ఇవే ఫలితాలుంటాయి.
- వెల్లుల్లిలో ఉండే యాంటీబ్యాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు డయేరియా, కడుపు నొప్పి లాంటి సమస్యలను తగ్గిస్తాయి. కొన్ని వెల్లుల్లి రెబ్బలను నీటిలో మరిగించి ఆ నీటిని రోజు మొత్తం తాగుతుంటే ఉపశమనం ఉంటుంది.

రయ్ రయ్

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
autopage@eenadu.in



ఏబీఎస్..
ప్రమాదాలకు బ్రేక్‌అప్

బైక్‌పై వందకిలోమీటర్ల వేగంతో వెళ్తున్నప్పుడు అకస్మాత్తుగా ఏదైనా అడ్డొస్తే ఏమవుతుంది? సడెన్ బ్రేక్ వేస్తాం. నియంత్రణ కోల్పోయి కింద పడతాం. అదే కారు అయితే ఎదురుగా ఉన్నవాటిని ఢీకొడతాం. యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) ఉన్న వాహనాలకైతే ఆ ప్రమాదం తక్కువ అంటున్నారు నిపుణులు. ఇంతకీ ఏంటా ఏబీఎస్?

ఏబీఎస్ ఓ ఎలక్ట్రానిక్ వ్యవస్థ. ఇందులో హైడ్రాలిక్ యూనిట్, ఎలక్ట్రానిక్ యూనిట్ ఉంటుంది. ఇవి రెండు నేరుగా ముందు బ్రేక్‌కు అనుసంధానమై ఉంటాయి. మనం సడెన్ బ్రేక్ వేసినపుడు ఎలక్ట్రానిక్ యూనిట్‌కి ఒక సందేశం వెళ్తుంది. ఇక్కడ ఓ సెన్సర్ ఉంటుంది. అది డిస్క్ బ్రేక్‌కి అనుసంధానమై ఉంటుంది. ఎప్పుడైతే బ్రేక్ ఫోర్స్‌గా వేస్తామో అప్పుడు సెన్సర్ యాక్టివేటై బ్రేక్ ఒక్కసారిగా కాకుండా సెకనుకోసారి ఆగి ఆగి పడుతుంది. ఇలా చేయడం వల్ల వాహనం వందకిలోమీటర్ల వేగంతో వెళ్లినా టైర్ స్కిడ్ కాదు. కారు స్టీరింగ్, బైక్ హ్యాండిల్ మన నియంత్రణలోనే వాహనం కుడివైపుకో, ఎడమవైపుకో వెళ్తుంది. ఇంకొంచెం అడ్వాన్స్డ్ వాహనాల్లో అయితే ముందు, వెనక రెండు చక్రాలకూ ఏబీఎస్ ఉంటుంది. దీంతో వాహనదారులు చాలా ప్రమాదాల నుంచి బయటపడే అవకాశం ఉంది. ఇంత ప్రాధాన్యం ఉన్న ఏబీఎస్ ఏప్రిల్ 2019 నుంచి ప్రతి వాహనంలో తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ప్రభుత్వం అమల్లోకి తేబోతోంది.



ప్రస్తుతం ఈ ఏబీఎస్ సిస్టమ్ ఉండి అత్యధికంగా అమ్ముడవుతున్న రెండు లక్షల్లోపు ఉన్న బైక్‌లు ఇవి.

- టీవీఎస్ అపాచీ 180 డబుల్ ఛానెల్ ధర: రూ.90వేలు
- సుజుకీ గిక్సర్ ఎస్ఎఫ్ సింగిల్ ఛానెల్ ధర: రూ.96వేలు
- సుజుకీ ఇంట్రూడర్ 150 సింగిల్ ఛానెల్ ధర: రూ. 98వేలు
- బజాజ్ పల్సర్ ఎన్ఎస్ 200 సింగిల్ ఛానెల్ ధర: రూ.1.10లక్షలు
- బజాజ్ పల్సర్ ఆర్ఎస్ 200 సింగిల్ ఛానెల్ ధర: రూ.1.40లక్షలు

(ధరలు ఎక్స్‌షోరూం ప్రారంభ ధర)



రోడ్డుపై.. రాజాలా!


**నానో అయినా బెంజి కారైనా.. ఆటో మొదలు వోల్వో బస్సైనా దేన్నైనా అవలీలగా నడిపేస్తారు...
అలాంటివారే నిబంధనల గురించి అడిగితే మొహం తేలేస్తారు!
స్టీరింగ్ పడితే క్షణాల్లో వాయువేగంతో దూసుకెళ్తారు...
ఆ చోదకులే రోడ్డెక్కితే చిన్నపాటి జాగ్రత్తలు పాటించరు!
వాహనదారుల్లో సగంమంది ఇదే తరహా అంటోంది రవాణాశాఖ...
ఈ లెక్కలేనితనం వారిని లేనిపోని చిక్కుల్లో పడేస్తుంది..
ఈ నిర్లక్ష్యం ఒక్కోసారి నిండుప్రాణాలనూ కబళిస్తుంది...
అందుకే.. వాహనాన్ని ఎంత వేగంగా నడిపాం అన్నది కాదు..
ఎంత పద్ధతిగా నడిపాం అన్నదే ముఖ్యం అంటారు ఎవరైనా!!
దానికోసం ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అంటే...**

డ్రైవింగ్ అంటే చాలామందికి ఒక సరదా. కానీ చాలాసార్లు ప్రమాదకరం కూడా. వాహనం నడపాలంటే చాలా నిబంధనలు పాటించాలి. ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. పైగా డబ్బులు, సమయం ఖర్చవుతాయి. అవసరం ఉంటే తప్ప రోడ్డు ఎక్కకూడదు అన్నది పెద్దవారి సలహా. ఆ సంగతలా ఉంచితే ఒక మంచి డ్రైవరు అనిపించుకోవాలి అంటే ఏం చేయాలో తెలుసుకుందాం రండి.

సర్దుకోండి పక్కాగా



కారులో కూర్చోగానే ముందు మనకు సౌకర్యంగా ఉన్న అనుభూతి కలగాలి. దానికోసం మొదటగా కూర్చునే సీటును మనకు అనుగుణంగా ముందుకి, వెనక్కి, పక్కలకు ఎటు కావాలంటే అటువైపు అడ్జస్ట్ చేసుకోవాలి. ఆధునికమైన వాహనాల్లో ఎలక్ట్రానిక్ కంట్రోల్ ద్వారా ఇలా మార్చుకోవచ్చు. పాతరకం కార్లలో అయితే సీటు కిందిభాగంలో ఉండే లీవర్ ద్వారా కావాల్సినట్టు మార్చుకోవచ్చు. ముందు రోడ్డుపై ఉన్న వాహనాలు స్పష్టంగా కనపడేలా, శరీరానికి ఒక అడుగుదూరంలో స్టీరింగ్ సౌకర్యంగా పట్టుకునేలా.. యాక్సిలేటర్, బ్రేక్‌పై కాళ్లు సాఫీగా వేసేలా ఈ అమరిక ఉండాలి. స్టీరింగ్ పట్టుకునేటప్పుడు గోడగడియారంలో 9 మరియు 3 గంటల్ని సూచించే పొజిషన్‌లో రెండు చేతులు ఉండాలి. ఒకే చేత్తో స్టీరింగ్ పట్టుకుంటే అదుపుతప్పే అవకాశం ఉంది. మరీ బిగుతుగా పట్టుకున్నా దానిపై పట్టు ఉండదు. వెనకనుంచి, పక్కల నుంచి వచ్చే వాహనాలు కనిపించడానికి వాహనాలకు అద్దాలుంటాయి. కారు లోపల ఉండే రేర్ వ్యూ మిర్రర్‌లో వెనక నుంచి వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించాలి. ప్రమాదకర మూలమలుపులు, ఇరుపక్కల వాహనాలు కనిపించేలా సైడ్ మిర్రర్స్ అడ్జస్ట్ చేసుకోవాలి. సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ రికమెండేషన్ ప్రకారం పక్క అద్దాలను పూర్తిగా అవతలివైపు తెరిచి పెట్టాలి. సైడ్‌మిర్రర్‌లలో మన వాహనంలో చిన్నభాగం కూడా కనిపించకూడదు.



నిబంధనలు తెలియాలి

రవాణాశాఖ నిబంధనలు ఒక్కోచోట ఒక్కోలా ఉంటాయి. రాష్ట్రానికి, నగరానికి, దేశానికీ మారిపోతుంటాయి. సీటుబెల్టు ధరించకపోవడం ఒక్కోచోట పెద్ద నేరం. మరోచోట నామమాత్ర జరిమానా ఉంటుంది. మనదేశంలో ఎడమవైపు డ్రైవింగ్ చేస్తే.. కొన్ని దేశాల్లో కుడివైపున వెళ్లాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ఒక్కోచోట ఒక్కోరకమైన జరిమానా, శిక్షలు ఒక్కోరకంగా ఉంటాయి. ఈ నిబంధనలు తప్పకుండా తెలుసుకొని తీరాలి. కొత్తగా డ్రైవింగ్ నేర్చుకునేవాళ్ల పక్కన కచ్చితంగా బాగా నడపగలిగే అనుభవం ఉన్నవాళ్లు తప్పకుండా ఉండాలి. అయితే ఇవన్నీ వాహనదారుల భద్రతకోసమే అన్న విషయం మరవొద్దు.



బొమ్మలు: శ్రీనివాస్

గమనించండిలా


ఏళ్లకొద్దీ డ్రైవింగ్ చేస్తున్నా చాలామందికి కారులో ఉండే డ్యాష్‌బోర్డ్‌పై సైతం కనీస అవగాహన ఉండదు. వాహనం ఎంత వేగంగా వెళ్తోందీ, ఇంకా ఎంత ఇంధనం మిగిలి ఉంది? ఇంజిన్ ఎంత ఆర్‌పీఎంతో పనిచేస్తుందీ.. ఈ వివరాలన్నీ డిజిటల్ గేజ్‌లు సూచిస్తూ ఎప్పటికప్పుడు మనల్ని అప్రమత్తం చేస్తుంటాయి.



వాటి గురించి తెలుసుకోవాలి. హైవేలపై వెళ్లేటప్పుడు ఒక వరుస నుంచి మరో వరుసకి మారాలనుకున్నా, ముందు వెళ్లే వాహనాలను ఓవర్‌టేక్ చేయాలనుకున్నా కనీసం ఐదుసెకన్ల ముందే సైడ్ ఇండికేటర్లు వేయాలి. దీంతో మన ఉద్దేశం ఇతరులకు అర్థమవుతుంది. ఇలా టర్న్‌లు తీసుకునేటప్పుడు కేవలం అద్దాలపైనే ఆధారపడకుండా క్షణకాలంపాటు భుజాల మీదుగా వెనక్కి దృష్టి నిలిపి బ్లైండ్‌స్పాట్‌లు, వెనక వాహనాలు గమనించాలి. రవాణాశాఖ నిబంధనల ప్రకారం మన ముందు వాహనానికి కనీసం యాభై అడుగుల దూరం పాటించాలి.

పెద్దమనసుతో..

రవాణాశాఖ నిపుణులు ప్రతి వాహనదారుడూ 'డిఫెన్సివ్ డ్రైవింగ్' చేయాలని సూచిస్తారు. అంటే ముందే రాబోయే ప్రమాదాన్ని ఊహించి దానికి అనుగుణంగా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ డ్రైవింగ్ చేయడం. దీంట్లో భాగంగా ముందు వేగాన్ని ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాలి. భారీ వాహనాలతో పోటీ పడొద్దు. ర్యాష్‌డ్రైవింగ్ చేసేవాళ్లు, తాగుబోతులకు దారి ఇవ్వాలి. రోడ్డు మన ఒక్కరి సొత్తే కాదనే భావనతో ఉండాలి.



వాహనం పార్కింగ్ చేసిన తర్వాత అన్ని లైట్లు ఆఫ్ చేయాలి. హ్యాండ్‌బ్రేక్ వేయాలి. డోర్లు సరిగా లాక్ పడ్డాయో, లేదో చెక్ చేసుకోవాలి. ఇతరుల వాహనాలకు ఇబ్బంది కలిగేలా పార్కింగ్ చేయకూడదు. ఈ పద్ధతుల్ని అలవాటుగా చేసుకుంటే డ్రైవింగ్ సంతోషాన్నిస్తుంది.. డబ్బు ఆదా అవుతుంది.. ముఖ్యంగా అన్నింటికన్నా విలువైన ప్రాణాలు దక్కుతాయి అంటారు ఆటోరంగ నిపుణులు.

జాగ్రత్తసుమా

బయటే కాదు.. వాహనం నడుపుతున్నప్పుడూ పాటించే జాగ్రత్తలు మన ప్రయాణం సాఫీగా సాగేలా చేస్తాయి. ప్రతిసారీ బ్రేక్‌పై కాలు వేసిన తర్వాతే కారు స్టార్ట్ చేయాలి. ఒకవేళ వాహనం దిగుడు ప్రదేశంలో ఉంటే మన ప్రమేయం లేకుండా ముందుకు వెళ్లిపోయే ప్రమాదం తప్పుతుంది. కారులో ఎడమవైపు బ్రేక్ పెడల్, కుడివైపు యాక్సిలరేటర్ పెడల్ ఉంటుంది. ఇందులో బ్రేక్ పెడల్ కాస్త పెద్దదిగా ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ రెండింటినీ ఒక్కసారిగా తొక్కొద్దు. ఈ ఉపద్రవం తప్పాలంటే యాక్సిలేటర్‌కైనా, బ్రేక్‌కైనా ఒకే కుడి కాలితో తొక్కే అలవాటు చేసుకోవాలి. ఒక్కసారిగా యాక్సిలరేటర్‌ని పరుగులు పెట్టించడం.. సడెన్ బ్రేక్ వేయడం ఎప్పుడూ మంచి పద్ధతి కాదు.



ఇది వాహనంలో ఉన్న మనకే కాదు.. చుట్టుపక్కల ఉన్న జనం, వాహనాల్ని గందరగోళంలోకి నెట్టొచ్చు. తరచూ టైరులో గాలి చెక్ చేసుకోవడం.. వాతావరణం బాగా లేనపుడు, నీటి గుంతలున్నచోట, ఎగుడుదిగుడు ప్రదేశాల్లో నెమ్మదిగా వెళ్లడం.. ఆయిల్ లెవల్ చెక్ చేసుకోవడం.. చక్రాల అమరిక.. హెడ్‌లైట్లు, బ్రేక్‌లు పరిశీలించడం.. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడకపోవడం.. నిద్రమత్తు ఉంటే ప్రయాణం వాయిదా వేయడం.. తాగి బండి నడపకుండా ఉండటం.. లాంగ్ డ్రైవ్‌లకు వెళ్తుంటే మధ్యమధ్యలో విరామం తీసుకోవడం.. ఇవన్నీ తీసుకోవాల్సిన ప్రధాన జాగ్రత్తలు.

అతి విశ్వాసం వద్దు

వాహనం నడపడం ఎంత తెలికో.. డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం చిన్నపాటి అజాగ్రత్తతో ప్రమాదాల బారినపడటానికీ అంతే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకున్నాకే సీట్లో కూర్చోవాలి. స్టీరింగ్‌ని మధ్యలో పట్టుకొని అవసరమైనపుడు హారన్ మోగించేలా బొటనవేళ్లను పైకి ఉంచాలి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మ్యూజిక్‌పై మనసు పెట్టడం ఏకాగ్రతని దెబ్బతీస్తాయి. పరిస్థితులు అనుకూలించనప్పుడు నెమ్మదిగా వెళ్లడమే గొప్ప డ్రైవింగ్ సూత్రం. ఒక్కోసారి బ్రేక్‌కి బదులు యాక్సిలేటర్ తొక్కుతూ అనవసర ప్రమాదాలకు కారణమవుతుంటాం. ట్రాఫిక్‌లేని చోటికి వెళ్లి సాధన చేస్తే ఈ సమస్యను అధిగమించవచ్చు. డ్రైవింగ్ సీట్లో కూర్చునే ప్రతి ఒక్కరికీ రవాణా నిబంధనలు, సంజ్ఞలపై అవగాహన ఉండటం తప్పనిసరి. పనిగట్టుకొని వీటిని ఎవరూ నేర్పించరు. ఎవరికివారే తెలుసుకోవాలి. డ్రైవింగ్ లైసెన్స్, బీమా, ఆర్సీ, కాలుష్య ధ్రువీకరణపత్రం.. ఈ నాలుగూ లేకుండా వాహనం బయటికి తీసుకురావడం చట్టవిరుద్ధం. వీటన్నింటికన్నా ఎలాంటి పరిస్థితుల్లో అయినా నేను డ్రైవింగ్ బాగా చేయగలను అనే అతి ఆత్మవిశ్వాసం పనికిరాదు. ఇందులో ఏమాత్రం తేడా వచ్చినా వాహనం నడిపేవారికే కాదు ఇతరుల ప్రాణాలకే ప్రమాదం.



– దుర్గాకుమారి, వరుణ్‌మోటార్స్ (మారుతీ డ్రైవింగ్ స్కూల్)

e-తరం ఆటోలొచ్చాయి..



'ఆటో.. వస్తావా?' మనం ఎక్కడికి వెళ్లాలన్నా ఆటోవాలాలను అడిగే మాట ఇది. ఎక్కి కూర్చున్నామా ఇక భరించలేని శబ్దకాలుష్యం, వాయు కాలుష్యం. అసలే మైలేజీ తక్కువ కావడంతో ఆ భారాన్ని ఛార్జీల రూపంలో ప్రయాణికులే భరించక తప్పదు. ఇలాంటి అన్ని సమస్యకు చెక్ పెట్టేలా ఈ-ఆటోలు అందుబాటులోకి వచ్చేశాయి.

2030 కల్లా భారత్‌ను వందశాతం ఇ-వాహనాలున్న దేశంగా మార్చాలనే తలంపుతో ఉంది ప్రభుత్వం. దానికి మద్దతుగా పలు కంపెనీలు విద్యుత్తు ఆటోలతో ముందుకొస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ 'అడాప్ట్ మోటార్స్' అనే అంకురసంస్థ ఇలాంటి బ్యాటరీ ఆటోల తయారీకి సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటే త్వరలోనే మార్కెట్‌లోకి తీసుకొస్తామంటున్నాడు సంస్థ డైరెక్టర్ **మామిడోజు భరత్.**

లాభాలేంటి?

- సాధారణ ఆటోలతో పోలిస్తే.. ఈ ఆటోల్లో వాయు, శబ్ద కాలుష్యం లేకపోవడంతో పొగతో వచ్చే అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. ఇవి పర్యావరణహితమైనవి.
- కేవలం బ్యాటరీలతో నడవడం వల్ల సర్వీసింగ్ ఖర్చు దాదాపు ఉండదు. ఆటో యజమానులకు లాభం. ప్రయాణికుల నుంచి తక్కువ ఛార్జీలు వసూలు చేసే అవకాశం ఉంది.
- ఇంధనంతో నడిచే ఆటోలతో పోలిస్తే బరువు తక్కువగా ఉండటంతో నియంత్రిత వేగంతో వెళతాయి కాబట్టి ప్రమాదాలు జరగడానికి తక్కువ అవకాశాలుంటాయి.
- ఈ-ఆటోలకు సాధారణ గృహావసరాలకు వాడే ప్లగ్ పాయింట్ సరిపోతుంది. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 90 కిమీలు ప్రయాణిస్తాయి. ఛార్జీకి కేవలం రూ. 50 వ్యయమవుతుంది.
- ధర రూ. 1.4-1.6 లక్షల మధ్యలో ఉంటుంది. వినియోగదారుడి అవసరాలు, మోడల్‌బట్టి ధరల్లో మార్పులుంటాయి.

ఇవీ కంపెనీలు


- మహీంద్రా: భారత్‌లో ఈ కంపెనీ ఇ-వాహనాల విషయంలో ముందుంది. ఇటీవల జరిగిన వాహన ప్రదర్శనలోనూ 'ట్రెయో' పేరిట ఓ ఇ-ఆటోను ఆవిష్కరించింది.
- లోహియా: ఈ కంపెనీ కూడా వాహన ప్రదర్శనలో కంఫర్ట్ అనే ఆటోను విడుదల చేసింది.
- ఇవే కాకుండా భారత్‌లో పలు అంకుర సంస్థలు ఈ ఇ-ఆటోల తయారీ, విక్రయాల్లో ఉన్నాయి.
- హైదరాబాద్ విషయానికొస్తే అడాప్ట్ మోటార్స్, గాయమ్ మోటార్స్ తదితర కంపెనీలున్నాయి.

మెకానిక్ గురూ

మైలేజీ తెలిపే మార్గం

మా ఊరి బంక్‌లో 'స్పీడ్' పేరుతో పెట్రోల్ అమ్ముతున్నారు. లీటరుపై మూడు రూపాయలు ఎక్కువ తీసుకుంటున్నారు. దీంతో మైలేజీ ఎక్కువ వస్తుందని బంకు సిబ్బంది చెబుతున్నారు. ఇది నిజమేనా? లీటరు పెట్రోల్‌పై బైక్ ఎన్ని కిలోమీటర్లు తిరుగుతుందో, ఎంత మైలేజీ వస్తుందో తెలుసుకునే శాస్త్రీయమైన, కచ్చితమైన పద్ధతి ఏదైనా ఉంటే తెలియజేయండి.

– జి.ప్రశాంత్, ఆర్మూర్



భారత్ పెట్రోలియం తన హై-ఆక్టేన్ పెట్రోల్‌కే 'స్పీడ్' పేరు పెట్టి అమ్ముతోంది. సాధారణంగా పెట్రోల్ మండినపుడు శక్తి వెలువడి దాని ద్వారా బండి ముందుకెళ్తుంది. ఇలా మండే క్రమంలో కొంతమొత్తం పెట్రోల్ వృథా అవుతుంది. కానీ హై-ఆక్టేన్ పెట్రోల్ ఉపయోగిస్తే అది పూర్తిస్థాయిలో మండి తద్వారా మైలేజీ ఎక్కువ వస్తుందని చెబుతారు. కానీ ఇది ఒక అపోహ మాత్రమే. కాకపోతే బండి పికప్ కొంచెం పెరుగుతుంది. బైక్ ఇంజిన్ రకం, నిర్వహించే తీరును బట్టే మైలేజీ పెరుగుతుంది.

మార్కెట్లో దొరికే ఒక ఫిల్లింగ్‌గన్ తీసుకొని ఆటోకట్ వరకు అందులో ఇంధనం నింపండి * బైక్‌ని 75 నుంచి 100 కిమీల వరకు తిప్పండి. మళ్లీ ఆటోకట్ వరకు ఫిల్లింగ్‌గన్‌లో నింపండి * ఇప్పుడు ఫిల్లింగ్‌గన్‌లో ఎంతవరకు పెట్రోల్ నింపారో లెక్కగట్టండి. ఉదాహరణకు మొత్తం 2.36లీటర్లు నింపారు అనుకుందాం. డెబ్బై అయిదు కిలోమీటర్లు తిరిగితే దాన్ని 2.36లీటర్లతో భాగించాలి. అంటే 75కిమీలు/2.36లీటర్లు= 31.77 మైలేజీ అవుతుంది.

సాయిభరత్ బొప్పరాజు,
www.motofix.in

(ఇలాంటి సమస్యలుంటే రాసి పంపండి. నిపుణులతో సమాధానాలిప్పిస్తాం)

ఔరా!



- ప్రపంచవ్యాప్తంగా వందకోట్ల కార్లు వాడుకలో ఉన్నాయి.
- ప్రపంచంలోనే మొదటి ట్రాఫిక్ సిగ్నల్ ఇంగ్లండ్‌లోని వోల్వర్‌హాంప్టన్‌లో 1927లో ప్రారంభించారు.
- ప్రపంచంలో మొదటి కారు యాక్సిడెంట్ 1769లో జరిగింది.

చిట్కా

టూత్‌పేస్ట్‌తో హెడ్‌లైట్లు తళతళ

వాహనాలు పాతవైనా, చాలాకాలం శుభ్రం చేయకుండా ఉన్నా వాటి హెడ్‌లైట్లు పసుపు రంగులోకి మారిపోతాయి. మురికిగా తయారవుతాయి. ఇలాంటివాటిని ఇంట్లోనే తళతళలాడిపోయేలా చేయొచ్చు. ఎలాగంటే..



- బేకింగ్ సోడా, పెరాక్సైడ్ ఉన్న ఏదైనా టూత్‌పేస్ట్‌ని తీసుకొని ముందు హెడ్‌లైట్ అంతా పరుచుకునేలా రుద్దాలి.
- తర్వాత టూత్‌బ్రష్‌తో ఐదునుంచి పదినిమిషాలు అదిమిపట్టి రాయాలి.
- గోరువెచ్చని నీటిని చిలకరిస్తూ పేపరుతో తుడవాలి.
- చివర్లో మరో పొడి పేపరుతో తుడిస్తే హెడ్‌లైట్ తళతళలాడుతుంది.

ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

టాటా ట్రస్టు ఛైర్మన్ రతన్‌టాటా

ఈనాడు-హైదరాబాద్: ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్ మహమ్మారికి అడ్డుకట్ట వేయొచ్చని టాటా ట్రస్టు ఛైర్మన్ రతన్‌టాటా పేర్కొన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో చైతన్యం పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. క్యాన్సర్‌ను నియంత్రించడంలో తెలంగాణకు టాటా ట్రస్టు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ వ్యాధికి సమగ్ర చికిత్సలో భాగంగా రాష్ట్రంలో అవగాహన కార్యక్రమాలు, ముందస్తు గుర్తింపు పరీక్షలు, శిక్షణ, పరిశోధన, సాంకేతిక సహకారం, అనుభవజ్ఞులైన వైద్యుల సలహాలు, సూచనలు, మౌలిక వసతుల కల్పనలో తోడ్పాటు.. తదితర అంశాలపై గురువారం టాటా ట్రస్టుతో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ పరస్పర అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. శంషాబాద్‌లోని ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలో రతన్‌టాటా, మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డి సమక్షంలో.. వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, టాటా మేనేజింగ్ ట్రస్టీ ఆర్.వెంకటరమణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో వైద్యఆరోగ్యశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యకార్యదర్శి దృశ్యసహిత సమాచారాన్ని అందించారు. అనంతరం రతన్‌టాటా మాట్లాడుతూ.. "క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో వయో, లింగ భేదం లేదు. వ్యాధిని ముందస్తు గుర్తింపు ద్వారా నియంత్రించడం సాధ్యమే. ఈ ఒప్పందం వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది" అని పేర్కొన్నారు.

తెలంగాణలో టాటా వైమానిక ఉత్పత్తుల పరిశ్రమ

ఈనాడు హైదరాబాద్: వైమానిక ఉత్పత్తులు దిగుమతులు చేసుకోవడం కాదు. మనమే ఉత్పత్తి చేయాలి. ఇక్కడ వినియోగమే కాదు విదేశాలకు ఎగుమతి చేయాలనే ప్రధాని మోదీ కల సాకారమవుతోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తెలంగాణలోని టాటా బోయింగు వైమానిక పరిశ్రమ భారత్‌లో తయారీ కార్యక్రమానికి ప్రతిబింబంగా నిలిచిందన్నారు. రోబోలకు దీటుగా లోపరహిత వైమానిక ఉత్పత్తుల ద్వారా ఈ పరిశ్రమ గొప్ప ఘనతను సాధించిందన్నారు. రంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) వైమానిక సెజ్‌లో టాటా బోయింగ్ వైమానిక ఉత్పత్తుల పరిశ్రమను గురువారం ఆమె రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, టాటా ట్రస్ట్ ఛైర్మన్ రతన్‌టాటా, అమెరికా రాయబారి జస్టర్‌లతో కలిసి ప్రారంభించారు.

నేటి తెదేపాపా సమావేశంపై ఉత్కంఠ

- **బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ**

ఈనాడు, అమరావతి: విజయవాడలో శుక్రవారం జరగనున్న తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంపైన సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గురువారం దిల్లీలో భాజపా జాతీయ అధ్యక్షుడితో జరిగిన భేటీలో చర్చించిన అంశాలను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్ కుటుంబరావు, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు సమావేశంలో వివరించనున్నారు. వాటి ఆధారంగా రెండో విడత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు భాజపా జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులతో జరగబోయే ఉమ్మడి భేటీల్లో ఎలా వ్యవహరించాలి? పార్లమెంటు సమావేశాలు ప్రారంభం తర్వాత ఎలాంటి వ్యూహాన్ని పాటించాలి? విభజన హామీల సాధన కోసం ఎలాంటి ప్రణాళిక అనుసరించాలనేదానిపై చర్చించి కార్యాచరణ ఖరారు చేయనున్నారు.

రెండు రాష్ట్రాల సీఎస్‌ల భేటీ వాయిదా

విభజన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన జరగాల్సిన తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల సమావేశం వాయిదా పడింది. ఈ నెల 12వ తేదీన ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా వర్తమానం అందింది.



సమావేశంలో మాట్లాడుతున్న పవన్. చిత్రంలో జేపీ, పద్మనాభయ్య, ఉండవల్లి అరుణ్‌కుమార్, తోట చంద్రశేఖర్, ఐవైఆర్ కృష్ణారావు

రేపు జేఎఫ్‌సీ నివేదిక

- **వెల్లడించనున్న జనసేనాని కల్యాణ్, సభ్యులు**

ఈనాడు అమరావతి: కేంద్ర ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో రాష్ట్రానికి చేసిన సాయం, రాష్ట్రం కేంద్రాన్ని కోరిన సాయం లెక్కలపై వాస్తవాలను తేల్చేందుకు ఏర్పాటైన సంయుక్త నిజ నిర్ధరణ కమిటీ (జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) తన నివేదికను శనివారం వెల్లడించనుంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, కమిటీ సభ్యులతో కలిసి కమిటీ నివేదికను ప్రకటించనున్నారు. గురువారం హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్, కమిటీలోని ముఖ్య సభ్యులు పద్మనాభయ్య, జయప్రకాశ్ నారాయణ్, ఉండవల్లి అరుణ్‌కుమార్, తోట చంద్రశేఖర్, ఐవైఆర్ కృష్ణారావు తదితరులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కమిటీ నివేదికపై కసరత్తు చేశారు. శుక్రవారం మరోసారి భేటీ అయి నివేదికకు తుదిరూపమివ్వనున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన సాయంపై రాష్ట్రప్రభుత్వం ఏమేం కోరిందనే వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీకి పంపింది. ఆ వివరాలను పరిశీలించిన కమిటీ.. కేంద్రం రాష్ట్రానికి చేసిన సాయంపై భాజపా, కేంద్ర ప్రతినిధులు వివిధ సందర్భాల్లో వేర్వేరుగా జారీ చేసిన పత్రాల్లోని వివరాలను సరిచూశారు. ఇరు ప్రభుత్వాల లెక్కలను పోల్చి విశ్లేషించిన కమిటీ వాటిలోని వాస్తవాంశాలను తమ నివేదికలో వెల్లడించాలని నిర్ణయించింది.



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి

ఆధార్‌తో 2.75 కోట్ల నకిలీ రేషన్ కార్డుల రద్దు

- **ఏటా రూ.17,500 కోట్ల విలువైన నిత్యావసరాలు ఆదా**

ఈనాడు, దిల్లీ: రేషన్ కార్డుల డిజిటలీకరణ, ఆధార్ అనుసంధానంతో దేశవ్యాప్తంగా 2.75 కోట్ల నకిలీ రేషన్ కార్డుల గుట్టు రట్టయింది! కేంద్ర ప్రభుత్వం వీటిని రద్దు చేసింది. బోగస్ కార్డులు అత్యధికంగా రద్దయిన రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ తొలిస్థానం కాగా.. తెలంగాణ ఐదో స్థానంలో నిలిచింది. తాజా పరిణామంతో దేశవ్యాప్తంగా చౌక ధరల దుకాణాల ద్వారా సరఫరాచేసే నిత్యావసరాలు భారీ మొత్తంలో ఆదా అయ్యే అవకాశం కలిగినట్లయింది. "బోగస్ కార్డుల ఏరివేతతో.. ఏటా రూ.17,500 కోట్ల విలువైన సరుకులు పక్కదారి పట్టకుండా అడ్డుకట్ట వేసే అవకాశం ఏర్పడింది. వీటిని నిజమైన లబ్ధిదారులకు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం" అని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

"జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద చౌక ధరల దుకాణాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరకులను అందించేందుకు మొత్తం 23,19,42,646 కార్డులను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. ఇప్పటికే వీటి డిజిటలైజేషన్ పూర్తయింది. అయితే, ఇప్పటివరకు 82% కార్డులు మాత్రమే లబ్ధిదారుల ఆధార్ నంబరుతో అనుసంధానమయ్యాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి మరిన్ని బోగస్ కార్డులు వెలుగుచూసే అవకాశముంది" అని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాలశాఖ వర్గాలు తెలిపాయి. 2013 జనవరిలో ఆరంభమైన రేషన్ కార్డుల డిజిటలీకరణ కార్యక్రమం నాలుగేళ్లుగా ముమ్మరంగా సాగుతోంది.

అత్యధికంగా నకిలీ రేషన్ కార్డులు రద్దయిన రాష్ట్రాలు

రాష్ట్రం	కార్డుల సంఖ్య
ఉత్తరప్రదేశ్	68,80,999
పశ్చిమ బంగ	66,13,961
కర్ణాటక	27,49,532
మహారాష్ట్ర	21,62,391
తెలంగాణ	20,97,564

వైభవంగా ముగిసిన శ్రీవారి తెప్పోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక తెప్పోత్సవాలు గురువారం వైభవంగా పరిసమాప్తమయ్యాయి. ఆరు రోజులపాటు జరిగిన ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తెప్పను అధిరోహించి ఏడుసార్లు ప్రదక్షిణంగా విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పున్నమి వెన్నెలలో విద్యుద్దీపాలకు వెన్నెల కాంతులు తోడై ఉభయ నాంచారుల సమేత శ్రీమలయప్పస్వామి విరాజిల్లారు. వార్షిక తెప్పోత్సవాల నేపథ్యంలో రద్దు చేసిన ఆర్జిత సేవలను శుక్రవారం నుంచి తిరిగి పునరుద్ధరించనుంది.

నేటి నుంచి శ్రీనివాస కల్యాణాలు

తిరుపతి, న్యూస్‌టుడే: తితిదే శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 31 వరకు చిత్తూరు, ప్రకాశం, విజయనగరం జిల్లాలు, కర్ణాటకలో శ్రీనివాస కల్యాణాలు జరగనున్నాయి.

విజయనగరం జిల్లాలో: 2న కురుపాం మండలంలోని కొన్నుగడవలస ఎస్సీ కాలనీలో, 3న బొబ్బిలి మండలంలోని రాజాచెరువు వలస ఎస్సీ కాలనీలో, 4న గుర్ల మండలంలోని బెలరపేట ఎస్సీ కాలనీలో, 5న గుర్ల మండలంలోని దేవుని కనపాక ఎస్సీ కాలనీలో, 6న గంట్యాడ మండల కేంద్రంలో కల్యాణాలు నిర్వహిస్తారు.

చిత్తూరు జిల్లాలో: 13న బంగారుపాళ్యం మండలం ముదుపోయలు ఎస్సీ కాలనీలో, 15న చిత్తూరు రూరల్ మండలం దిగువకట్టిగ ఎస్సీ కాలనీలో, 16న వెదురుకుప్పం మండలం చింతలగుంట ఎస్సీ కాలనీలో, 17న ఆర్ సీపురం మండలం నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీవారి కల్యాణం జరుగుతుంది. ఈనెల 14న తేదీన కర్ణాటకలోని కోలార్ జిల్లా ముళబాగిల్‌లోని ఎన్.వడ్డహళ్లిలో, 31న ప్రకాశంజిల్లా ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తారు.

14న జనసేన ఆవిర్భావ సభ

ఈనాడు, అమరావతి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ నెల 14న జరగనున్నాయి. గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరి, జాయింట్ ఫ్యాక్ట్స్ ఫైండింగ్ కమిటీ సమావేశాల నేపథ్యంలో ఈ సభలో పవన్‌కల్యాణ్ పలు అంశాలపైన స్పష్టమైన ప్రకటన చేయనున్నట్లు సమాచారం. పార్టీ రాజకీయ సిద్ధాంతాలు, విధానాలతో పాటు తెలుగు రాష్ట్రాల మధ్య సహృద్భావ వాతావరణం బలోపేతం చేయడం లాంటి అంశాలపైన మరింత స్పష్టతివ్వనున్నట్లు తెలిసింది.

జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు

ఈనాడు డిజిటల్, అమరావతి: జాతీయ స్థాయి భూగర్భ జలాల పరిరక్షణ, కాలుష్య నివారణ చిత్రలేఖన పోటీలకు రాష్ట్రం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జాతీయ భూగర్భ జలశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సంచాలకులు డి.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 812 పాఠశాలల నుంచి 6,7,8 తరగతులకు చెందిన 1,22,000 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజయవాడ ఎన్ఎస్టీ మ్యాథ్యూస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన లాస్యశ్రీ ప్రథమ స్థానంలో, విశాఖపట్నం చైతన్య పబ్లిక్ స్కూల్‌కు చెందిన పైలా మోహిత్ ద్వితీయ స్థానంలో, తూర్పుగోదావరి జిల్లా ఎర్రపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పాలుమాటి సోహంత్ తృతీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రంప్ సహాయకురాలి రాజీనామా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ. శ్వేతసౌధంలో శక్తిమంతమయిన కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు హోప్ హిక్స్ గురువారం ప్రకటించారు. ట్రంప్ విశ్వసనీయ సహాయకుల్లో ఆమె ఒకరిగా ఉండేవారు. అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలపై విచారణ ముమ్మరం అయిన నేపథ్యంలో ఆమె రాజీనామా చేశారు.

పిటిషనర్లను పరీక్షలకు అనుమతించండి

- **రాష్ట్ర విద్యుత్తు సంస్థలకు హైకోర్టు ఆదేశం**

ఈనాడు, హైదరాబాద్: సహాయ ఇంజినీర్ (ఏఈ), జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల నియామక ప్రక్రియలో పిటిషనర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరీక్షలకు అనుమతించాలంటూ ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏఈ, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ ట్రాన్స్‌కోలు తెలంగాణ స్థానికతను అర్హతగా పేర్కొంటూ ప్రకటన జారీ చేయడాన్ని సవాలు చేస్తూ జి.పావని, సి.హెచ్.నిఖిల్‌కుమార్‌లు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ టి.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అర్హతల్లో స్థానికతను చేర్చే అధికారం టీఎస్‌ఎస్‌పీడీసీఎల్, ట్రాన్స్‌కో సంస్థలకు లేదని పేర్కొన్నారు. దీనికి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా అర్హతగా పేర్కొనాలంటే పార్లమెంట్ చట్టం చేయాలన్నారు. ప్రస్తుతం ఈ విద్యుత్తు సంస్థలు సంబంధించి ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదన్నారు. విద్యుత్తు సంస్థల నిర్ణయం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. వాదనలను విన్న ధర్మాసనం ఏఈ, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో పిటిషనర్ల దరఖాస్తులను స్వీకరించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

తెదేపా మాటమార్చడం ఆశ్చర్యకరం: గోకరాజు

ఈనాడు, తిరుపతి: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలా సాయం చేస్తోందని మొన్నటి వరకూ చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు సహా తెదేపా నేతలు ఇప్పుడు ఉన్నట్టుండి మాటమార్చడం ఆశ్చర్యకరంగా ఉందని భాజపా సీనియర్ నేత, నర్సాపురం ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. విభజన హామీల్లోని అంశాలను పరిశీలించి కేంద్రం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. గురువారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

బిస్కెట్లు పంచారు.. సొమ్ములు దోచారు

- **యశ్వంత్‌పూర్ రైలులో చోరీ**
- **మత్తు బిస్కెట్లు తినిపించి నగదు, నగలుతో పరారైన మోసగాళ్లు**

నెల్లూరు (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: బీదర్ ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరు దొంగలు ప్రయాణికులను దోచిన 48 గంటలు గడవకముందే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో మరో దోపిడీ జరిగింది. కర్ణాటకలోని యశ్వంత్‌పూర్ నుంచి లక్నో వెళ్లే యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12539) బుధవారం ఉదయం 11 గంటలకు బయలుదేరింది. రైలు కొంత దూరం ప్రయాణించాక రైలు ఇంజిన్ వెనుక ఉన్న జనరల్ బోగీలో ఇద్దరు వ్యక్తులు ఉల్లాసంగా పాటలు పాడుకుంటూ కనిపించారు. దాంతో ఇతర ప్రయాణికులు ఎందుకు ఇంత సంతోషంగా ఉన్నారంటూ వారిని అడిగారు. దానికి వారు "ఈరోజు మా పుట్టిన రోజు. ఈ సమయాన ఎలాగూ ఇంట్లో లేం. తోటి ప్రయాణికులతో ఆనందంగా గడుపుతాం" అంటూ చేతిలో అప్పటికే మత్తు మందు పూసిన గుడ్‌డే బిస్కెట్లను దాదాపు 11 మంది ప్రయాణికులకు ఇచ్చారు. వాటిని తిన్న వారు కొద్దిసేపటికే స్పృహ కోల్పోయారు. దాంతో ఆ ఇద్దరు మోసగాళ్లు స్పృహ కోల్పోయిన వారి నగలు, నగదును తీసుకుని ఉడాయించారు. ఉదయం రైలెక్కిన ప్రయాణికులు సాయంత్రం అయ్యే వరకు నిద్రలోనే ఉండడాన్ని గమనించిన తోటి ప్రయాణికుడొకరు అనుమానంతో 1082 నంబరు ద్వారా రైల్వే అధికారులకు సమాచారం అందించాడు. దీంతో నెల్లూరు రైల్వే సీఐ దశరథరామయ్య గూడూరు గ్రామీణ సీఐ, రైల్వే ఎస్సైలకు విషయం చెప్పి రైలు గూడూరులో నిలిచేలా చర్యలు తీసుకున్నారు. అక్కడ మత్తులోనే ఉన్న ప్రయాణికులను గుర్తించి వెంటనే గూడూరు ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్సలందించడంతో వారు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

బాధితులు లఖ్‌నవూ చెందినవారు

బిస్కెట్లు తిని మోసపోయిన 11 మంది ప్రయాణికులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లఖ్‌నవూకు చెందిన వారు. వీరందరూ 20 నుంచి 35 ఏళ్లలోపువారు. యశ్వంతపూర్‌లో కూలి పనులు చేసుకుంటూ లఖ్‌నవూకు వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. స్పృహ కోల్పోయిన ప్రయాణికులకు నెల్లూరు జిల్లా ఎస్పీ రామకృష్ణ ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున ఛార్జీల కోసం అందజేశారు. రైల్వే ఎస్పీ బాలకృష్ణ సైతం ఒక్కో ప్రయాణికునికి రూ.500 చొప్పున పోలీసు అధికారుల ద్వారా అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రైల్వే సీఐ దశరథరామయ్య మోసగాళ్లను గుర్తించేందుకు గురువారం మధ్యాహ్నం గూడూరు నుంచి యశ్వంతపూర్‌కు బయలుదేరారు.



బెలూన్లు ఎగురవేసి గుడారాల పండగను ప్రారంభిస్తున్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాస్టర్ అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, లాజరెస్ తదితరులు

గుడారాల పండగ ప్రారంభం

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన దైవ సేవకులు

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరులో గురువారం గోరంట్ల హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 41వ గుడారాల పండగ కూటాలు ప్రారంభమయ్యాయి. ఇవి నాలుగు రోజుల పాటు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రం నుంచి విచ్చేసిన పాస్టర్ మోహన్‌సీ లాజరెస్ క్రీస్తు స్తుతి గీతాలతో, శాంతి చిహ్నాలైన పావురాలు, బెలూన్లను ఎగురవేసి పండగను ప్రారంభించారు. క్రీస్తు లోక రక్షకుడని మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య అన్నారు. కూటాల్లో పాల్గొన్న పెద్ద ఎత్తున పాల్గొన్న విశ్వాసులు, దైవ సేవకుల కోసం మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాస్టర్ అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వేస్లీ, పాస్టర్ రమేష్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేసి సందేశాన్నిచ్చారు. చిత్తూరు జిల్లా మదనపల్లె నుంచి విచ్చేసిన పాస్టర్ రాజశేఖర్ 'వాత్సల్యపూర్ణుడా' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

శ్రీశ్రీ రవిశంకర్ సమక్షంలో రైల్లో వివాహం!

- **అయోధ్యపై 28న చర్చలు**

దిల్లీ/ లఖ్‌నవూ: ఆడంబరాలకు దూరంగా వివాహం చేసుకోవాలనే సత్సంకల్పంతో యూపీకి చెందిన ఫార్మసిస్ట్ సచిన్‌కుమార్, పన్నుల శాఖ ఉద్యోగిని జోత్స్నసింగ్ పటేల్ రైల్లోనే పెళ్లాడారు. గోరఖ్‌పూర్-లఖ్‌నవూ మధ్య బుధవారం వీరి వివాహాన్ని 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ జరిపించారు. యూపీలో ఆయన బృందం ప్రయాణిస్తున్న ప్రత్యేక రైలే పెళ్లి మంటపంగా మారింది. పెళ్లిళ్ల పేరిట రూ.లక్షలు ఖర్చు చేసి, రుణాలు తీసుకోవాల్సిన అవసరం లేదనే సందేశాన్ని చాటడానికి ఈ విధంగా చేసినట్లు ఆయన వీడియో సందేశం ద్వారా తెలిపారు. నూతన దంపతులు ఆయన బృందంలో ఉన్న అనుచరులా, రైలు ఆగినప్పుడు అభివాదం చేయడానికి వచ్చినవారా అనేది స్పష్టంకాలేదు.

చర్చలతోనే రామజన్మభూమికి పరిష్కారం: ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అయోధ్య వంటి అంశాలను న్యాయస్థానాల్లో కంటే పరస్పర అంగీకారంతోనే పరిష్కరించుకోవాలని శ్రీశ్రీ రవిశంకర్ చెప్పారు. ఈ నెల 28న అయోధ్యలో మరో విడత చర్చలు చేపడతామని ప్రకటించారు. 'ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన విషయాన్ని కోర్టులు పరిష్కరించజాలవు. ఉభయ పక్షాలను అవి తృప్తిపరచలేవు. కేసును ఓడిపోయిన వర్గం సమాజంలో సమస్యల్ని సృష్టించేలా ఏదో ఒకటి చేస్తుంద'ని స్పష్టంచేశారు. చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న ప్రతిపాదనకు హిందూ, ముస్లిం సంస్థలు రెండూ విముఖత వ్యక్తం చేశాయి.

యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ సీఎండీపై సీబీఐ కేసు

దిల్లీ: ఆదాయానికి మించిన ఆస్తులతో యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అర్చనా భార్గవ సీబీఐకి చిక్కారు. ఆమె వద్ద రూ.3.6 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. 2004-14 మధ్య అర్చన వివిధ బ్యాంకుల్లో ఉన్నత హోదాల్లో పని చేశారు. తాను పనిచేసిన బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన సంస్థల నుంచి... అర్చన, ఆమె భర్త, కుమారుడికి చెందిన సంస్థలకు అక్రమంగా డబ్బులు మళ్లినట్లు సీబీఐ 2016లో కేసు నమోదు చేసింది. తాజాగా సోదాలు చేపట్టింది. "అర్చనకు చెందిన ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించి, రూ.2.85 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.10.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నాం. అర్చన, కుటుంబ సభ్యుల పేరున రూ.5.42 కోట్ల విలువైన డిపాజిట్లు, రూ.2.26 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్, నొయిడాలో భవంతితో పాటు దిల్లీ, ముంబయిల్లోనూ మరిన్ని ఆస్తులున్నట్లు గుర్తించాం" అని పేర్కొంది.

ఏసుక్రీస్తుపై గాంధీ లేఖ విక్రయానికి..

వాషింగ్టన్: ఏసుక్రీస్తు గురించి ప్రస్తావిస్తూ.. మహాత్మ గాంధీ రాసిన ఓ లేఖ అమెరికాలో అమ్మకానికి వచ్చింది. దీని ధరను విక్రయ సంస్థ రాబ్ కలెక్షన్ రూ.32.6 లక్షలుగా నిర్ణయించింది. 1926, ఏప్రిల్ 6వ తేదీన.. అమెరికాలోని ఓ క్రైస్తవ మతపెద్దకు గాంధీ ఈ లేఖను రాశారు. "మీరు పేర్కొన్న మతానికి నేను బద్ధుడిని కాలేను. మానవాళికి లభించిన గొప్ప బోధకుల్లో ఏసుక్రీస్తు కూడా ఒకరని నమ్ముతున్నాను. అంతకుమించి మీరు పేర్కొంటున్న విశ్వాసాల్లో.. సత్యాన్ని నేను గుర్తించలేకపోతున్నాను. యాంత్రికంగా ఒక ఉమ్మడి మతానికి బద్ధులవ్వడం కన్నా.. అన్ని మతాలనూ పరస్పరం గౌరవించుకోవడం వల్ల ఐకమత్యం సాధ్యమవుతుందని నేను భావిస్తున్నా'' అని లేఖలో గాంధీ పేర్కొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

సెన్సెక్స్ ▼137 **34047**

నిఫ్టీ ▼35 **10458**

రూపాయి 65.17 (ఒక అమెరికా డాలరుకు)

బంగారం 30380 ▼ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 155

వెండి 38085 ▼ (ముంబయిలో కిలో) రూ.లలో 125

ముడి చమురు 64.11 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)




ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	24,885	−144
నాస్‌డాక్	7,236	−37
నిక్కీ 225 (జపాన్)	21,724	−344
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	31,044	+200
షాంఘై(చైనా)	3,274	+14
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,176	−56
డాక్స్ (జర్మనీ)	12,191	−245

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.32	68.78
పౌండ్ స్టెర్లింగ్	81.60	94.63
యూరో	72.34	83.90
జపనీస్ యెన్/100	55.56	64.43
ఆస్ట్రేలియా డాలరు	45.87	53.08
సింగపూర్ డాలరు	44.76	53.03
థాయ్ బాత్/100	188.14	225.01
బహ్రెయిన్ దీనార్	160.64	184.09
కువైట్ దీనార్	179.91	223.97
ఒమన్ రియాల్	157.31	179.97
సౌదీ రియాల్	15.77	18.70
యూఏఈ దిర్హమ్	16.15	18.88
మలేషియా రింగిట్	14.78	18.17

గురువారం నిఫ్టీ కదలికలు



సెయిల్ భావి ఛైర్మన్‌గా అనిల్ కుమార్ చౌదరి!

దిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల అధిపతుల్ని వెతికి పట్టుకొనే పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఛైర్మన్‌గా అనిల్ కుమార్ చౌదరి పేరును సిఫారసు చేసింది. ప్రస్తుతం ఈయన సెయిల్‌లోనే డైరెక్టర్ (ఆర్థిక)గా కొనసాగుతున్నారు. ఈయనతోపాటు మొయిల్ (ఎంఓఐఎల్) డైరెక్టర్ తన్మయ కుమార్ పట్నాయక్, సెయిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలోక్ సహాయ్, సెయిల్ డైరెక్టర్ (వాణిజ్య) సోమ మోండల్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ సీఎండీ నళిన్ సింఘాల్ కూడా ఇంటర్వ్యూలకు హాజరైన వారిలో ఉన్నారు. అనిల్ కుమార్ చౌదరి 2011 సెప్టెంబరు నుంచి సెయిల్‌లో డైరెక్టర్ (ఆర్థిక)గా పని చేస్తున్నారు. అంతకు ముందు సెయిల్ బొకరో స్టీల్ ప్లాంట్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్)గా చేశారు. 1984లో జూనియర్ మేనేజర్‌గా సెయిల్‌లో చేరారు. ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్న పీకే సింగ్ ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేయబోతున్నారు. డిసెంబరు 2015 నుంచి ఆయన సెయిల్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతకు ముందు సెయిల్‌లోనే దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్‌లో ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (ముఖ్య కార్యనిర్వహణ అధికారి) పని చేశారు.

జీడీపీ ఆదుకోలేదు

- కొనసాగిన అమ్మకాల వెల్లువ
- అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం
- తోడైన వరుస సెలవులు

సమీక్ష



వరుసగా మూడో రోజూ సూచీలను నష్టాలు వీడలేదు. డిసెంబరు త్రైమాసికానికి జీడీపీ గణాంకాలు మెరుగైనప్పటికీ.. మార్కెట్లను ముందుకు తీసుకెళ్లలేకపోయింది. అమెరికా ఫెడ్ అధిపతి జెరోమ్ పావెల్ వడ్డీ రేట్ల పెంపునకు సంకేతాలివ్వడంతో అంతర్జాతీయ మార్కెట్లు డీలాపడ్డాయి. ఈ సెగ మన మార్కెట్లనూ తాకింది. ద్రవ్యలోటు రూ.6.77 లక్షల కోట్లకు పెరగడం సైతం ఇందుకు తోడైంది. నేటి నుంచి వరుసగా మూడు రోజుల పాటు మార్కెట్లకు సెలవు కావడంతో మదుపర్లు అమ్మకాలకే మొగ్గుచూపారు. అయితే మెరుగైన ఫిబ్రవరి విక్రయ గణాంకాలతో కొన్ని వాహన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా.. ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 34,141.22 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. మెరుగైన జీడీపీ గణాంకాలతో సూచీ ఇంట్రాడేలో 34,278.63 పాయింట్ల దగ్గర గరిష్ఠాన్ని తాకింది. అనంతరం అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో నష్టాల్లోకి జారిపోయింది. ఒకానొక దశలో 34,015.79 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. చివరకు 137.10 పాయింట్ల నష్టంతో 34,046.94 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 34.50 పాయింట్లు కోల్పోయి 10,458.35 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,447.16- 10,525.50 పాయింట్ల మధ్య కదలాడింది.

- గీతాంజలి జెమ్స్ షేరు పతనం కొనసాగుతోంది. తాజాగా పీఎన్‌బీ కుంభకోణం కేసులో మెహుల్ ఛోక్సీకి చెందిన దాదాపు రూ.1,200 కోట్ల విలువైన 41 ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేయడంతో షేరు 5 శాతం నష్టపోయి 52 వారాల కనిష్ఠమైన రూ.20.30 వద్ద ముగిసింది. ఫిబ్రవరి 14న ఈ కుంభకోణం వెలుగు చూసిన తర్వాత.. గత 12 సెషన్లలో షేరు 65.35 శాతం పతనమైంది.

సెన్సెక్స్ 30 షేర్లలో 19 నష్టాలు చవిచూశాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 2.63%, ఎస్‌బీఐ 2.31%, ఇన్ఫోసిస్ 1.19%, అదానీ పోర్ట్స్ 0.67%, యాక్సిస్ బ్యాంక్ 0.66%, హీరో మోటోకార్ప్ 0.59%, ఐటీసీ 0.57%, పవర్‌గ్రిడ్ 0.53% చొప్పున డీలాపడ్డాయి. కోల్ ఇండియా 1.05%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.04%, హిందుస్థాన్‌యునిలీవర్ 0.71%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.68%, ఎం అండ్ ఎం 0.58%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో లోహ 0.95% నీరసపడింది. బ్యాంకింగ్ 0.85%, స్థిరాస్తి 0.77%, మన్నికైన వినిమయ వస్తువులు 0.71%, టెక్ 0.65%, ఆరోగ్య సంరక్షణ 0.58%, ఐటీ 0.53% మేర నష్టాలు నమోదు చేశాయి.

నేడు మార్కెట్లకు సెలవు

హోలీ సందర్భంగా నేడు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్‌ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ)లకు సెలవు ప్రకటించారు. బులియన్ సహా ఫారెక్స్, కమొడిటీ మార్కెట్లు కూడా పని చేయవు.

సూక్ష్మ రుణ సంస్థల చేతిలో రూ.1.9 లక్షల కోట్లు

- ఏప్రిల్- డిసెంబరు రుణాల్లో 15% వృద్ధి

ముంబయి: ఏప్రిల్- డిసెంబరులో సూక్ష్మ రుణ సంస్థల (మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీస్) మెరుగైన పనితీరును కనబర్చింది. వార్షికంగా 15% వృద్ధి రేటును నమోదు చేసింది. ప్రధానంగా వసూళ్ల సామర్థ్యం పెరగడం ఇందుకు తోడ్పడింది. మరోవైపు సూక్ష్మ రుణ పరిశ్రమ నిర్వహణలోని రుణాల విలువ రూ.1.9 లక్షల కోట్లకు చేరింది. 'ఈ రంగ వసూళ్ల సామర్థ్యం స్థిరంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది డిసెంబరు వరకు 97 శాతం వరకు వసూలయ్యాయి. కిందటేడాది మార్చిలో వసూళ్లు 90 శాతం లోపే ఉన్నాయ'ని ఇక్రా తన నివేదికలో తెలిపింది. 2017లో ఇచ్చిన రుణాలకు సంబంధించి చాలా సంస్థలు 98 శాతానికి పైగా వసూలు సామర్థ్యాన్ని కనబర్చాయని పేర్కొంది. 'పరిశ్రమ రుణాల పోర్ట్‌ఫోలియో ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా రూ.2- 2.1 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామ'ని ఇక్రా ఎంఎఫ్ఐ అధిపతి సుప్రీతా నిజ్జర్ తెలిపారు. పెద్దగా లాభదాయకంగా లేని ఉత్తరప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లకు కంపెనీలు ప్రాధాన్యం తగ్గిస్తున్నాయని పేర్కొన్నారు. నోట్ల రద్దు ప్రభావం స్వల్పంగా ఉన్న తమిళనాడు, పశ్చిమ బంగా, ఒడిశా లాంటి రాష్ట్రాల్లో 2016 సెప్టెంబరు- 2017 సెప్టెంబరు మధ్య రుణాల్లో వృద్ధి పెరిగిందని వివరించారు.

ఎఫ్‌ట్యాప్సీ సెక్రటరీ జనరల్‌గా సంజయ్ కపూర్



ఈనాడు, హైదరాబాద్: ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ (ఎఫ్‌ట్యాప్సీ) సెక్రటరీ జనరల్‌గా సంజయ్ కపూర్ ఎంపికయ్యారు. ఈ నియామకం మార్చి 1 నుంచి అమల్లోకి వస్తుందని ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ ఇంజినీరైన సంజయ్‌కు వివిధ కంపెనీల్లో 30 ఏళ్లపాటు పని చేసిన అనుభవం ఉంది. చివరగా ఎల్‌అండ్‌టీ మెట్రోలో జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

ఫోర్టిస్ నష్టం రూ.19 కోట్లు

దిల్లీ: ఫోర్టిస్ హెల్త్‌కేర్ 2017-18 మూడో త్రైమాసికానికి రూ.19.10 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఏడాది క్రితం ఇదే కాలానికి సంస్థ రూ.453.29 కోట్ల నికర లాభం ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండో త్రైమాసికానికి కూడా రూ.23.61 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బోర్డు సమావేశానికి ముందు ఆడిటింగ్ పూర్తి కాకపోవడంతో ఫలితాలు ప్రకటించడానికి 15 రోజుల అదనపు సమయం ఇచ్చారు. అందుకే రెండు త్రైమాసికాల ఫలితాలు ఒకేసారి ప్రకటించారు. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో సంస్థకు రూ.1,163.27 కోట్ల ఆదాయం వచ్చింది. ఏడాది క్రితం ఇదే కాలానికి వచ్చిన ఆదాయం రూ.1,192.31 కోట్లు. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1234.25 కోట్ల ఆదాయం వచ్చినట్లు సంస్థ తెలిపింది. సంస్థ ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, శివిందర్ సింగ్ బోర్డు అనుమతి లేకుండా ఏడాది క్రితం ఫోర్టిస్ హాస్పిటల్స్ నుంచి రూ.500 కోట్లు తీసుకోవడంతో సంస్థకు కష్టాలు మొదలైనట్లు తెలుస్తోంది.

కేశ సంరక్షణకు గ్లెన్‌మార్క్ ఔషధం

- మహిళలకు ప్రత్యేకం
- విపణిలోకి నౌర్‌క్రిన్



నౌర్‌క్రిన్‌ను ప్రదర్శిస్తున్న రాజీవ్ కపూర్

ఈనాడు, హైదరాబాద్: మహిళల్లో జుట్టు రాలే సమస్యను పరిష్కరించడంతోపాటు, కేశాల పెరుగుదలను సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు ఉపయోగపడేలా గ్లెన్‌మార్క్ ఫార్మాస్యుటికల్స్ కొత్త ఔషధాన్ని విపణిలోకి విడుదల చేసింది. ఇప్పటికే దాదాపు 40 దేశాల్లో విక్రయిస్తోన్న 'నౌర్‌క్రిన్ ఉమెన్'ను భారత్‌లో విక్రయించేందుకు దీన్ని ఉత్పత్తి చేస్తోన్న డెన్మార్క్ కంపెనీ ఫార్మా మెడికో నుంచి ప్రత్యేక లైసెన్సును పొందింది. జుట్టు కుదుళ్లను బలోపేతం చేసి, కేశాల పెరుగుదలకు దోహదం చేసే ప్రోటియోగ్లికాన్‌తో కూడిన ఈ ఔషధాన్ని వాడినప్పుడు.. కేశాలు రాలడం ఆగిపోయేలా చేయడంతో పాటు, సాధారణ పెరుగుదల కనిపిస్తుందని గ్లెన్‌మార్క్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ కపూర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహిళల్లో ఒత్తిడి, వైద్యపరమైన ఇబ్బందులు, ప్రసవం, కాలుష్యం తదితర కారణాల వల్ల జుట్టు రాలే సమస్య పెరుగుతోందన్నారు. దేశంలో దాదాపు 9 కోట్ల మందికి పైగా మహిళలు జుట్టు రాలే సమస్యతో బాధ పడుతున్నారన్నారని తెలిపారు. 'నౌర్‌క్రిన్ ఉమెన్' వాడినప్పుడు ఈ సమస్యల వల్ల ఏర్పడిన దుష్పరిణామాలను నియంత్రణలోకి వచ్చి, కేశాల సహజ పెరుగుదలకు వీలు కల్పిస్తుందని చెప్పారు. నోటి మాత్రల రూపంలో ఈ ఔషధం 60 మాత్రల ఖరీదు రూ.3వేలని తెలిపారు. కనీసం 6 నెలల పాటు దీన్ని వాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నియంత్రణ సంస్థల అనుమతి లభిస్తే.. పురుషుల కోసం కూడా ఈ ఔషధాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందును విక్రయిస్తారని తెలిపారు. గ్లెన్‌మార్క్ కార్పొరేట్ స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాసన్ డిసౌజా, ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ రజిత దామిశెట్టి పాల్గొన్నారు.

మార్కెట్ కబుర్లు

- ఫిబ్రవరి నెలలో **ఎన్‌సీసీ** మొత్తం 7 కొత్త ప్రాజెక్టులను చేజిక్కించుకుంది. ఈ పనుల మొత్తం విలువ రూ.2,980 కోట్లని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో 3 పనులు జల, పర్యావరణ విభాగాలకు చెందినవి. వీటి విలువ రూ.1,967 కోట్లు.
- హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్)లో 51.11 శాతం ప్రభుత్వ వాటాను రూ.36,915 కోట్లతో కొనుగోలు చేయాలన్న నిర్ణయానికి వాటాదార్ల అనుమతిని కోరినట్లు **ఓఎన్‌జీసీ** తెలిపింది.
- **నాట్కో ఫార్మా** తన సోఫోస్‌బువిర్ మాత్రలకు అబ్రీవియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్ (ఏఎన్‌డీఏ)ను యూఎస్ ఎఫ్‌డీఏ వద్ద దరఖాస్తు చేసింది. అంతర్జాతీయంగా గిలీడ్ సైన్సెస్ ద్వారా సోవాల్డి బ్రాండ్ కింద విక్రయిస్తామని కంపెనీ తెలిపింది.
- ముంబయిలో ఉన్న విద్యుత్ వ్యాపారాన్ని అదానీ ట్రాన్స్‌మిషన్‌కు రూ.18,800 కోట్లకు విక్రయించడానికి వాటాదార్ల అనుమతులు లభించాయని **రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్** వెల్లడించింది.
- తమిళనాడులోని తిరుచ్చి నుంచి కల్లాగామ్ మధ్య నాలుగు లేన్ల రహదారిని నిర్మించే నిమిత్తం నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) నుంచి రూ.1021 కోట్ల ఆర్డరు **కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్**కు దక్కింది.
- అమెరికాకు చెందిన సైబర్ భద్రత సంస్థ డెనిమ్ గ్రూప్‌లో మైనారిటీ వాటాను 8.83 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.59 కోట్లు)తో కొనుగోలు చేయడం కోసం ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు **విప్రో** తెలిపింది.
- ఎన్‌హెచ్‌ఏఐ నుంచి రూ.4473 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులను **దిలీప్ బిల్డ్‌కాన్** పొందింది. దీని కింద కర్ణాటకలోని బెంగళూరు-నిడగట్ట మధ్య ఉన్న 56 కి.మీ. ఆరు లేన్ల రోడ్డును నిర్మించాల్సి ఉంటుంది.
- జెట్ ఎయిర్‌వేస్‌లో వాటాను విక్రయించే ఆలోచనేదీ లేదని **ఎతిహాద్ ఎయిర్‌వేస్** స్పష్టం చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం కల్లా జెట్‌ఎయిర్‌వేస్‌లో మొత్తం వాటాను విక్రయిస్తుందన్న సెంటర్ ఫర్ ఏవియేషన్(సీపీఏ) పేర్కొన్న వార్తలను ఈ సందర్భంగా కొట్టిపారేసింది.

ఓఎన్‌జీసీ మధ్యంతర డివిడెండు 45%


దిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించింది. రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.2.25 (45 శాతం) డివిడెండుగా చెల్లించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకోసం కంపెనీ రూ.2,887 కోట్లు ఖర్చుచేయనుంది. డివిడెండు చెల్లించేందుకు రికార్డు తేదీ మార్చి 14గా నిర్ణయించారు. గత ఏడాది నవంబరులో మొదటి మధ్యంతర డివిడెండు రూ.3 (60 శాతం)ను కంపెనీ చెల్లించింది.

బీపీసీఎల్



రూ.432.00 వద్ద ప్రారంభమై రూ.430.20 – 443.90 మధ్య కదలాడి క్రితం ముగింపు 429.55తో పోలిస్తే రూ.12.35 (2.88%) లాభంతో రూ.441.90 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో చేతులు మారిన షేర్లు 62,22,197

ఐసీఐసీఐ బ్యాంక్



రూ.312.65 వద్ద మొదలై రూ.304.25 – 314.00 మధ్య చలించి క్రితం ముగింపు 313.25తో పోలిస్తే రూ.8.30 (2.65%) నష్టంతో రూ.304.95 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో 1,89,86,889 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

సనోఫి ఇండియా	5135.00
వెంకీస్	4530.00
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్	1484.00
జైడస్ వెల్‌నెస్	1320.00
భారత్ ఫోర్జ్	799.65
అశోక్ లేలాండ్	143.80


52 వారాల కనిష్ఠం (రూ.లలో)

కొఠారి ప్రొడక్ట్స్	159.25
ద్వితీయ ట్రేడింగ్	148.70
దివినస్ ఫ్యాబ్రిక్స్	120.00
కపిల్ కోటెక్స్	114.00
లక్ష్మీ విలాస్ బ్యాంక్	103.10
ద్వారికేశ్ షుగర్ ఇండస్ట్రీస్	36.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
01/03	5,514	5,272	242	3,323	3,326	−03
28/02	8,739	10,490	−1751	4791	3194	1597
26/02	4,274	5,394	−1,120	3,899	2,490	1,409
23/02	5,344	5,831	−487	4,241	2,727	1514
22/02	7,595	9,931	−2,335	6,510	5,451	1,059

1న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా (ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	350
బెంగళూరు	385	చెన్నై	385
2వ తేదీకి...		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	340	నమక్కల్	370

ఎన్‌ఎస్‌ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 406.10 (408.35) 1216685
AMBUJA CEMEN 253.15 (252.35) 3184053
ASIAN PAINTS 1118.90 (1117.75) 736217
AUROBIND PHA 624.10 (613.90) 3649095
AXIS BANK LT 525.75 (528.75) 9827510
BAJAJ AUTO L 3020.90 (3020.60) 503301
BAJAJ FINANC 1659.35 (1640.25) 1238390
BHARTI AIRTE 427.75 (428.55) 5260644
BHARTI INFRA 345.20 (346.70) 3367869
BOSCH LTD 18707.50 (18687.30) 13447
BPCL 441.90 (429.55) 6222197
CIPLA 581.70 (589.65) 1343806
COAL INDIA L 312.90 (309.15) 2535090
DR. REDDYS 2231.50 (2237.25) 430777
EICHER MOTOR 27742.35 (27437.75) 91423
GAIL 454.25 (457.50) 2148217
HCL TECH 942.80 (940.30) 1386115
HDFC 1814.15 (1808.70) 3272003
HDFC BANK 1874.35 (1884.20) 977460
HERO MOTOCOR 3576.90 (3596.70) 200696
HINDALCO IND 240.80 (245.40) 5767109
HINDUSTAN UN 1324.25 (1317.75) 961945
HPCL 376.75 (380.15) 2354494
ICICI BANK 304.95 (313.25) 18986889
INDIABULLS H 1256.30 (1254.10) 1170536
INDIAN OIL 381.50 (379.30) 3630009
INDUSINDBANK 1700.35 (1680.75) 760617
INFOSYS LTD 1160.75 (1172.60) 3289926
ITC 264.00 (265.05) 7781553
KOTAK MAHIND 1095.70 (1090.55) 1480594
LARSEN & TOU 1315.20 (1318.15) 1927606
LUPIN 803.90 (819.95) 1311644
M&M 732.55 (728.35) 1831321
MARUTI SUZIK 8873.45 (8850.95) 609369
NTPC LTD 163.00 (163.25) 2146760
ONGC 189.70 (188.30) 3450224
POWER GRID C 197.40 (197.70) 4560010
RELIANCE IND 948.40 (954.55) 4094652
SBI 262.15 (268.00) 22859175
SUN PHARMA 535.40 (535.35) 4264631
TATA CONSULT 3037.70 (3035.05) 859062
TATA MOTORS 370.75 (369.90) 6991806
TATA STEEL L 675.05 (671.60) 7128399
TECH MAHINDR 611.90 (612.65) 2226114
ULTRATECH 4153.30 (4155.60) 198915
UPL LIMITED 714.25 (728.75) 1877954
VEDANTA LIMI 323.25 (329.75) 8160931
WIPRO 292.50 (292.80) 4085785
YES BANK LTD 321.05 (322.30) 7333939
ZEE ENTERTAI 555.40 (565.35) 1671540

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1525.15 (1531.75) 74109
ACC 1633.80 (1623.05) 128434
ASHOK LEYLAN 140.95 (141.50) 19650623
AVENUE SUPER 1314.25 (1348.15) 801383
BAJAJ FINSER 4999.40 (5051.70) 84916
BANK OFBAROD 138.30 (141.95) 13912882
BEL 153.30 (154.35) 1531733
BHEL 90.70 (89.90) 6768063
BRITANNIA 4943.85 (4994.25) 52535
CADILA HEALT 404.05 (405.10) 577581
COLGATE PALM 1056.90 (1041.10) 1128302
CONTAINER 1312.35 (1304.15) 126000
CUMMINS INDI 804.10 (795.95) 444246
DABUR INDIA 325.20 (325.05) 818541
DLF LIMITED 224.30 (226.25) 3581145
EMAMI LIMITE 1081.20 (1080.00) 65696
GLAXOSMI CON 6791.50 (6696.90) 17637
GLAXOSMI PHA 2378.90 (2384.15) 5259
GLENMARK PHA 544.50 (544.55) 973598
GODREJ CONSU 1080.20 (1070.45) 765999
HAVELLS INDI 511.25 (507.65) 1428365
HINDUSTAN ZI 315.60 (326.45) 2251422
ICICI PRU LI 408.10 (412.80) 707831
IDEA CELLULR 83.05 (83.90) 15125877
INTERGLOBE A 1332.15 (1335.70) 359106
JSW STEEL LT 305.50 (312.20) 6417443
LIC HOUS.FIN 507.05 (507.80) 1153910
MARICO LIMIT 312.15 (308.15) 824485
MCDOWELL 3244.85 (3291.95) 249927
MOTHERSON 319.90 (330.00) 3280816
MRF 72683.65 (73391.60) 5016
NHPC LTD 27.80 (27.30) 6651917
NMDC LTD 130.70 (129.35) 3679563
OIL INDIA 349.75 (349.85) 339238
ORACLE FIN S 3855.55 (3941.60) 35921
P&G HYG&HEAL 9413.85 (9392.75) 4290
PETRONET LNG 240.80 (247.30) 2138106
PIDILITE IND 894.40 (900.95) 122382
PIRAMAL ENTE 2547.05 (2582.55) 149181
PNB 101.05 (101.40) 122105493
POWER FIN CO 102.45 (105.10) 5933557
RURAL ELEC C 142.15 (144.30) 5610855
SAIL 80.90 (83.20) 12875529
SHREE CEMENT 16595.35 (16623.45) 8558
SHRIRAM TRAN 1338.55 (1333.85) 523804
SIEMENS 1153.15 (1167.90) 111727
SUN TV LTD 916.65 (927.80) 732700
TATA POWER 84.30 (84.50) 6936315
TITAN IND 810.20 (816.15) 975986
TORRENT PHAR 1338.10 (1368.65) 442347

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 169.60 (170.50) 540101
ADANI ENTERP 199.15 (203.55) 3600007
ADANI POWER 31.35 (31.65) 5109574
ALL BANK 51.50 (52.65) 3222285
AMARA RAJA 812.45 (822.25) 170234
ANANT RAJIND 55.05 (55.85) 962139
ANDHRA BANK 45.30 (46.05) 2245740
APOLLO HOSPI 1183.50 (1203.05) 166112
APOLLO TYRES 265.70 (274.55) 3851150
APTECH 314.75 (320.20) 338613
BAJAJ ELECT. 536.95 (527.55) 504682
BAJAJ HIND 12.55 (12.60) 1257374
BAJAJ HOLDIN 2720.65 (2723.55) 10466
BALAJI TELE 139.15 (138.05) 60067
BALLARPUR IN 13.50 (13.50) 364125
BALRAMPUR CH 117.45 (119.75) 3361043
BANK OF MAHA 16.65 (16.80) 742374
BANK OFINDIA 113.15 (116.20) 9463499
BATA INDIA 723.30 (729.95) 400430
BGR ENERGY S 117.10 (116.85) 69695
BHARAT FORGE 784.00 (789.85) 1447995
BHUSHAN STEE 46.45 (46.45) 1994318
BIOCON LTD 626.85 (630.05) 1682637
BOMBAY DYE 255.60 (258.65) 1946168
CANARA BANK 290.30 (299.25) 8339200
CEAT LIMITED 1578.05 (1602.45) 456653
CENTRAL BANK 64.80 (65.30) 233286
CHAMBAL FERT 163.70 (168.75) 955898
CHENNAI PETR 360.05 (364.70) 280517
CITY UNIBANK 180.70 (174.80) 1727585
CORPO BANK 32.70 (33.55) 233673
COX & KINGS 241.05 (238.75) 136485
D B REALTY L 56.75 (58.10) 216916
DELTA CORP L 351.15 (346.85) 1625212
DENA BANK 20.55 (20.60) 576484
DHANALAKBANK 22.85 (23.05) 249728
DIVIS LAB 1018.45 (1025.90) 272425
EDELWEISS CA 278.15 (268.75) 3138632
EID PARRY 318.80 (316.55) 68679
EIH 169.75 (173.80) 166222
ESSAR SHIPPI 25.30 (25.40) 11549
ESTER INDUST 67.95 (65.35) 165955
EXIDE INDUST 209.60 (207.40) 1115887
FEDERAL BANK 94.00 (94.25) 3975513
FINOLEX CABL 706.35 (716.95) 32050
G E SHIP LTD 365.15 (365.60) 254701
GAMMON INFRA 3.00 (3.00) 1688127
GATI LIMITED 111.60 (112.15) 235888
GAYATRI PROJ 211.55 (211.70) 910469
GITANJALIGEM 20.25 (21.30) 69570
GMR INFRASTR 18.60 (18.95) 22049883
GODREJ IND 545.85 (551.75) 694731
GRASIM IND 1166.60 (1152.70) 1136789
GUJ ALK&CHEM 724.80 (737.45) 92101
HCL INFOSYS 62.15 (63.90) 2581050
HEXA TECH 343.60 (346.10) 505044
HIMACHAL FUT 29.70 (29.95) 8420243
HOUSING DEV 48.05 (49.90) 14813193
IDBI 80.35 (74.55) 65150780
IDFC 52.60 (52.95) 2756352
IFCI 22.75 (22.65) 6027463
IL&FS TRANS 70.35 (70.65) 179474
IND SWIFTLAB 65.60 (67.45) 49565
INDBULLS REL 212.10 (215.35) 3281287
INDIA CEM 157.25 (159.25) 1890764
INDIAN BANK 317.25 (331.10) 2710444
INDO RAMA SY 33.35 (33.65) 101572
INDRAPRASTHA 306.15 (304.70) 3752845
IND-SWIFTLTD 8.55 (8.60) 5092
INGERSOLL-R 726.30 (723.30) 5853
IOB 19.65 (19.60) 874165
IPCA LAB 686.20 (672.85) 454538
IRB INFRA DE 224.10 (228.60) 778837
J&K BANK 66.95 (66.60) 210862
JAI CORP 155.60 (157.75) 1160537
JAIN IRRIGAT 115.05 (116.95) 4384555
JAYPEE INFRA 12.70 (12.75) 1507294
JAYSHREE TEA 101.15 (100.45) 16581
JET AIRWAYS 742.80 (746.10) 2250213
JINDAL SAW 134.95 (138.35) 765950
JINDAL STEEL 248.85 (254.40) 6401382
JK LAKSHMI C 431.60 (424.85) 96815
JK PAPER LIM 141.10 (139.95) 297529
JM FINANCIAL 144.65 (147.55) 1107533
JP ASSOCIATS 17.45 (17.70) 31165412
JSW ENERGY L 80.65 (80.70) 867926
JUBILANT FOO 2005.85 (2034.00) 423544
JUBILANT ORG 834.45 (877.50) 1236543
JYOTHY LABS 344.35 (343.20) 65892
JYOTI STRUC 10.25 (10.50) 80088
KARNATA BANK 132.70 (135.15) 1348076
KEC INTL LTD 410.35 (415.25) 409860
KOLTE PATIL 337.40 (349.00) 90824

ఘనం (+)

నిఫ్టీ	1న	మార్పు%
BPCL	441.90	2.88
AUROBINDO PHA	624.10	1.66
COAL INDIA	312.90	1.21
INDUSIND BANK	1700.35	1.17
BAJAJ FINA	1659.35	1.16
EICHER MOTO	27742.35	1.11
ONGC	189.70	0.74


గ్రహణం (-)

నిఫ్టీ	1న	మార్పు%
ICICI	304.95	-2.65
SBI	262.15	-2.18
UPL	714.25	-1.99
VEDANTA	323.25	-1.97
LUPIN	803.90	-1.96
HINDALCO INDU	240.80	-1.87
ZEE ENTER ENT	555.40	-1.76

KPIT CUMMINS 214.75 (216.10) 1979678
L&TFIN.HOLD 162.50 (162.30) 1753008
LAK VIL BANK 104.55 (104.40) 501351
M & M FINANC 427.25 (432.65) 1083094
M & M FINANC 427.25 (432.65) 1083094
MANAPPURAM G 107.80 (107.95) 1684383
MMTC LIMITED 51.50 (52.05) 485819
MPHASIS LTD 854.85 (859.70) 171263
MRPL 118.15 (119.25) 578643
MTNL 22.10 (22.50) 898151
NAGARJUNA OI 4.15 (4.15) 185283
NCC LIMITED 130.65 (131.70) 6066623
NETWORK18 FI 50.50 (50.65) 451739
NEULAND LAB 715.90 (719.90) 4713
NIIT LTD 91.80 (93.35) 468325
NIIT TECHNOL 871.40 (834.50) 2025848
OMAXE LTD 225.80 (226.40) 260037
ONMOBILE GLO 49.55 (50.10) 155584
ORIENT PAPER 40.90 (41.05) 143642
ORIENTALBANK 98.50 (100.25) 7970919
PARSVNATH DE 20.85 (20.75) 145752
PATEL ENGG 70.60 (71.10) 153963
PFIZER 2282.90 (2272.20) 18332
POLARIS SOFT 471.50 (471.00) 31320
POWERTRADING 100.50 (102.75) 1304179
PRAJ IND 90.80 (90.75) 447104
PRISM CEMENT 126.65 (126.35) 505911
PROVOGUE (IN 5.00 (5.25) 727668
PUNJ LLOYD 20.00 (19.80) 784559
PUNJAB & SIN 38.00 (38.95) 71851
PURAVANKARA 141.10 (145.05) 109947
PVP VENTURES 6.35 (6.40) 203992
PVR LIMITED 1305.35 (1320.45) 184880
RADICO KHAIT 350.45 (346.80) 1021433
RAJESH EXPOR 796.65 (837.55) 208048
RALLIS INDIA 231.35 (231.40) 159278
RAMCO IND 252.90 (256.20) 101847
RAMCO SYS 447.10 (460.20) 11183
RAMKY INFRA 212.80 (201.15) 706576
RAYMOND 936.90 (954.45) 523674
RELIANCE CAP 458.15 (472.25) 4931087
RELIANCE COM 27.90 (28.35) 81087484
RELIANCE INF 441.95 (455.60) 2242710
RELIANCE POW 43.45 (44.70) 8698793
ROLTA INDIA 68.65 (68.90) 855230
SAGAR CEMENT 963.65 (975.95) 3051
SAREGAMA 705.85 (704.70) 49749
SHANTHI GEAR 142.75 (143.40) 3836
SHIPPNG CORP 71.15 (71.65) 559776
SHREE RENUKA 15.85 (15.65) 3059282
SINTEX IND 20.45 (20.65) 2636269
SOBHA DEVELO 554.00 (554.75) 129167
SOUTHINDBANK 26.05 (26.60) 6318573
SRS LIMITED 1.20 (1.15) 1077462
STERLITE TEC 357.85 (359.35) 1116996
SUJANA METAL 1.35 (1.40) 55602
SUN PHARMA 419.20 (425.35) 199192
SUND FASTNER 554.65 (564.40) 125434
SUZLON ENERG 12.75 (12.80) 18430034
SYND. BANK 60.65 (61.10) 4762791
TATA CHEM 699.70 (704.65) 591242
TATA COFFEE 131.35 (131.90) 234829
TATA COMMUN 638.15 (642.35) 271665
TATA GLOBAL 274.85 (275.50) 2322191
TATA METALIK 816.15 (810.30) 95710
TATA MOT DVR 207.45 (206.90) 1066276
TATA TELESER 6.15 (6.20) 381447
THE INDIAN H 137.00 (137.15) 3115115
TORRENT POWE 266.15 (264.65) 950377
TRIVENI ENGG 62.55 (64.00) 294299
TTK PRESTIGE 6956.35 (6917.55) 1431
TV TODAY NET 458.55 (465.50) 58279
TV18 BROADCA 61.70 (62.65) 5939188
TVS MOTOR 677.40 (680.95) 790120
UCO BANK 25.65 (25.95) 461429
UNION BANK 103.60 (105.55) 5853028
UNITECH 7.05 (7.05) 6299842
UNITED BANK 13.90 (14.10) 1205003
UNITED BREWE 1054.20 (1059.40) 163160
USHA MARTIN 22.20 (22.45) 404120
VADILAL INDU 934.80 (932.90) 35277
VENKYS 4109.65 (3924.25) 2116459
V-GUARD IND 238.15 (242.30) 1819116
VIJAYA BANK 57.40 (59.90) 1120131
VIP 347.95 (338.45) 269300
VOLTAS 619.00 (609.40) 3773902
ZEE LEARN LI 40.70 (40.80) 188632
ZUARI GLOBAL 198.00 (201.80) 74151
ZYDUS WELLNE 1295.70 (1251.25) 55153

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AMAR RAJA BA 812.70 (822.50) 16842
ANDHRA BANK 45.20 (46.05) 175334
ANDHRA CEMEN 10.99 (10.91) 19237
ANDHRA PAPER 308.80 (308.50) 4412
ANDHRA PETRO 58.75 (58.90) 38895
ASTRA MICROW 89.65 (90.65) 42614
AUROBINDO PH 624.10 (613.45) 253077
AVANTEL SOFT 560.55 (533.90) 14214
AVANTI FEEDS 2431.55 (2401.95) 35923
BALAJI AMIN 633.25 (644.55) 7162
BARTRONICS 13.23 (12.88) 8226
BHAGYA NAG 48.05 (48.65) 24017
BN RATHI SEC 42.55 (41.40) 7335
BRILLIANT SE 11.21 (11.80) 89271
CONT COFFEE 299.45 (297.45) 5156
COROMAN FERT 549.80 (558.30) 5974
CYBERMATE 3.10 (3.26) 48556
CYIENT LIMIT 633.50 (636.50) 5838
DIVI'S LAB 1017.25 (1023.30) 90735
DR REDDY 2228.05 (2235.65) 23063
FOUR SOFT 87.30 (89.85) 9075
GATI CORPN 111.80 (111.75) 57148
GAYATRI PROJ 210.70 (211.55) 25855
GMR INFRASTR 18.60 (18.95) 1913750
GOLDST INFRA 216.85 (217.10) 25198
GRANULES (I) 116 (118.40) 79064
GSS AMERICA 45.70 (45.85) 91914
GVK POWER 16.50 (16.95) 503462
HBL NIFE POW 56.95 (55.55) 59943
IKF SOFT 0.66 (0.65) 58989
ILFS ENGINEE 42 (43.30) 35956
INNAREDY COM 3.11 (3.06) 11583
IVRCL INFRAS 4.44 (4.45) 81878
JEEVAN SCIEN 44.60 (43.95) 2237
KALLAM SPG 31.05 (31) 24085
KAVERI SEED 493.50 (499.55) 8638
KCP LTD 127.75 (127.40) 9792
KNR CONSTRUC 303.20 (308.90) 14019
KREBS BIO 175.30 (171.05) 9714
LANCO INDUS 347.35 (347.35) 5506
LANCO INFRAT 1.26 (1.27) 861283
MADHUCON PRO 27.30 (27.35) 7447
MIC ELECTRON 7.09 (7.01) 29684
MSR INDIA LT 50.80 (51.95) 5192
NATCO PHARMA 781.70 (799.20) 46700
NAVA BH VENT 152.40 (156.30) 7823
NCC 130.55 (131.35) 486410
NCL IND 233.25 (228.30) 21127
NEHA INTER 6.92 (7.18) 31269
NETTLINX 77.45 (76.60) 6515
NIHAR INFO 14.03 (14.75) 490
PANYAM CEMEN 47.65 (46.40) 8257
PENNER IND 58.25 (58.60) 43870
PHYTOCHEM I 63.25 (61.80) 6725
PITTI LAMIN 92.85 (93.95) 17283
PRAJAY ENGS 11.25 (11.75) 23148
PRISM CEMENT 126.50 (126.30) 72488
PRUDENTL PHA 4.36 (4.36) 132501
RAIN INDUSTR 362 (381) 753889
RAJ PACKAGIN 35.80 (37.05) 21059
RAM INFORMAT 42.95 (42.20) 7246
SAMKRG PIST 299.90 (298.80) 3886
SATVAH. ISPA 22.90 (22.55) 35180
SOUTH BIO TE 3.37 (3.38) 6338
SPHERE GLOBA 40.20 (38.15) 25993
SREE RAYAL A 56.35 (57.20) 153469
STEEL EXCHAN 29.55 (30.05) 67616
SUJANA METAL 1.39 (1.41) 15750
SUJANA TOWER 3.94 (4.14) 11158
SURANA STRIP 1.94 (2.03) 11000
SUVEN PHARMA 190.55 (188.35) 19916
TANLA 35.35 (34.70) 217444
TRANS BIOTEK 2.62 (2.50) 93211
TRENDY KNIT 0.26 (0.26) 1101
VAMSHI RUBB 52.25 (52.70) 100
VBC FERRO 40.65 (42.60) 752
VICEROY HOTE 15.65 (15.70) 51137
VIJAY TEXTIL 52.30 (52.30) 1137
VIMTA LABS 203.80 (208.75) 1875
VISAKA IND 686 (689.70) 3682
VISTA PHARMA 50.85 (53.50) 1300944
VIVIMED LABS 77.60 (77.35) 95416
VST INDUS 3172 (3172) 30
XL TELENE 2.75 (2.80) 4710
YBRANT DIGIT 5.30 (5.05) 436543
ZENOTECH LAB 42.50 (43.20) 13785
ZENTECH 138.50 (117.60) 356332



ఈనాడు బిజినెస్



విరుగుట పెరుగుట కొరకేన(నా)..!

రెండేళ్ల పాటు తగ్గుతూ వచ్చిన వడ్డీ రేట్లు.. ఇంకా తగ్గుతాయని సగటు మధ్యతరగతి జీవులు భావించారు. అయితే వారి ఆశలకు బ్యాంకులు గండి కొట్టాయి. పెరుగుతున్న నిరర్థక ఆస్తుల్లో.. లేక వెలుగులోకి వస్తున్న కుంభకోణాల్లో.. లేక బలహీన పడుతున్న బ్యాలెన్స్ షీట్లో.. కారణం ఏదైనా ఇపుడు వడ్డీ రేట్లు క్రమంగా పెరుగుతున్నాయి. గృహ, వ్యక్తిగత రుణాలపై భారం మోపనున్నాయి. పెరుగుట.. విరుగుట కొరకే అంటాం కానీ.. ఇక్కడ విరుగుట.. పెరుగుట కొరకే అనిపిస్తోంది. చూద్దాం.. ఈ పెరిగిన రేట్లు మళ్లీ తగ్గుతాయేమో!!!

హమ్మయ్య.. వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నాయి.. గృహరుణం తీసుకొని ఇప్పటికైనా ఓ ఇల్లు కొనాలని భావించే సగటు రుణగ్రహీత ఆనందం ఎక్కువ రోజులు మిగల్లేదు.. బ్యాంకులు మళ్లీ వడ్డీ రేట్లను పెంచేందుకు సిద్ధం అవుతుండటం ఒకింత ఆందోళన కలిగిస్తోంది.

దాదాపు రెండేళ్లుగా బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ తగ్గుతూ వస్తోంది. అదే సమయంలో గృహ, ఇతర చిల్లర రుణాలపై కూడా వడ్డీ రేట్లు తగ్గుతూ వస్తున్నాయి. అందుబాటు ధరలో వడ్డీ రేట్లు ఉండటంతో చాలామంది సొంతిల్లు కొనేందుకు ఆసక్తి చూపించారు. కొన్నారు కూడా.. పెద్ద నోట్ల రద్దు తర్వాత బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీ మొత్తంలో నిధులు తరలి వచ్చాయి. దీంతో బ్యాంకులు తమ వద్దకు వచ్చిన డిపాజిట్లపై వడ్డీని తగ్గించాయి. అదే సమయంలో తమ వద్ద ఉన్న డబ్బును రుణాల రూపంలోకి మార్చేందుకు ఆకర్షణీయమైన వడ్డీ రేటుకే అప్పులు ఇవ్వడానికి సిద్ధం అయ్యాయి. అయితే, ప్రస్తుతం బ్యాంకులకు డిపాజిట్లు లభించడం కష్టంగా మారింది. దీంతోపాటు.. ఆర్థిక సంవత్సరం చివరి నెల.. డిపాజిట్ల మొత్తాన్ని పెంచుకునేందుకు వాటిపై తప్పనిసరిగా వడ్డీ రేట్లను పెంచాల్సిన అవసరం ఏర్పడింది. అదే సమయంలో రుణాలపై కూడా వడ్డీని పెంచే ఆలోచన చేస్తున్నాయి బ్యాంకులు. కీలక రేట్ల విషయంలో ఇప్పటివరకు సరళ, తటస్థ వైఖరిని అవలంబిస్తూ వచ్చిన ఆర్‌బీఐ ఇక ముందు కఠిన వైఖరి వైపు మొగ్గు చూపే అవకాశం ఉండటం కూడా ఇందుకు మరో కారణంగా చెబుతున్నారు విశ్లేషకులు.

తాజాగా.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణ రేట్లను 20 బేసిస్ పాయింట్ల (0.2%) వరకు పెంచింది. 2016 ఏప్రిల్ తర్వాత రుణ రేట్లను ఎస్‌బీఐ పెంచడం ఇదే మొదటిసారి. డిపాజిట్ రేట్లను పెంచిన మరునాడే ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. నవంబరు నుంచి డిపాజిటు రేట్లను ఎస్‌బీఐ పెంచడం ఇది మూడో సారి. తాజా పరిణామం అనంతరం మిగిలిన బ్యాంకులు కూడా ఇదే బాటలో నడిచే అవకాశం కనిపిస్తోంది.

రుణాలపై వడ్డీరేట్లు పెంచిన ఎస్‌బీఐ, పీఎన్‌బీ

● అదే దారిలో మిగిలిన బ్యాంకులు ● ప్రియం కానున్న గృహ, రిటైల్ రుణాలు!

రుణ రేట్లు

- ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు) ఆధారంగా రుణ రేట్లను బ్యాంకులు నిర్ణయిస్తాయి. ఇంతకు మునుపు ఒక సంవత్సరం కాలపరిమితికి ఎస్‌బీఐ ఎంసీఎల్ఎల్ 7.95 శాతంగా ఉంది. ఇప్పుడు 0.20% పెంపుతో ఇది 8.15 శాతానికి చేరింది. పీఎన్‌బీ ఏడాది ఎంసీఎల్ఆర్ 8.15% ఉండగా ప్రస్తుత పెంపుతో అది 8.30శాతానికి చేరింది.
- ఎస్‌బీఐ ఆరు నెలల కాలపరిమితికి ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు పెంచి 8 శాతానికి సవరించింది. పీఎన్‌బీ దీన్ని 15 బేసిస్ పాయింట్లు పెంచి 7.80% నుంచి 7.95శాతానికి చేర్చింది.
- మూడేళ్ల వ్యవధి ఎంసీఎల్ఆర్‌ను ఎస్‌బీఐ 0.25% పెంచి 8.35 శాతానికి మార్పు చేసింది.

✦ డిపాజిటు రేట్లు

- రెండేళ్లలోపు రూ.కోటి వరకు డిపాజిట్లపై వడ్డీ రేట్లను ఎస్‌బీఐ 0.15% పెంచింది. అంటే ఇక నుంచి 6.4% వడ్డీ చెల్లించనుంది. రెండేళ్ల నుంచి పదేళ్ల కాలావధి డిపాజిట్ల వడ్డీరేటును కూడా 0.50% పెంచి 6.50 శాతానికి సవరించింది.
- పీఎన్‌బీ అన్ని రకాల కాల వ్యవధి డిపాజిట్లపై 45 బేసిస్ పాయింట్ల వడ్డీని పెంచింది.
- రూ.కోటి నుంచి రూ.10 కోట్ల వరకు ఏడాది నుంచి రెండేళ్ల వరకు కాల వ్యవధి డిపాజిట్లపై వడ్డీరేటును అరశాతం పెంచి 6.75% చేసింది.

✦ డిపాజిటర్లకు ఊరటేనా?

డిపాజిటును సురక్షితమైన మదుపుగా ప్రజలు భావిస్తారు. ఇతర పెట్టుబడి మార్గాలతో పోలిస్తే ప్రతిఫలం తక్కువగా వచ్చినప్పటికీ, నష్ట భయం ఉండదన్న ఒకేఒక్క కారణంతో చాలా మంది తమ డబ్బును డిపాజిటు చేసేందుకు ఇష్టపడతారు. అయితే నోట్ల రద్దు అనంతరం డిపాజిటు వడ్డీ రేట్లు మరీ బాగా తగ్గడంతో డిపాజిటుదార్లు ఆందోళన చెందారు. నష్టభయాన్ని భరించలేని కొందరు డిపాజిట్లను కొనసాగించగా.. చాలా మంది మ్యూచువల్ ఫండ్లు, స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఏడాది కాలంలో స్టాక్ మార్కెట్లు, ఫండ్ పథకాలు భారీగా ప్రతిఫలాలను పంచడానికి ఇదే ప్రధాన కారణం. ఇప్పుడు బ్యాంకులు ఒక్కోటి డిపాజిటు రేట్లు పెంచుతున్నాయి.

✦ ఈఎంఐలు భారమవుతాయా..

డిపాజిటు రేట్ల పెంపు, బాండ్ల ప్రతిఫలాలు పెరగడం ఎస్‌బీఐతోపాటు మిగిలిన బ్యాంకులూ రుణ రేట్లను పెంచడానికి ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. ఎంసీఎల్ఆర్ పెంపుతో దీనికి అనుసంధానంగా ఉన్న గృహ రుణాల చలన వడ్డీ రేటు (ఫ్లోటింగ్) కూడా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ ప్రభావం నెలవారీ వాయిదా చెల్లింపుల (ఈఎంఐలు) పైనా పడుతుంది. అయితే ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ప్రస్తుతం గృహ రుణాలపై వడ్డీ రేట్ల జోలికి బ్యాంకులు వెళ్లకపోవచ్చు. అయితే ఆ తర్వాత ఎప్పుడైనా వడ్డీ రేట్లను పెంచేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

చూడ్డానికి ఎస్‌బీఐ పెంచింది.. 0.2శాతం మాత్రమే అనిపించినా.. ఒక సుదీర్ఘకాలం కొనసాగే గృహరుణంపై దీని ప్రభావం చాలా ఎక్కువగానే ఉంటుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ గృహరుణ వడ్డీ రేటు 8.35శాతానికి అందిస్తోంది. తాజా పెంపుతో ఇది 8.55 శాతానికి చేరే అవకాశం ఉంది. ఇక్కడ ఒక ఉదాహరణను గమనిస్తే.. రూ.25 లక్షల గృహరుణం, 20 ఏళ్ల వ్యవధికి తీసుకున్నారనుకుందాం.. 8.35శాతం చొప్పున నెలకు రూ.21,458.82 చెల్లించాలి. అంటే.. మొత్తం ఈ 20 ఏళ్లలో వడ్డీ దాదాపు రూ.26,50,116 వరకూ చెల్లిస్తామన్నమాట. ఒకవేళ పెంపు 0.2శాతం ఉంటే.. వడ్డీ రేటు 8.55అయ్యే అవకాశం ఉంది. అప్పుడు నెలసరి వాయిదా రూ.21,774.76 అవుతుంది. మొత్తం వడ్డీ రూ.27,25,942.4 చెల్లించాలన్నమాట. అయితే, ఇక్కడ వడ్డీ రేట్లు పెరిగినప్పుడు ఈఎంఐలో ఎలాంటి తేడా రాదు. వచ్చేదల్లా వ్యవధిలోనే. 0.2శాతం వడ్డీ రేటు పెరగడం వల్ల 20 ఏళ్లలో అంటే 240 నెలల్లో ముగియాల్సిన రుణం.. 250 నెలలకు తీరుతుందన్నమాట. అంటే.. 10 నెలల ఈఎంఐ ఎక్కువగా చెల్లించాల్సిందే.

ఈనాడు, హైదరాబాద్/వాణిజ్య విభాగం

ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణం ఎల్ & టీ చేతికి

విలువ రూ.2,500 కోట్లు

ముంబయి: 210 అడుగుల భారీ ఎత్తుతో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని అరేబియా సముద్రంలో నిర్మించే ప్రాజెక్టును ఇంజినీరింగ్ దిగ్గజం ఎల్ అండ్ టీ దక్కించుకుంది. మహారాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రాజెక్ట్ వ్యయం దాదాపు రూ.2500 కోట్లు. ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణం (ఈపీసీ) పద్ధతిలో నిర్మించడానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అంగీకార లేఖను ఎల్ అండ్ టీకి అందించారు. ఈ ప్రాజెక్ట్ రెండో దఫా బిడ్డింగ్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎల్ అండ్ టీలు పోటీపడ్డాయి. రెండేళ్ల కిందట జరిగిన మొదటి దఫా బిడ్డింగ్‌లో ఎల్ అండ్ టీ రూ.3,826 కోట్లకు బిడ్ దాఖలు చేసింది. అయితే ప్రభుత్వ అంచనా వ్యయంతో పోలిస్తే ఇది రూ.1,326 కోట్లు ఎక్కువ కావడంతో తిరస్కరణకు గురైంది. అయితే రెండో దఫాలో ప్రాజెక్ట్ వ్యయాన్ని ప్రభుత్వం రూ.3,600 కోట్లకు అంచనాలు పెంచింది. ఇందులో రూ.1100 కోట్లకు ప్రజల నుంచి సేకరిస్తారు. దీంతో ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకుందని మహారాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.



ప్రయాణికుడికి మొదటి టికెట్ ఇస్తున్న గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ మధుసూదనరావు

విజయవాడ-కడప ట్రూజెట్ విమాన సర్వీసు ప్రారంభం

నేటి నుంచి ఇండిగో సేవలు

ఈనాడు, అమరావతి: విజయవాడ నుంచి కడపకు విమాన సర్వీసును ట్రూజెట్ సంస్థ గురువారం నుంచి ప్రారంభించింది. గన్నవరం విమానాశ్రయంలో ఉదయం 8.05 గంటలకు ఈ విమానం బయలుదేరి కడపకు ఉదయం 9.10 గంటలకు చేరుతుంది. స్థానిక విమానాశ్రయం డైరెక్టర్ జి.మధుసూదనరావు, ట్రూజెట్ స్టేషన్ మేనేజర్ కిరణ్‌రాజు మొదటి ప్రయాణికుడికి టిక్కెట్‌ను అందజేసి సంబంధిత సర్వీసును ప్రారంభించారు. నిత్యం ఉదయం 6.45 గంటలకు ఈ సర్వీసు హైదరాబాద్ నుంచి విజయవాడకు వస్తుంది. అనంతరం బయలుదేరి కడపకు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో కడప నుంచి ఉదయం 9.30కు బయలుదేరి గన్నవరం 10.35 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి ఉదయం 10.55కు బయలుదేరి హైదరాబాద్‌కు ఉదయం 11.50 గంటలకు చేరుతుంది. ఈ నూతన సర్వీసు ప్రారంభంతో రాయలసీమ ప్రాంతానికి రాజధాని అమరావతి నుంచి అనుసంధానం పెరిగిందని విమానాశ్రయ డైరెక్టర్ జి.మధుసూదనరావు పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఉడాన్ పథకంలో భాగంగా ప్రారంభమైన మొదటి సర్వీసు కూడా ఇదేనని ఆయన తెలిపారు. మరోవైపు.. గన్నవరం విమానాశ్రయం నుంచి ఇండిగో సంస్థ శుక్రవారం నుంచి తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. విజయవాడ నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలకు నిత్యం పది సర్వీసులను ఇండిగో ఒకేసారి అందుబాటులోకి తీసుకురానుంది.

తగ్గిన రెనో డస్టర్ కార్ల ధరలు



దిల్లీ: ఫ్రెంచ్ కార్ల తయారీ సంస్థ రెనో తమ పెద్ద కారు డస్టర్ ధరలను గణనీయంగా తగ్గించింది. రూ.29,746 నుంచి రూ.1,00,761 వరకు ధరలు తగ్గాయని, వెంటనే ఇవి అమల్లోకి వచ్చాయని సంస్థ వెల్లడించింది. స్థానికంగా కార్ల తయారీ పెరగడంతో ఇది సాధ్యమైందని తెలిపింది. 2018 మోడల్ డస్టర్ పెట్రోల్ కార్లు రూ.7.95-9.95 లక్షలు, డీజిల్ కార్లు రూ.8.95-12.79 లక్షల (ఎక్స్ షోరూం ధరలు) నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించింది. గతంలో ఇవి రూ.8.5-10.24 లక్షలు, రూ.9.45-13.79 లక్షల (ఎక్స్ షోరూం ధరలు) నుంచి ప్రారంభమయ్యేవి. రెనో సీఈఓ, ఎండీ (భారత కార్యకలాపాలు) సుమిత్ సాహ్నే మాట్లాడుతూ 'క్విడ్ కారును ప్రారంభించినపుడు 98 శాతం స్థానికత వ్యూహాన్ని అమలు చేశాం. ఇప్పుడు ఆ ప్రతిఫలాల్ని మా డస్టర్ వినియోగదారులకు అందిస్తున్నామ'ని తెలిపారు. చెన్నై ప్లాంటులో రెనో డస్టర్ కార్ల తయారీ ప్రారంభించిన సంగతి తెలిసిందే.



వాహన విహారం

ఫిబ్రవరిలో దుమ్మురేపిన కంపెనీలు

● మారుతీ, మహీంద్రా, టాటా విక్రయాల్లో రెండంకెల వృద్ధి ● ఆకట్టుకున్న బజాజ్ ఆటో, ఎన్‌ఫీల్డ్

దిల్లీ: వాహన కంపెనీలు అమ్మకాల జోరును కొనసాగించాయి. ఫిబ్రవరి దేశీయ అమ్మకాల్లో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్‌లు రెండంకెల వృద్ధిని నమోదు చేయగా.. ద్విచక్రవాహన సంస్థలు బజాజ్, రాయల్ ఎన్‌ఫీల్డ్ ఆరోగ్యకర వృద్ధిని నమోదు చేయగలిగాయి. మారుతీ సుజుకీ దేశీయ అమ్మకాలు 1,20,735 నుంచి 14.2 శాతం వృద్ధి చెంది 1,20,735కు చేరాయి. స్విఫ్ట్, ఎస్టిలో, డిజైర్, బాలెనో మోడళ్ల అమ్మకాలు ఇందుకు దన్నుగా నిలిచాయి. జిప్సీ, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎస్-క్రాస్, కాంపాక్ట్ ఎస్‌యూవీ విటారా బ్రెజాలతో కూడిన యుటిలిటీ వాహన విక్రయాలు 17.863 నుంచి 13.8 శాతం వృద్ధితో 20,324కు చేరాయి. మహీంద్రా దేశీయ అమ్మకాలు 20 శాతం అధికమై 48,473కు, టాటా మోటార్స్ విక్రయాలు 38 శాతం పెరిగి 58,993కు వృద్ధి చెందాయి. హ్యుందాయ్, టయోటా, ఫోర్డ్‌లు అమ్మకాల్లో ఒక అంకె వృద్ధి సాధించాయి. ఇక ద్విచక్ర వాహన కంపెనీల్లో బజాజ్ ఆటో అమ్మకాలు 35% మేర వృద్ధి చెందాయి. ఐషర్ మోటార్స్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ విక్రయాల్లో 25% వృద్ధిని నమోదు చేసింది. హీరో మోటో కార్ప్, టీవీఎస్‌లు సైతం మెరుగ్గా రాణించాయి.

ఫిబ్రవరిలో దేశీయ విక్రయాలు

కంపెనీ	2018	2017	వృద్ధి/ (క్షీణత) శాతంలో
మారుతీ సుజుకీ	1,37,900	1,20,735	14.2
హ్యుందాయ్	44,505	42,327	5.1
టాటా మోటార్స్	41,222	30,407	36
మహీంద్రా అండ్ మహీంద్రా	48,473	40,526	20
హోండా కార్స్	14,249	11,650	(18.23)
టయోటా కిర్లోస్కర్	11,864	11,543	3
ఫోర్డ్	9,041	8,338	8.43
వాణిజ్య వాహనాలు			
ఎస్కార్ట్స్	6,295	4,104	53.4
అశోక్ లేలాండ్	18,181	14,067	29
మహీంద్రా ట్రాక్టర్	19,280	13,834	39
ఎస్ఎమ్ఎల్ ఇసుజు	1,145	995	(16)
అతుల్ ఆటో	3,621	2,862	26.52
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	2,14,023	1,59,109	35
హీరో మోటోకార్ప్	6,29,597	5,24,766	20
టీవీఎస్ మోటార్	2,30,353	1,72,611	33.5
రాయల్ ఎన్‌ఫీల్డ్	73,077	58,439	25
హోండా మోటార్‌సైకిల్	4,89,591	3,70,122	32
సుజుకీ మోటార్‌సైకిల్	46,147	-----	37.2

35 విదేశీ శాఖల మూసివేత

పీఎస్‌బీలకు చెందినవే

దిల్లీ: బాధ్యతాయుత, పారదర్శక బ్యాంకింగ్‌లో భాగంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు తమకు విదేశాల్లో ఉన్న 35 శాఖలు, ప్రాతినిధ్య కార్యాలయాలను మూసివేశాయి. గతేడాది నవంబరులో ఆమోదం పొందిన బ్యాంకింగ్ రంగ అజెండా ప్రకారం.. ప్రభుత్వ రంగ బ్యాంకులు మొత్తం 216 విదేశీ కార్యాలయాల మూసివేత అంశాన్ని పరిశీలించాల్సి ఉంది. లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌ఓయూ) ద్వారా విదేశీ శాఖల ద్వారా నీరవ్ మోదీ రూ.12,700 కోట్ల మేర పీఎన్‌బీని మోసం చేసిన నేపథ్యంలో తాజా చర్యలు చోటు చేసుకోవడం గమనార్హం. ఆంధ్రా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లు దుబాయ్ కార్యకలాపాలను; పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు షాంఘై కార్యాలయాలను మూసివేసినట్లు సమాచారం. బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం యాంగూన్, బోత్సువానా; బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ హాంకాంగ్ శాఖలను మూసినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. వీటికి తోడు పీఎస్‌బీలు వివిధ ప్రాతినిధ్య కార్యాలయాలను సైతం మూసివేశాయి.

జియో టీవీ యాప్‌కి 'మొబైల్' ఆస్కార్

ముంబయి: రిలయన్స్ జియోకు చెందిన జియో టీవీ యాప్‌కు అరుదైన పురస్కారం లభించింది. మొబైల్ పరిశ్రమలో ఆస్కార్ అవార్డుగా భావించే గ్లోబల్ మొబైల్ (గ్లోమో) అవార్డ్స్-2018లో 'బెస్ట్ మొబైల్ వీడియో కంటెంట్' విభాగంలో పురస్కారాన్ని పొందింది. ఈ విభాగంలో ఎయిర్‌టెల్ టీవీ, మిగు హాట్ వీడియో, బయోస్కోప్ లైవ్ టీవీలు పోటీ పడినప్పటికీ పురస్కారం తమను వరించిందని జియో ఇన్ఫోకామ్ బీఎస్ఈకి వెల్లడించింది. జియో టీవీకి అవార్డు అందించడంపై న్యాయనిర్ణేతలు చెబుతూ 'సగం కంటే తక్కువ మందికి టెలివిజన్ సేవల సౌలభ్యం ఉన్న దేశంలో ప్రతి ఒక్కరికి విస్తృత ఛానెళ్ల అనుభూతిని జియో అందిస్తోంద'ని తెలిపారు. జియో అధ్యక్షుడు జ్యోతింద్ర థాకర్ మాట్లాడుతూ 'గ్లోమో పురస్కారం దక్కడంతో మేం చాలా ఆనందంగా ఉన్నాం. మేము జియోను వినియోగదారులకు ఎలా చేరువ చేయాలనుకున్నామో దాన్ని సాధించగలుగుతున్నాం. ప్రతి భారతీయుడిని సాధికారికత దిశగా నడిపించాలన్న మా ఉద్దేశం కొనసాగుతుంద'ని తెలిపారు. జియో టీవీ ప్రైమ్‌లో 575కు పైగా లైవ్ టీవీ ఛానళ్లు చూడొచ్చు. 15కి పైగా భారతీయ భాషలకు చెందిన కార్యక్రమాలను వీక్షించవచ్చు.

ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్ట నివారణలో మెరుగుపడాలి

ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్



దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ కార్పొరేట్, నష్టనివారణ పాలన మౌలిక వసతులను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్ పేర్కొన్నారు. ఒకవేళ వాటి నష్టనివారణ నిర్మాణంలో ఏదైనా కొరత ఉండినట్లయితే.. దానిని సవరించుకోవాలి. అది కూడా సాధ్యమైనంత వేగంగా చేయాలని గురువారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమం అనంతరం పేర్కొన్నారు. బ్యాంకింగ్ మోసాలపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా పై విషయాలను ఆయన తెలిపారు. ఎస్‌బీఐకి మాత్రం మంచి నష్ట నివారణ నిర్మాణం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విదేశీ శాఖల స్థిరీకరణ కొత్తదేమీ కాదని.. కార్యకలాపాల వ్యయాలను తగ్గించాలన్నది ప్రభుత్వ అజెండాలో ఇప్పటికే ఉంది. అందుకే గత నెలాఖరులో ఆ పనిచేశాం. నీరవ్ మోదీ మోసానికి విదేశీ శాఖల కార్యకలాపాల స్థిరీకరణకు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. గత మూడేళ్లుగా ఎస్‌బీఐ తన విదేశీ శాఖలను తగ్గించుకుని వ్యయాలను కాపాడుకుంటోందని వివరించారు. 'ప్రపంచ వ్యాప్తంగా నియంత్రణపరమైన చర్యలు పెరుగుతున్నాయి. మనం కూడా అదే దారిలో నడవాలి. వేరే దారి లేద'ని అన్నారు.




గురువారం దిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు వద్ద కార్తి చిదంబరం తల్లి నళిని, తండ్రి మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం

కార్తికి 5 రోజుల రిమాండ్

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా నిధుల వ్యవహారంలో అరెస్టు అయిన కార్తిని దిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు అయిదు రోజల పాటు పోలీస్ కస్టడీకి అప్పగించింది. ఈ కేసులో దాగి ఉన్న భారీ కుట్రను ఛేదించటానికి అవసరమైన విచారణకుగాను నిందితుడిని కస్టడీలోకి తీసుకోవటం అవసరమేనని జడ్జి సునీల్ రాణా అభిప్రాయపడ్డారు. మార్చి 6వ తేదీన కార్తిని మళ్లీ కోర్టులో హాజరు పర్చాలని స్పష్టం చేశారు. కస్టడీలో ఉండే అయిదురోజుల్లో ప్రతి 24 గంటలకు ఒకసారి నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైన ఔషధాలను వెంట తీసుకెళ్లటానికి అనుమతించారు. ఇంటి భోజనానికి మాత్రం అంగీకరించలేదు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఒక గంటపాటు తన న్యాయవాదులతో భేటీ అయ్యే వెసులుబాటు కల్పించారు. జడ్జి నిర్ణయాన్ని వెలువరించటానికి ముందు కస్టడీకి అనుమతించాలని సీబీఐ, కస్టడీ అవసరంలేదని కార్తి తరఫు న్యాయవాది వాదించారు. సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలను, కొన్ని పత్రాలను కార్తి చెప్పే వివరాలతో సరిపోల్చాల్సి ఉన్నందున కస్టడీకి అప్పగించాలని సీబీఐ కోరింది. విచారణ ప్రక్రియ దాదాపు మూడు గంటలపాటు కొనసాగింది. న్యాయవాదులైన కార్తి తల్లిదండ్రులు పి.చిదంబరం, నళినీ గురువారం విచారణ సమయంలో విడివిడిగా, కొద్ది సమయం తేడాతో కోర్టు హాలులోకి వచ్చారు. జడ్జి తీర్పును రాసేందుకు వెళ్లగా విరామ సమయంలో తమ కుమారుడితో వారిద్దరూ మాట్లాడారు.

చిక్కుల్లో చిదంబరం

- వెంటాడుతున్న ఐఎన్ఎక్స్, ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులు

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం కుటుంబాన్ని అక్రమాల వివాదాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే ఐఎన్ఎక్స్ మీడియా విషయంలో కార్తి చిదంబరాన్ని సీబీఐ అరెస్టు చేసింది. కార్తికి చెందిన విదేశీ సంస్థల ద్వారా అతనికి 10లక్షల అమెరికన్ డాలర్లు ముడుపులుగా అందాయని సీబీఐ ఆరోపణ. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే కార్తి దిగువ న్యాయస్థానాలు, మద్రాస్ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారు. తన కుటుంబ సభ్యులను దర్యాప్తు సంస్థలు వేధిస్తున్నాయంటూ ఆయన తండ్రి పి.చిదంబరం కూడా సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో కేంద్ర టెలికాంశాఖ మాజీ మంత్రి దయానిధి మారన్ తదితరులకు విముక్తి లభించినప్పటికీ అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం పాత్రపై దర్యాప్తు జరుగుతూనే ఉంది. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందానికి అనుమతించే అధికారం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) మాత్రమే ఉండగా ఎఫ్ఐపీబీ అనుమతిని చిదంబరం ఎలా ఇప్పించారని దర్యాప్తు సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. ఈ వ్యవహారంలో చిదంబరం పాత్రపై దర్యాప్తు జరుపుతున్నామని గత ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టుకి సీబీఐ తెలిపింది. ఇదే కేసులో స్థాయి నివేదికను సమర్పించాల్సిందిగా సీబీఐని ఈ ఏడాది జనవరి 4న సుప్రీంకోర్టు ఆదేశించింది. మలేషియా వ్యాపార దిగ్గజం టి.ఆనంద క్రిష్ణన్‌కు చెందిన మ్యాక్సిస్ అనుబంధ సంస్థ అయిన గ్లోబల్ కమ్యూనికేషన్ సర్వీసెస్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు 2006 మార్చిలో అప్పటి ఆర్థిక మంత్రి పి.చిదంబరం ఎఫ్ఐపీబీ అనుమతి ఇప్పించారని సీబీఐ తన అభియోగ పత్రంలో పేర్కొంది.

చిదంబరం బంగారు పథకంపై ప్రజాపద్దుల కమిటీ ధ్వజం: కేంద్రంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆర్థిక మంత్రిగా ఉన్న పి.చిదంబరం ప్రకటించిన 80:20 బంగారు పథకంపై ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ)లోని భాజపా సభ్యులు ధ్వజమెత్తారు. పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ సహా పలువురు ఆభరణాల వ్యాపారుల చేతిలో ఈ పథకం దుర్వినియోగమైందని విమర్శించారు.

బ్యాంకుల్లో మరో రూ.6,712 కోట్ల కుంభకోణం

- నీరవ్, ఛోక్సీల బాటలోనే జతిన్ మెహతా
- ఫిర్యాదులు అందినా చర్యలు లేవు: సూర్జేవాలా

దిల్లీ: గుజరాత్‌లోని పాలన్‌పూర్‌కు చెందిన జతిన్ మెహతా అనే ఆభరణాల వ్యాపారి రూ.6712 కోట్ల మేర బ్యాంకు కుంభకోణానికి పాల్పడినట్లు కాంగ్రెస్ పార్టీ బయటపెట్టింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు సహా పలు బ్యాంకుల్ని ఆ వ్యాపారి మోసగించినట్లు తెలిపింది. అచ్చంగా నీరవ్‌మోదీ, మెహుల్ ఛోక్సీలు చేసిన రీతిలోనే ఈ వ్యాపారి కూడా తప్పుడు భరోసా పత్రాలతో (ఎల్‌వోయూలతో) బ్యాంకుల్ని మోసగించి కుటుంబంతో సహా కరీబియన్ దీవులకు వెళ్లిపోయాడని పార్టీ సమాచార విభాగం బాధ్యుడు రణదీప్ సూర్జేవాలా ఆరోపించారు. 2014 ఫిబ్రవరిలోనే సీబీఐకి ఫిర్యాదులు అందినా 2017 ఏప్రిల్ వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని చెప్పారు. విన్‌సమ్ డైమండ్స్‌కు చెందిన మెహతా చేసిన మోసంపైనైనా ప్రధాని నరేంద్రమోదీ మౌనంవీడి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'జతిన్ మెహతాను ఎవరు రక్షిస్తున్నారు? ప్రధానికి సన్నిహితంగా ఉండే పారిశ్రామిక వర్గాలతో మెహతాకు ఉన్న కుటుంబ సంబంధాలే దీనికి కారణమా? అతనిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?' అని ప్రశ్నించారు.

ఇదీ ఐఎన్ఎక్స్ మీడియా అసలు కథ!

- నిబంధనలు ఉల్లంఘించి సంస్థలోకి విదేశీ పెట్టుబడులు
- ఎఫ్ఐపీబీ అనుమతించింది రూ.4.62 కోట్లే
- కానీ..రూ.305 కోట్ల మేర నిధుల ప్రవాహం
- కార్తి సాయంతో అక్రమాలకు మసిపూత
- కాదన్న ఎఫ్ఐపీబీ నుంచే అనుమతులు
- 2007 నుంచి వివరాలతో సీబీఐ ప్రాథమిక సమాచార నివేదిక

దిల్లీ: కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తి అరెస్టుకు దారితీసిన ఆర్థిక అక్రమాల మూలాలకు దాదాపు పదేళ్ల చరిత్ర ఉంది. ఈ కేసులో రాజకీయ పరస్పరారోపణలను పక్కనపెడితే...అసలు వివాదానికి కేంద్ర బిందువు ఐఎన్ఎక్స్ మీడియా. మారిషస్‌కు చెందిన మూడు కంపెనీల నుంచి రూ.305 కోట్లను పెట్టుబడుల రూపంలో పొందేందుకు ఐఎన్ఎక్స్ మీడియా అప్పటి అధినేతలు పీటర్, ఇంద్రాణి ముఖర్జియాలు అడ్డదారులు తొక్కుతున్నారనే విషయాన్ని ఆర్థిక నిఘా విభాగం(ఎఫ్ఐయు) 2008 జనవరిలోనే గుర్తించింది. ఐఎన్ఎక్స్ అక్రమాల కథ ప్రారంభం ఇక్కడే ఉంది. నిధుల అక్రమ తరలింపు విషయాన్ని గుర్తించిన ఐఎఫ్‌యూ..ఆదాయపు పన్ను శాఖను అప్రమత్తం చేయటం, ఐటీ అధికారులు ఈ కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి సిఫార్సు చేయటంతో నెమ్మదిగా ప్రారంభమైన దర్యాప్తు సీబీఐ రంగ ప్రవేశంతో వేగం పుంజుకుంది. విదేశీ నిధుల రాక తీరును పరిశీలించిన ఈడీ.. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద ఐఎన్ఎక్స్ మీడియాపై కేసు నమోదు చేసింది. 2017లో ఈడీ దర్యాప్తు కొనసాగిస్తున్న సమయంలో కార్తికి సంబంధించిన ఓ కంపెనీలో ఐఎన్ఎక్స్ మీడియాతో కుదిరిన ఒప్పంద పత్రం కార్తి సీఏ భాస్కరరామన్ కంప్యూటర్‌లో లభించింది. ఈ పత్రం ప్రకారం విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ) నుంచి ఐఎన్ఎక్స్ మీడియాకు అనుమతులు లభించే సమయానికి ఆ సంస్థ నుంచి కార్తీకి చెందినదిగా భావిస్తున్న సంస్థలకు కొన్ని చెల్లింపులు జరిగాయి. కీలకమైన ఈ సమాచారాన్ని ఈడీ నుంచి అందుకున్న సీబీఐ గత ఏడాది మేలో కార్తిపై కేసు నమోదు చేసింది. కార్తి, ఆయన తండ్రి పి.చిదంబరం కార్యాలయాలు, గృహాల్లో సోదాలు నిర్వహించింది. ఈ క్రమంలోనే కార్తిపై ఈడీ అక్రమ నగదు చలామణి కేసునూ నమోదు చేసింది.

9X INXMEDIA

సీబీఐ ప్రాథమిక సమాచార నివేదిక (2017 మార్చి 13) ప్రకారం...

- మూడు విదేశీ పెట్టుబడి సంస్థలు...దునియర్న్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రై.లిమిటెడ్(మారిషస్), న్యూసిల్క్ రూట్ పీఈ మారిషసస్ ఎల్ఎల్‌సి, న్యూ వెర్నన్ ప్రై.ఈక్విటీ లిమిటెడ్‌లకు 14.98లక్షల ఈక్విటీ షేర్లు, 31.22 లక్షల ప్రిఫరెన్షియల్ షేర్లు(భవిష్యత్తులో మార్చుకోవటానికి వీలైనవి..) ఒక్కోటి రూ.10 ముఖవిలువ గలవి జారీ చేసేందుకు అనుమతించాల్సిందిగా ఎఫ్ఐపీబీ కోరుతూ ఐఎన్ఎక్స్ మీడియా 2007లో దరఖాస్తు చేసుకుంది.
- ఐఎన్ఎక్స్ మీడియా విదేశీ సంస్థలకు ఇవ్వజూపిన షేర్లు ఆ సంస్థ మొత్తం షేర్లలో 46.21శాతం.
- 9ఎక్స్‌ఎం అనే మ్యూజిక్ ఛానెల్, జీఈసీ అనే హిందీ ఛానెల్, ఇతర భారతీయ భాషల్లో మరికొన్ని టీవీ ఛానళ్లను ప్రారంభించేందుకు గాను ఎఫ్ఐపీబీ అనుమతుల్ని ఐఎన్ఎక్స్ మీడియా కోరింది.
- తన అనుబంధ సంస్థ ఐఎన్ఎక్స్ న్యూస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 26శాతం వరకు పెట్టుబడులు పెట్టాలన్న తన ఉద్దేశాన్నీ ఆ దరఖాస్తులో ఐఎన్ఎక్స్ మీడియా వెల్లడించింది.
- అయితే, రూ.4.62 కోట్లు మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను తెచ్చుకునేందుకు 2007, మే 30న ఎఫ్ఐపీబీ అనుమతించింది. ఐఎన్ఎక్స్ న్యూస్‌లో పెట్టుబడుల ప్రతిపాదనను తిరస్కరించింది.
- అయితే, ఎఫ్ఐపీబీ అనుమతుల్లోని షరతులను ఉల్లంఘిస్తూ ఐఎన్ఎక్స్ మీడియా రూ.305 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను తీసుకొచ్చింది.
- ఐఎన్ఎక్స్ మీడియాలో పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థలు రూ.10 ముఖవిలువ గల ఒక్కో షేరును 86.2 రెట్లు అధికంగా రూ.862.31కి కొనుగోలు చేశాయని సమాచారం.
- ఐఎన్ఎక్స్ మీడియా తన అనుబంధ సంస్థ అయిన ఐఎన్ఎక్స్ న్యూస్‌లోనూ 26శాతం మేర పెట్టుబడులను పెట్టింది.
- ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన ఆదాయపు పన్ను శాఖ 2008 మే 26న ఐఎన్ఎక్స్ మీడియా వివరణను కోరింది. ఐటీ దర్యాప్తు నుంచి తప్పించుకునేందుకు ఐఎన్ఎక్స్ మీడియా.. కార్తి చిదంబరానికి చెందిన చెస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రై.లిమిటెడ్‌ను ఆశ్రయించింది.
- కేంద్ర ఆర్థిక శాఖలో భాగమైన ఎఫ్ఐపీబీ అధికారులను ప్రభావితం చేసి తమకు అనుకూలమైన నిర్ణయాన్ని పొందేందుకు పి.చిదంబరం (ఆర్థిక మంత్రి) కుమారుడైన కార్తి సహకారాన్ని ఐఎన్ఎక్స్ మీడియా తీసుకుంది.
- చెస్ మేనేజ్‌మెంట్ సలహా మేరకు తన రెండు ఉల్లంఘనలను సమర్థించుకుంటూ ఐఎన్ఎక్స్ మీడియా 2008 జూన్ 26న లేఖ రాసింది.
- కార్తి ప్రభావితం చేయటం వల్లే ఐఎన్ఎక్స్ మీడియా ఉల్లంఘనలపై దర్యాప్తు చేయటానికి బదులుగా మళ్లీ తాజాగా దరఖాస్తు చేసుకొనే అవకాశాన్ని ఎఫ్ఐపీబీ కల్పించిందని సీబీఐ ఆరోపణ.
- ఇదే సమయంలో ఈడీ తన దర్యాప్తులో కార్తి పరోక్ష నియంత్రణలో ఉన్న అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ ప్రై.లిమిటెడ్ (ఏఎస్‌పీసీఎల్)కు ఐఎన్ఎక్స్ మీడియా నుంచి 2008 జులై 15న రూ.10 లక్షల చెల్లింపులు జరిగినట్లు గుర్తించింది.



పీటర్, ఇంద్రాణి ముఖర్జియా



కార్తి చిదంబరం

- ఈ చెల్లింపులకు సంబంధించి ఏఎస్‌పీసీఎల్...కన్సల్టెన్సీ సేవలకు లభించిన మొత్తంగా తమ ఇన్వాయిస్‌లో పేర్కొనగా...ఐఎన్ఎక్స్ మీడియా ఇన్వాయిస్‌లో మాత్రం 'ఎఫ్ఐపీబీ నోటిఫికేషన్, వివరణలకు గాను' అని నమోదుచేసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.
- ఏఎస్‌పీసీఎల్‌కు అనుబంధంగా విదేశాల్లో ఉన్న మూడు కంపెనీలకు 2008 సెప్టెంబరులో 7లక్షల అమెరికా డాలర్ల చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాతే ఎఫ్ఐపీబీ నుంచి ఐఎన్ఎక్స్ మీడియాకు అనుమతులు లభించాయి.
- ఆ తర్వాత ఐఎన్ఎక్స్ మీడియా...ఇంగ్లీషు టీవీ ఛానెల్ న్యూస్‌ఎక్స్‌ను ప్రారంభించింది. మరుసటి ఏడాదే ఇండి మీడియా నెట్‌వర్క్‌కు దానిని విక్రయించింది.
- 2009లో పీటర్, ఇంద్రాణి ముఖర్జియాలు ఐఎన్ఎక్స్ మీడియాలోని తమ 30శాతం వాటాను విక్రయించటంతో పాటు సంస్థ నుంచి వైదొలగారు.
- 2010 ఏప్రిల్‌లో హిందీ జీఈసీని జీ నెట్ వర్క్ రూ.64 కోట్లకు కొనుగోలు చేసింది.
- అదే ఏడాది ఐఎన్ఎక్స్ మీడియా పేరు 9ఎక్స్ మీడియాగా మారింది.
- 2011లో న్యూసిల్క్ రూట్.. 9ఎక్స్ మీడియా సంస్థలో 80శాతం వాటాలను సొంతం చేసుకుంది.

వ్యాపారి సేథ్ గుర్తింపులో ఇంటర్‌పోల్ సాయం కోరిన సీబీఐ

దిల్లీ: దేశ రాజధానికి చెందిన ఆభరణాల వ్యాపారి సభ్యసేథ్ ఆచూకీ తెలుసుకోవడంలో సహకరించాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను సీబీఐ కోరింది. 2007-12 మధ్య ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌ను రూ.389.85 కోట్ల మేర మోసగించిన కేసులో సేథ్ నిందితుడు. వ్యాపారి అరెస్టుకు లేదాఆచూకీ తెలపడానికి ఉద్దేశించిన 'డిఫ్యూజన్ నోటీసు'ను సీబీఐ ఇచ్చినట్లుఇంటర్‌పోల్ వెబ్‌సైట్ తెలిపింది.

నగరాల్లో మహిళా భద్రతకు రూ.2900 కోట్లు

- హైదరాబాద్, దిల్లీ సహా 8 నగరాల్లో ప్రత్యేక ప్రాజెక్టులు

దిల్లీ: హైదరాబాద్, దిల్లీ, బెంగళూరు సహా ఎనిమిది ప్రధాన నగరాలను మహిళలకు మరింత సురక్షితంగా మార్చేందుకు ఉద్దేశించిన రూ.2900 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా ఊపింది. మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి నేతృత్వంలో సాధికార కమిటీ ఈ విషయంపై గురువారమిక్కడ సమావేశమైంది. తాజా ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటికి అవసరమైన నగదును నిర్భయ నిధి నుంచి తీసుకుంటారు. దిల్లీలో 2012 నాటి సామూహిక అత్యాచారం అనంతరం ఈ నిధిని ఏర్పాటుచేయడం తెలిసిందే. ముఖాల గుర్తింపు పరిజ్ఞానం, కదలికలపై నిఘా, ఉపగ్రహ దిక్సూచీ వ్యవస్థతో అనుసంధానించిన గస్తీ వాహనాలు లాంటి ఆధునిక సాంకేతికత ప్రాజెక్టులు తాజాగా ఆమోదం పొందినవాటిలో ఉన్నాయి.

సీబీఐకి చిక్కిన కీలక సమాచారం!

- భరోసా పత్రాలకు సంబంధించి డాక్యుమెంట్లు లభ్యం
- మూడు విదేశీ ఖాతాలను నిలుపుదల చేసిన ఎస్‌బీఐ
- ఛోక్సీకి చెందిన రూ.1217 కోట్ల ఆస్తుల జప్తు
- నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయాలని ప్రత్యేక న్యాయస్థానాన్ని కోరిన ఈడీ

దిల్లీ, ముంబయి: సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో... సీబీఐకు కీలక సమాచారం చిక్కింది! ప్రధాన నిందితుడు నీరవ్ మోదీకి చెందిన సంస్థల పేరున పీఎన్‌బీ జారీచేసిన భరోసా పత్రాలకు సంబంధించి ముఖ్యమైన డాక్యుమెంట్లు లభ్యమయ్యాయి. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు- ముంబయి సెంట్రల్‌లోని వడాలా ప్రాంతంలో నీరవ్‌కు చెందిన ఓ భవనంలో గురువారం సీబీఐ సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా పలు డాక్యుమెంట్లు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. నీరవ్‌కు చెందిన పలు ప్రాంగణాల్లో సీబీఐ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి.

బ్యాంకు ఖాతాల నిలుపుదల... నీరవ్ మోదీ గ్రూపు సంస్థలకు చెందిన మూడు విదేశీ బ్యాంకు ఖాతాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిలుపుదల చేసింది. దుబాయ్, బెహ్రాయిన్, యాంట్వెర్ప్ (బెల్జియం)ల్లోని తమ బ్యాంకు శాఖల్లో ఈ ఖాతాలున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. విచారణకు తోడ్పడే నిమిత్తం ఈ ఖాతాల వివరాలను సీబీఐ, ఈడీ, ఐటీశాఖకు అందజేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. నీరవ్ పేరున పీఎన్‌బీ జారీచేసిన భరోసా పత్రాలకు సంబంధించి ఎస్‌బీఐ 212 మిలియన్ డాలర్ల మేర చెల్లింపులు జరిపింది. పీఎన్‌బీ ఈసొమ్మును ఎస్‌బీఐకి చెల్లించాల్సి ఉంది.

రంగారెడ్డి జిల్లాలో 170 ఎకరాల పార్కు.. జప్తు.. మరోవైపు- నీరవ్ మోదీ మేనమామ, గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ ఛోక్సీకి చెందిన 41 ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా జప్తు చేసింది. వీటి విలువ రూ.1,217 కోట్లని ఈడీ వర్గాలు తెలిపాయి. జప్తు చేసుకున్నవాటిలో- ముంబయిలోని 15 ఇళ్లు, 17 కార్యాలయ ప్రాంగణాలు; కోల్‌కతాలోని ఓ దుకాణం; అలీబాగ్‌లోని నాలుగెకరాల ఫాంహౌస్; నాసిక్, నాగ్‌పూర్, తమిళనాడులోని విల్లుపురం తదితర ప్రాంతాల్లోని 231 ఎకరాల స్థలాలు; తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో 170 ఎకరాల విస్తీర్ణంలోని సెజ్ తదితరాలు ఉన్నట్లు ఈడీ తెలిపింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 198 సోదాలను నిర్వహించి, రూ.5,100 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది.

త్వరలో నాన్-బెయిలబుల్ వారెంట్?: మెహుల్ ఛోక్సీపై నాన్-బెయిలబుల్ వారెంటును జారీ చేయాలని 'అక్రమ నగదు చలామణి నిరోధక చట్టం' కింద ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానాన్ని ఈడీ కోరింది. ఇప్పటికే మూడుసార్లు సమన్లు జారీచేశామనీ, అయినా ఛోక్సీ నుంచి ఎలాంటి స్పందనా లేదని కోర్టుకు వివరించింది. మరోవైపు... దక్షిణ ముంబయిలోని నీరవ్‌కు చెందిన ప్రాంగణంలో సోదాలు చేపట్టేందుకు అనుమతించాలని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానాన్నీ ఈడీ అభ్యర్థించింది. వీటిపై రెండు రోజుల్లోగా ఆదేశాలు జారీ అయ్యే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. కాగా, పీఎన్‌బీ ఇంటర్నల్ చీఫ్-ఆడిటర్ ఎం.కె.శర్మకు మార్చి 13 వరకూ సీబీఐ కస్టడీని పొడిగిస్తూ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

హైదరాబాద్‌లో ఆస్తుల స్వాధీనం పూర్తి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో నీరవ్ మోదీకి చెందిన ఆస్తుల స్వాధీన ప్రక్రియను ఈడీ గురువారం పూర్తిచేసింది. దిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం- దాదాపు రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంది. నీరవ్ ఉదంతం వెలుగు చూసిన వెంటనే... రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం రావిర్యాలలోని జెమ్స్ సెజ్‌లో ఉన్న అతని ఆభరణాల సంస్థలపై ఈడీ దాడులు ప్రారంభించింది. తర్వాత వాటిలోని ఆస్తుల విలువను అంచనా వేయడం మొదలుపెట్టారు. ఈ ప్రక్రియ గురువారం పూర్తయింది. స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, ఇతర ఆస్తులు, పత్రాలను పీఎన్‌బీ బ్యాంకులోని లాకర్లలో భద్రపరిచారు.

దురహంకారంపై గెలుపు

- మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో విజయంపై రాహుల్ వ్యాఖ్యలు

దిల్లీ: భాజపా పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లోని ఉప ఎన్నికల్లో గెలుపును "దురహంకారంపై విజయం"గా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ అభివర్ణించారు. ఇప్పుడు మార్పు పవనాలు వీస్తున్నాయన్నారు. ఈ విషయంపై ట్విటర్‌లో గురువారం ఆయన స్పందించారు. 'మధ్యప్రదేశ్‌లోని కోలారస్, ముంగావలి అసెంబ్లీ స్థానాల్లో గొప్ప విజయాన్ని అందించిన ఓటర్లు, కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు. ఇది దురహంకారం, లోపభూయిష్ట పాలనపై విజయం'అని ఆయన ట్వీట్‌చేశారు.

అమ్మమ్మతో హోలీ జరుపుకొనేందుకు ఇటలీకి: మరోవైపు హోలీ పండుగను అమ్మమ్మతో కలిసి జరుపుకొనేందుకు రాహుల్ ఇటలీ వెళ్లారు. 'మా అమ్మమ్మకు 93ఏళ్లు. ఆమె ఎంతో దయార్ద్ర హృదయురాలు. ఈ హోలీనాడు ఆమెను ఆశ్చర్యంలో ముంచెత్తబోతున్నా. ఆమెను కలిసేందుకు ఎంతగానో ఎదురుచూస్తున్నా'అని రాహుల్ ట్వీట్‌చేశారు.

మహిళా దినోత్సవం రోజున టోల్ కేంద్రాల్లో పూర్తిగా వారే

దిల్లీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు (మార్చి 8)న టోల్ కేంద్రాల్లో రుసుములు వసూలు చేసే బాధ్యతను పూర్తిగా మహిళా సిబ్బందికి జాతీయ ప్రధానరహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అప్పజెప్పనుంది. ప్రతీ రాష్ట్రంలో కనీసం ఒక్క టోల్ కేంద్రంలోనైనా ఇలా చేయాలని నిర్ణయం తీసుకుంది. పగటి పూట షిఫ్టులో మహిళలు విధులు నిర్వర్తించనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే ఎన్‌హెచ్ఏఐ నిర్వహణలోని అన్ని టోల్ కేంద్రాల్లో.. వచ్చే మూడు నెలల్లో దీన్ని అమల్లోకి తెస్తామని కేంద్ర రోడ్డు రవాణా, ప్రధాన రహదారుల శాఖ తెలిపింది. ఈ మేరకు ప్రాంతీయ అధికారులకు సూచనలు జారీ చేసినట్లు పేర్కొంది. టోల్ కేంద్రాల మధ్య పోటీ వాతావరణాన్ని పెంచేందుకు ర్యాంకింగ్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నట్లు వెల్లడించింది.

కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాది హతం

శ్రీనగర్, జమ్ము: జమ్ముకశ్మీర్‌లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాదిని.. భారత దళాలు హతమొందించాయి. బందిపోరా జిల్లాలోని హజన్ ప్రాంతంలో ఉగ్రవాదుల ఉనికికి సంబంధించి సమాచారం అందడంతో.. భద్రతదళాలు, పోలీసులు కలిసి సంయుక్త ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భద్రత దళాలను చూడగానే ఉగ్రవాదులు కాల్పులు జరిపారని పేర్కొన్నారు. దీంతో సేనలు ఎదురుకాల్పులు జరిపాయని.. ఘటనలో ఓ ఉగ్రవాది మరణించాడని తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని.. అతడి వద్ద ఏకే రైఫిల్, ఇతర ఆయుధాలు, మందుగుండు లభించినట్లు పేర్కొన్నారు.

పాక్ కాల్పుల్లో ఇద్దరు జవాన్లకు గాయాలు: జమ్ముకశ్మీర్‌లోని పూంచ్, రాజౌరీ జిల్లాల్లో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి ఉన్న భారత సేనలపై.. పాకిస్థాన్ కాల్పులకు తెగబడింది. ఘటనల్లో ఇద్దరు జవాన్లకు స్వల్పగాయాలయ్యాయని.. వారిని ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు.

ప్రత్యేక ఆహ్వానితునిగా పిలిస్తే రాను

- లోక్‌పాల్ ఎంపిక సమావేశంపై ఖర్గే స్పష్టీకరణ
- తన హోదాపై చట్ట సవరణ చేయాలంటూ ప్రధానికి లేఖ

దిల్లీ: లోక్‌పాల్‌ను ఎంపిక చేయడానికి 'ప్రత్యేక ఆహ్వానితుని' హోదాలో సమావేశానికి రావాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం పంపిన ఆహ్వానాన్ని లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే తిరస్కరించారు. అత్యవసరాదేశంతో చట్టంలోనే తగిన సవరణ చేసి ఆహ్వానించాలని ప్రధాని నరేంద్రమోదీకి ఆయన లేఖ రాశారు. లోక్‌పాల్ ఎంపికపై తీసుకున్న చర్యలేమిటని ఫిబ్రవరి 23న సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మార్చి ఒకటిన సమావేశం నిర్వహిస్తున్నామని కేంద్రం తెలిపింది. లోక్‌పాల్ ఎంపికలో విపక్ష నేత కూడా పాల్గొనాలి. కాంగ్రెస్‌కు విపక్ష హోదా రానందున విపక్షాల్లో పెద్దపార్టీకి చెందిన నేతగా ఖర్గేను పిలవాలని తలచి, ప్రత్యేక ఆహ్వానితునిగా రావాలని ప్రభుత్వం కోరింది. 'విపక్ష నేత' అనే హోదాను చట్టబద్ధంగా మార్చాల్సింది పోయి, ఇలాంటి కంటి తుడుపు చర్యతో సరిపెట్టడం ఎంతమాత్రం సబబు కాదని ఖర్గే అభ్యంతరం వ్యక్తంచేశారు. సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా చట్ట సవరణ చేయాలంటూ ఒక ముసాయిదాను కూడా జతచేసి ప్రధానికి ఖర్గే లేఖ రాశారు.

ఉగ్ర పోరులో ఏ మతమూ లక్ష్యం కాదు

- దారితప్పిన ఆలోచనతీరుపైనే గురి
- ఒక చేతిలో ఖురాన్, మరో చేతిలో కంప్యూటర్ ఉండాలి
- అప్పుడే ముస్లిం యువత అభివృద్ధి సాధ్యం
- ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- విద్వేష స్వరాలను తిరస్కరిద్దాం: జోర్డాన్ రాజు

దిల్లీ

హింసకు పాల్పడుతూ, మతపరిరక్షణ కోసమే ఇదంతా చేస్తున్నామనేవారు.. నిజానికి తమ మతానికి హాని చేసుకుంటున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అతివాదానికి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సాగే పోరు ఏ మతాన్నీ ఉద్దేశించి చేపట్టింది కాదని చెప్పారు. అమాయకులపై అకృత్యాలకు పాల్పడేలా యువతను రెచ్చగొట్టే నిర్దిష్ట ఆలోచనతీరును లక్ష్యంగా చేసుకుంటోందని చెప్పారు. ఇస్లామిక్ వారసత్వంపై గురువారం



గురువారం దిల్లీలో జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 బిన్ అల్‌హుస్సేన్‌తో ప్రధాని మోదీ

ఇక్కడ జరిగిన ఒక సదస్సులో మోదీ, జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 బిన్ అల్ హుస్సేన్‌లు పాల్గొన్నారు. అతివాదంపై పోరు, భిన్నత్వం గురించి ఇద్దరు నేతలు ఒకే స్వరాన్ని వినిపించారు. ముస్లిం యువత ఒక చేతిలో ఖురాన్, మరో చేతిలో కంప్యూటర్‌ను కలిగిఉన్నప్పుడే పూర్తిస్థాయి సంక్షేమం, సమ్మిళిత అభివృద్ధి సాధ్యమని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోని అన్ని మతాలు భారత్‌లో వర్ధిల్లుతున్నాయని చెప్పారు. అన్ని మతాల సందేశాల్లో అంతర్లీనంగా శాంతి, సామరస్యం, సోదరభావం అనే మానవతా విలువలు ఇమిడి ఉన్నాయన్నారు. అందువల్ల యువత.. ఇస్లామ్‌లోని మానవతావాద అంశాలతో మమేకం కావాలన్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

మితవాదానికి విద్వేషానికి మధ్య పోరు

జోర్డాన్ రాజు మాట్లాడుతూ.. మోదీ అభిప్రాయాలతో ఏకీభవించారు. ఉగ్రవాదంపై సాగుతున్న ప్రపంచ పోరు.. భిన్న మతాల మధ్య సాగే యుద్ధం కాదన్నారు. "అన్ని మతాల్లోని మితవాదులకు, విద్వేషాన్ని, హింసను వ్యాప్తి చేసే అతివాదులకు జరుగుతున్న పోరు" అని చెప్పారు. మత విశ్వాసమనేది మానవత్వాన్ని ఒక్కటిగా నిలపాలన్నారు. ఇస్లాంపై కానీ మరే ఇతర మతం గురించైనా సాగించే తప్పుడు ప్రచారాన్ని తోసిపుచ్చాలన్నారు. నేడు ప్రజల్లో విభజన తెచ్చే అంశాలపైనే వార్తలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. 'బాంబులు, ఉగ్రవాదంతోనే కాక అసత్యాలు, అజ్ఞానంతో ప్రపంచాన్ని బాధిస్తున్న వారి నుంచి మనం వాయు తరంగాలు, ఇంటర్నెట్‌ను వెనక్కి తీసుకోవాలి" అని కోరారు. శాంతియుత సహజీవనానికి సమ్మిళితవాదమే మార్గమన్నారు. "మన భవిష్యత్, సుసంపన్నత, భద్రత, శాంతికి ఇదే పూచీకత్తు. విద్వేష సిద్ధాంతాలు.. భగవంతుడి బోధనలను వక్రీకరించి, ఘర్షణకు ఆజ్యం పోస్తాయి. ఇలాంటి వాటిని తిరస్కరించాలి" అని పేర్కొన్నారు.

జోర్డాన్ రాజు.. మహ్మద్ ప్రవక్తకు చెందిన 41వ తరం వారసుడు. అతివాదాన్ని ఎదుర్కోవడానికి అరబ్ ప్రపంచంలో చేపట్టిన 'అఖాబా ప్రక్రియ'లో అబ్దుల్లా-2 కీలక పాత్ర పోషించారు. ఈ విషయాన్ని మోదీ పరోక్షంగా ప్రస్తావిస్తూ.. అతివాదంపై పోరులో జోర్డాన్ రాజు పాత్రను కొనియాడారు. ఇలాంటి చర్యల్లో రాజుకు భారత్ అండగా ఉంటుందన్నారు. ఆయనకు 'ఏ థింకింగ్ పర్సన్స్ గైడ్ టు ఇస్లామ్' అనే పుస్తకానికి సంబంధించి ఉర్దూ అనువాదాన్ని మోదీ బహూకరించారు. జోర్డాన్ రాజుకు వరసకు సోదరుడయ్యే ప్రిన్స్ ఘాజీ బిన్ మహ్మద్.. ఈ పుస్తక మూల రచయిత.

రక్షణ సహకారం బలోపేతం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, జోర్డాన్ రాజు అబ్దుల్లా-2.. కీలక ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై సమగ్ర చర్చలు జరిపారు. రక్షణ, ఉగ్రవాదంపై పోరు సహకారం బలోపేతం చేసుకోవడం సహా 12 అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దౌత్య, అధికారిక పాస్‌పోర్టులు కలిగినవారికి వీసా అవసరం నుంచి మినహాయింపు ఇవ్వడం, ఆరోగ్య పరిరక్షణ, వైద్యం, జోర్డాన్‌లో సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ ఏర్పాటు, రాక్‌ఫాస్ఫేట్, ఫర్టిలైజర్/ఎన్‌పీకే దీర్ఘకాల సరఫరా, కస్టమ్స్, పరస్పర సహాయం వంటి అంశాల్లో ఒప్పందాలు కుదిరాయి.

ఛాంపియన్స్

హర్మన్‌ప్రీత్ బన్‌గయా పోలీస్

చండీగఢ్: భారత మహిళల టీ20 క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కల నెరవేరింది. గురువారం ఆమె తనకిష్టమైన పోలీసు వృత్తిలో చేరింది. పంజాబ్ పోలీసు శాఖలో డీఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టింది. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్, డీజీపీ సురేశ్ అరోరా ఆమె దుస్తులపై నక్షత్రాలను అమర్చడం విశేషం. దేశానికి గర్వకారణంగా నిలిచిన హర్మన్‌ప్రీత్ మరిన్ని గొప్ప ఘనతలు సాధిస్తుందన్న నమ్మకముందని అమరీందర్ ట్వీట్ చేశారు. ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం చేస్తోన్న హర్మన్‌ప్రీత్‌కు పంజాబ్ ప్రభుత్వం డీఎస్పీ పదవిని ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల పదవీ కాలం ముగిసేవరకు ఆమెను విడుదల చేయమని రైల్వేస్ తేల్చి చెప్పడంతో ఆమె పోలీసు వృత్తి చేపట్టడం అనుమానంగా మారింది. ఐతే పంజాబ్ ముఖ్యమంత్రి కలగజేసుకుని.. రైల్వే మంత్రిత్వ శాఖకు లేఖ రాయడంతో సమస్య పరిష్కారమైంది.



పాండ్య నుంచి ఎక్కువ ఆశిస్తున్నారు



మొనాకో

ఆల్‌రౌండర్ బ్యాటింగ్ లేదా బౌలింగ్‌లో ఏదో ఒక అంశంలో బలంగా ఉండాలని, టీమ్‌ఇండియా యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య బ్యాటింగ్‌పై ఎక్కువ దృష్టిసారిస్తే మంచిదని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ సూచించాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 93 పరుగులు చేసిన పాండ్య ఆ తర్వాత అన్ని ఫార్మాట్లలో ఒక్క యాభై కూడా చేయలేకపోయాడు. కెరీర్ ఆరంభంలోనే మరో కపిల్‌గా ముద్ర పడిన పాండ్య గురించి కపిల్ మాట్లాడుతూ.. "పాండ్య తన సత్తా ఏంటో ఇప్పటికే చాటాడు. అతడిలో గొప్ప నైపుణ్యం ఉంది. ఐతే మరొకరితో పోలిక అతడిపై ఒత్తిడి పెంచుతుంది. పాండ్య ఆటను ఆస్వాదించడంపై దృష్టి సారించాలి. బౌలింగ్ లేదా బ్యాటింగ్ ఇందులో ఏదో ఒక కారణంతో జట్టులో చోటు సంపాదించాలి. బ్యాటింగ్ విషయంలో మరింత శ్రమించాలి. ఎందుకంటే అతడు బ్యాటింగ్ ఆల్‌రౌండర్. పరుగులు సాధించినప్పుడు బౌలింగ్ కూడా మెరుగవుతుంది" అని వివరించాడు. పాండ్య నుంచి అందరూ ఎక్కువగా ఆశిస్తున్నారని కపిల్ అన్నాడు. "ఇంకా హార్దిక్ కెరీర్ ఆరంభంలోనే ఉన్నాడు. ఐతే అంతా అతడి నుంచి చాలా ఎక్కువగా ఆశిస్తున్నారు. జట్టులో చురుగ్గా ఉండే ఆటగాళ్లలో పాండ్య ఒకడన్న విషయంలో సందేహం లేదు. ఐతే ఆల్‌రౌండర్‌గా విజయవంతం కావాలంటే అతడు మరింత శ్రమించాలి" అని అన్నాడు.



అప్పుడు ధోనీ ఉంటేనా..

ముంబయి: 2003 ప్రపంచకప్ భారత్ జట్టులో మహేంద్రసింగ్ ధోనీ ఉంటే కప్పు గెలిచేవాళ్లమా! ఫైనల్లో ఆస్ట్రేలియాపై నెగ్గేవాళ్లమా! ఏమో..!! కానీ అప్పటి జట్టుకు నాయకత్వం వహించిన సౌరభ్ గంగూలీ మాత్రం ధోని ఉంటే బాగుండేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. "2003 ప్రపంచకప్ జట్టులో ధోని ఉంటే బాగుండేది. అయితే అప్పటికి ధోని రైల్వే టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటూ, మ్యాచ్ గమనాన్ని మార్చే ఆటగాళ్ల కోసం నేనెప్పుడూ వెతుకుతుండేవాడిని. 2004లో ధోని నా దృష్టికి వచ్చాడు. నా ఆలోచనలకు ప్రతిరూపం అతడు. తొలి రోజే ధోనీని చూసి ముగ్ధుడినయ్యా. అతడిపై అప్పటి నా అంచనా నిజమైనందుకు సంతోషంగా ఉంది. ఈ రోజు అతడు చేరుకున్న స్థితి చూస్తే నిజంగానే అద్భుతం అనిపిస్తుంది" అని గంగూలీ అన్నాడు. 2003 ప్రపంచకప్‌లో అదిరిపోయే ఆటతీరుతో ఫైనల్‌కు చేరిన భారత్.. తుది పోరులో ఆస్ట్రేలియా చేతిలో 125 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే.

క్రికెట్.. బాక్సింగ్ లాంటిదే!

దిల్లీ

క్రికెట్ కూడా బాక్సింగ్ లాంటిదేనంటున్నాడు టీమ్‌ఇండియా బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్. ఓడిపోతామని భయపడితే.. గెలవలేమని అంటున్నాడు. "క్రికెట్ కూడా బాక్సింగ్ లాంటిదే. గాయపడతామేమోనన్న భయంతో రింగ్‌లో దిగకుండా ఉంటే మనం ఎప్పుడూ కొట్టలేం. ఈ జట్టుకు ఓటమి భయం లేదు. విజయం గురించి మాత్రమే ఆలోచిస్తుంది" అని చెప్పాడు. 2019 ప్రపంచకప్ నేపథ్యంలో తదుపరి లక్ష్యం ప్రతిభావంతులైన బ్యాకప్ పేసర్లను సిద్ధం చేయడమేనని అరుణ్ అన్నాడు. వన్డే క్రికెట్‌కు సంబంధించి భువనేశ్వర్, బుమ్రాల రూపంలో ఇప్పటికే ప్రధాన పేసర్లున్నారు. ఐతే అరుణ్‌తో పాటు కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ విరాట్ కోహ్లి కనీసం మరో ముగ్గురు సహాయ పేసర్లు సిద్ధంగా ఉండాలని కోరుకుంటున్నారు. శ్రీలంకలో ముక్కోణపు సిరీస్ రిజర్వ్ పేసర్లను పరీక్షించడానికి ఉపయోగపడుతుందని భరత్ అరుణ్ అభిప్రాయపడ్డాడు. "రిజర్వ్ పేస్ బౌలింగ్ దళాన్ని పరీక్షించేందుకు శ్రీలంకలో ముక్కోణపు సిరీస్ మాకు ఉపయోగపడుతుంది. భువి, బుమ్రా రూపంలో మాకు ప్రపంచ స్థాయి పేసర్లున్నారు. కానీ మేం మంచి బౌలింగ్ బృందాన్ని కూడా తయారు చేశాం. శ్రీలంక వెళ్లే పేసర్లు (షమి, శార్దూల్ ఠాకూర్, ఉనద్కత్) అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నారు" అని అరుణ్ అన్నాడు. "చాలా సుదీర్ఘ సీజన్ ముందుంది. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలకు సిద్ధంగా ఉండాలి. శార్దూల్ దక్షిణాఫ్రికాలో చక్కగా రాణించాడు. షమి, ఉమేశ్ కూడా పోటీలో గట్టిగా ఉన్నారు. వాళ్లు దేవధర్ ట్రోఫీలో ఆడబోతున్నారు" అని చెప్పాడు. ప్రస్తుత బౌలర్లలో చాలా మంది జూనియర్లుగా జాతీయ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందినవారే. ఎన్‌సీఏ మాజీ కోచ్ అయిన అరుణ్ వాళ్లను చాలా దగ్గరగా పరిశీలించాడు. ఈ నేపథ్యంలోనే టీ20 ఫార్మాట్లో విజయవంతమైన ఉనద్కత్.. వన్డేల్లోనూ రాణించి, మంచి ఎడమచేతి వాటం ప్రత్యామ్నాయం కాగలడా అని అడిగినప్పుడు.. "నేను సెలక్టర్ కానందున ఉనద్కత్ వన్డే ప్రణాళికల్లో ఉండాలా లేదా అన్నదానిపై నేను మాట్లాడను. కానీ ఒక కోచ్‌గా ప్రతి బౌలర్ కూడా విజయవంతం కాగలడనే నమ్మకంతో నేను ఉండాలి. అన్వయించుకోవడం చాలా ముఖ్యం. ఉనద్కత్ బాగా అన్వయించుకోగలిగితే అతడు వన్డేల్లో రాణించలేడనడానికి కారణం కనిపించట్లేదు" అని అరుణ్ చెప్పాడు.



భరత్ అరుణ్

బుమ్రా ఆడలేడని ఎలా అంటాం: టీ20 నుంచి టెస్టులకు ఎదిగిన బుమ్రా గురించి అరుణ్ మాట్లాడుతూ.. "బుమ్రా సత్తా గురించి మాకు ఎప్పటినుంచో తెలుసు. అతడు వైవిధ్యమైన బౌలర్. కొత్త బంతితో, పాత బంతితో ఎలాంటి బ్యాట్స్‌మన్‌నైనా ఇబ్బంది పెట్టగలడు" అని చెప్పాడు. బుమ్రా తన బౌలింగ్ శైలితో ఇంగ్లాండ్‌లో రాణించలేకపోవచ్చన్న బౌలింగ్ దిగ్గజం మైకెల్ హోల్డింగ్ వ్యాఖ్యలను ప్రస్తావించగా.. "నిర్దేశిత పరిస్థితుల్లో ఏ బౌలరైనా ఎలా ఆడతాడో చూడకుండా అతడిపై ఓ నిర్ణయానికి రావడం సరికాదని నా అభిప్రాయం. కొన్ని అంశాల్లో మెరుగుపడాల్సిన మాట నిజమే. కానీ ఇంగ్లాండ్‌లో ఒక్క టెస్టు కూడా ఆడని బుమ్రా అక్కడ రాణించలేడని ఎలా చెప్పగలం?" అని అరుణ్ అన్నాడు.




వీడియోలు తీశాడని వేటేశారు

పారా స్విమ్మర్ కర్మాకర్‌పై మూడేళ్ల నిషేధం



దిల్లీ: నిరుడు జాతీయ ఛాంపియన్‌షిప్స్ సందర్భంగా సహచర మహిళా స్విమ్మర్ల వీడియోలు తీసినందుకు పారా స్విమ్మర్ ప్రశాంత కర్మాకర్‌పై పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) మూడేళ్ల నిషేధం విధించింది. "తప్పుగా ప్రవర్తించాడంటూ, చేయి చేసుకున్నాడంటూ 2010 కామన్వెల్త్ క్రీడల కాంస్య విజేత కర్మాకర్‌పై లిఖితపూర్వక ఫిర్యాదు అందింది" అని పీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. కర్మాకర్ అర్జున అవార్డు గ్రహీత కూడా. మహిళా స్విమ్మర్లను వీడియో తీయాలని తన సహాయకుడిని ఆదేశించాడన్నది కర్మాకర్‌పై ఆరోపణ. వీడియో తీయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన స్విమ్మర్ల తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేశారని పీసీఐ ఛైర్మన్ వీకే దబాస్ చెప్పాడు. కర్మాకర్ కూడా స్వయంగా వీడియో తీస్తూ దొరికిపోయాడని తెలిపాడు. ఈ ఆరోపణలను కర్మాకర్ ఖండించాడు. "నా మీద కుట్ర జరుగుతోంది. ఆరేడుగురు స్విమ్మర్లు నా దగ్గర కోచింగ్ తీసుకుంటున్నారు. అలా శిక్షణ పొందుతున్న అమ్మాయిల్లో ఒకమ్మాయి తండ్రి ఆ వీడియో తీశాడు. అది నేను తీసినట్లు చిత్రీకరిస్తున్నారు" అని కర్మాకర్ చెప్పాడు. పీసీఐ అధికారులు మాత్రం ఇంతకుముందు కూడా కర్మాకర్‌పై ఇలాంటి ఫిర్యాదులు అందాయని చెబుతున్నారు.

సెమీస్‌లో పేస్ జోడీ



దుబాయ్: దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత వెటరన్ స్టార్ లియాండర్ పేస్ సెమీఫైనల్లో ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో పేస్-సెరెటాని (అమెరికా) జోడీ 2-6, 6-4, 10-7తో క్లాసన్ (దక్షిణాఫ్రికా)-వీనస్ (ఆస్ట్రేలియా)పై చెమటోడ్చి గెలిచింది. సెమీస్‌లో పేస్ జంట.. జుమ్‌హర్ (బోస్నియా)-క్రాజినోవిచ్ (క్రొయేషియా)తో తలపడనుంది.

ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్

వినేశ్‌కు రజతం

బిష్కెక్ (కిర్గిజ్‌స్థాన్): ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు అదరగొడుతున్నారు. మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాత్ రజతం కైవసం చేసుకోగా.. గ్రీకో రోమన్ విభాగంలో రెండు కాంస్య పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. గురువారం మహిళల 50 కిలోల విభాగంలో అసాధారణంగా పోరాడి వినేశ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఐతే హోరాహోరీగా సాగిన పసిడి పోరులో 2-3తో చున్ లీ (చైనా) చేతిలో ఓడిపోయింది. పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో ఇప్పటికే రెండు పతకాలు భారత్ సొంతమయ్యాయి. కాంస్యం కోసం జరిగిన పోరులో హర్‌ప్రీత్ (82 కిలోలు) 11-3తో కాషిమ్‌బెకోవ్ (ఉజ్బెకిస్థాన్)ను చిత్తు చేశాడు. 55 కిలోల విభాగంలో రాజేంద్ర కుమార్ కాంస్యం సాధించాడు. అతడు మిరాక్‌మెదోవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించాడు. మరో రెండు పతకాలు భారత్ చేజారాయి. కాంస్య పోరాటాల్లో కుల్‌దీప్ మలిక్ (72 కిలోలు) 0-11తో ఐనో తొమోహిరో (జపాన్) చేతిలో.. నవీన్ (130 కిలోలు) 1-3తో జియోమింగ్ (చైనా) చేతిలో పరాజయంపాలయ్యారు.





అలాంటి వెస్టిండీస్...

హరారే: వెస్టిండీస్.. ఈ పేరు వింటేనే ప్రత్యర్థి జట్టు చివురుటాకులా వణికిపోయేవి. ఆధిపత్యానికి మారుపేరుగా నిలిచి ప్రపంచ క్రికెట్‌ను ఏలిన విండీస్.. గత వైభవాన్ని కోల్పోయి దశాబ్దాలే గడిచిపోయాయి. రెండుసార్లు వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడి.. ఒకసారి రన్నరప్‌గా నిలిచిన కరీబియన్ జట్టు.. ఇప్పుడు తొలిసారి నేరుగా ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేకపోయింది. పసికూనలతో పోటీపడి ఈ టోర్నీకి వెళ్లాల్సిన పరిస్థితిని తెచ్చుకుంది. క్రిస్ గేల్ లాంటి స్టార్లు ఉన్న విండీస్ జట్టు ఆదివారం హరారే వేదికగా ప్రారంభమయ్యే ప్రపంచకప్ క్వాలిఫయర్స్ టోర్నీలో పాల్గొనబోతోంది. ఈ క్వాలిఫయర్స్ ఆడుతున్న అతి పెద్ద జట్టు విండీసే. ఇన్నాళ్లూ ఎలాగోలా టాప్-10లో ఉంటూ ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తూ వచ్చిన కరీబియన్ బృందం.. ఈసారి ర్యాంకుల్లో పడిపోవడంతో అర్హత పోటీలు ఆడక తప్పని పరిస్థితి వచ్చింది. మామూలుగా ప్రపంచకప్‌లో 10 కంటే ఎక్కువ జట్లు ఆడతాయి. 2007లో 16, 2011, 2015 టోర్నీల్లో 14 జట్లు ఆడాయి. మారిన ఐసీసీ నిబంధనల ప్రకారం ఈసారి టోర్నీలో 10 జట్లే పాల్గొంటున్నాయి. ఆతిథ్య హోదాలో ఇంగ్లాండ్‌తో పాటు ర్యాంకింగ్ ప్రకారం టాప్-7 జట్లు నేరుగా అర్హత సాధించాయి. మిగిలిన రెండు బెర్తుల కోసం ఇప్పుడు అర్హత టోర్నీ జరుగుతోంది. 10 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి ఆడుతున్న ఈ టోర్నీలో విండీస్ గ్రూప్-ఎలో ఉంది. ఈ నెల 6న తన తొలి మ్యాచ్‌లో యూఏఈతో తలపడనుంది. గ్రూప్-బిలో జింబాబ్వే కూడా ఉంది. ఈ గ్రూపులో అఫ్గానిస్తాన్ బలమైన జట్టుగా బరిలో దిగుతోంది.

స్టంప్ మైక్రోఫోన్లు వద్దట

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ సందర్భంగా స్టంప్ మైక్రోఫోన్లు ఆపేయాలని ఆస్ట్రేలియా జట్టు కోరుతోంది. "మైదానంలో ఏం జరిగినా అది మైదానానికే పరిమితమవుతుంది. మేమంతా పెద్దవాళ్లమే. తీవ్రంగా పోరాడతాం. మాకు హద్దులు తెలుసు. ఎప్పుడూ హద్దులు దాటం" అని ఆసీస్ స్పిన్నర్ నాథన్ లైయన్ అన్నాడు. "ఇది శారీరక క్రీడే కాదు, మానసిక క్రీడ కూడా. రెండు జట్ల ఆటగాళ్లూ నోటికి పనిచెబుతారు. ఈ సిరీస్ హోరాహోరీగా సాగడం ఖాయం" అని చెప్పాడు. ఆస్ట్రేలియాలో బంతి ప్లేలో ఉన్నప్పుడు మాత్రమే శబ్దాన్ని రికార్డు చేయడానికి స్టంప్ మైక్రోఫోన్లు వాడతారు. డెలివరీల మధ్య అవి పనిచేయవు. కానీ దక్షిణాఫ్రికాలో మాత్రం మైక్రోఫోన్లు ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటాయి. నిరుడు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను బూతులు తిడుతూ మైక్రోఫోన్లకు దొరికిపోయిన దక్షిణాఫ్రికా పేసర్ రబాడ.. ఓ టెస్టు మ్యాచ్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో తీవ్ర స్థాయి మాటల యుద్ధం మధ్య జరిగిన యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా 4-0తో గెలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో గురువారం ఆరంభమైన సిరీస్‌లో అదే జోరు కొనసాగించాలనే పట్టుదలతో ఆసీస్ ఉంది.

రాణించిన స్మిత్



స్మిత్ (56)

ఆస్ట్రేలియా 225/5 • దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు

డర్బన్: ఆతిథ్య దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు ఆసక్తికరంగా ఆరంభమైంది. స్టీవ్ స్మిత్ (56; 79 బంతుల్లో 6×4), డేవిడ్ వార్నర్ (51; 79 బంతుల్లో 6×4) అర్ధశతకాలు చేసినా.. తొలి రోజు దక్షిణాఫ్రికా బౌలర్లపై కంగారూల జట్టు ఆధిపత్యం ప్రదర్శించలేకపోయింది. వెలుతురులేమి కారణంగా గురువారం ఆట త్వరగా ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 225 పరుగులు సాధించింది. మిచెల్ మార్ష్ (32 నాటౌట్), పైన్ (21 నాటౌట్) క్రీజులో ఉన్నారు. స్లో పిచ్ నుంచి పెద్దగా సహకారం లభించకున్నా దక్షిణాఫ్రికా బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేశారు. ఫిలాండర్, కేశవ్ మహరాజ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకు గొప్ప ఆరంభమేమీ లభించలేదు. ఆ జట్టు 39 పరుగులకే రెండు వికెట్లు చేజార్చుకుంది. బాన్‌క్రాఫ్ట్ (5)ను ఫిలాండర్, ఖవాజా (14)ను రబాడ ఔట్ చేశారు. ఆ దశలో స్మిత్, వార్నర్ నిలిచారు. మూడో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. వార్నర్‌ను ఔట్ చేయడం ద్వారా బలపడుతున్న ఈ భాగస్వామ్యాన్ని ఫిలాండర్ విడదీశాడు. స్మిత్ ఆ తర్వాత మరో విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. షాన్ మార్ష్ (40)తో నాలుగో వికెట్‌కు 56 పరుగులు జోడించి మహరాజ్ బౌలింగ్‌లో నిష్క్రమించాడు. కాసేపటికే షాన్ మార్ష్ కూడా ఔట్ కావడంతో ఆసీస్ 177/5తో ఇబ్బందుల్లో పడింది. ఐతే మిచెల్ మార్ష్, వికెట్‌కీపర్ పైన్ ఆ జట్టును ఆదుకున్నారు. అభేద్యమైన ఆరో వికెట్‌కు 48 పరుగులు జోడించారు.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 225/5 (బాన్‌క్రాఫ్ట్ 5, వార్నర్ 51, ఖవాజా 14, స్మిత్ 56, షాన్ మార్ష్ 40, మిచెల్ మార్ష్ 32 నాటౌట్, పైన్ నాటౌట్ 21; ఫిలాండర్ 2/36, కేశవ్ మహరాజ్ 2/69)

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటాం

- 100 మందికి రూ.5 కోట్లు అందజేసిన ముఖ్యమంత్రి

ఈనాడు, అమరావతి: అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలన్నింటినీ ఆదుకుంటామని, చెల్లింపుల బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో గురువారం అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షలు చొప్పున 100మందికి నష్టపరిహారం చెక్కులను ముఖ్యమంత్రి అందచేశారు. మృతిచెందిన అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు ఈ పరిహారం అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఎటువంటి నిబంధనలున్నా లెక్కచేయనని, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఆస్తులు జప్తు చేసి మరీ చెల్లిస్తామని, తప్పుడు పనులు చేసే వారిని ఉపేక్షించనని అన్నారు.



అగ్రిగోల్డ్ బాధితురాలు మహబూబీకి రూ.5 లక్షల చెక్కును అందిస్తున్న చంద్రబాబు

పేదలు న్యాయస్థానాలకు వెళ్లి వ్యయప్రయాసలకు లోనవుతున్నారని, ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు ఇప్పిస్తామని స్పష్టం చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ సమాఖ్య, ఏజెంట్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు బి.విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు ఉన్నారు.

ప్రజలకు సీఎం హోలీ శుభాకాంక్షలు: చెడుపై అంతిమంగా మంచి గెలుస్తుందన్న సందేశాన్నిచ్చే పండుగల్లో హోలీ ఒకటని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి గురువారం ఆయన హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం కావాలన్నదే శుక్రవారం చేసుకునే పండుగ ఉద్దేశమని వివరించారు.

'చమురు' రాయల్టీ బకాయిలు చెల్లించండి: చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ తీరంలో వెలికి తీస్తున్న చమురు నిక్షేపాలపై రాష్ట్రానికి రావాల్సిన రాయల్టీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, పెట్రోలియంశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌లకు వేర్వేరుగా లేఖలు రాశారు. ఏపీ తీరంలో వెలికితీస్తున్న చమురు, సహజవాయువు నిక్షేపాలకు సంబంధించి రాష్ట్రానికి చెల్లించాల్సిన రాయల్టీ చాలా అసంబద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. 2017-19 సంవత్సరాల మధ్యలో కేంద్ర ప్రభుత్వం రాయల్టీరూపంలో వివిధ రాష్ట్రాలకు రూ.15,340 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ లెక్కన 2017 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.571 కోట్లు రావాల్సి ఉండగా కేంద్రం కేవలం రూ.286 కోట్లే విడుదల చేసినట్లు గుర్తుచేశారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న టీజీ భరత్, ప్రతినిధులు

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి

ఈనాడు, అమరావతి: ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య హక్కుల సాధన సమితి కోరింది. సమితి అధ్యక్షుడు టీజీ భరత్ ఆధ్వర్యంలో కొంతమంది ప్రతినిధులు గురువారమిక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం టీజీ భరత్ మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాల ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించామని, దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నాణ్యతలో తేడాలొస్తే 1100కు ఫోన్ చేయండి

మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

గుంటూరు, న్యూస్‌టుడే: చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సరకుల్లో నాణ్యతా లోపాలుంటే వినియోగదారులు 1100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. రాయితీపై అందజేస్తున్న కందిపప్పు, పచ్చిశనగపప్పును గుంటూరు అరండల్‌పేటలోని ఓ దుకాణంలో మంత్రి వినియోగదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 1.42కోట్ల తెల్లకార్డుదారులకు 29 వేల రేషన్ దుకాణాల ద్వారా కిలో రూ.40చొప్పున కందిపప్పు, పచ్చిశెనగపప్పు ఈనెల నుంచి అందిస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనుంచి 15వ తేదీ వరకు కచ్చితంగా చౌకధరల దుకాణాన్ని నిర్ణయించిన సమయంలో తెరచి ఉంచాలని సూచించారు. డీలర్ల నుంచి రాయితీ బియ్యం కొనుగోలు చేసే మిల్లర్ల సీఎంఆర్‌ను రద్దు చేస్తామని, రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై కఠిన చర్యలు చేపడతామన్నారు.

అవకాశం కోల్పోయిన టెట్ అభ్యర్థులు

పరీక్షా కేంద్రాల మార్పుల ఫలితం!

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) కేంద్రాల మార్పుతో తాము పరీక్ష రాయలేకపోయామని, మరోసారి అవకాశం కల్పించాలని కోరుతూ గురువారం కొందరు అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌కు వచ్చారు. ఏలూరుకు చెందిన రావూరి వెంకట్‌కు గతంలో హైదరాబాద్‌లో కేంద్రాన్ని కేటాయించారు. అభ్యర్థుల అనుమతి లేకుండా కేంద్రాలను కేటాయించడంపై విమర్శలు రావడంతో ఆ తర్వాత మార్పునకు అవకాశం కల్పించారు. కేంద్రం మార్చిన వారికి మార్చి 2న పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కొందరు ఆన్‌లైన్‌లో మార్చుకునేందుకు ప్రయత్నించినా అది జరగలేదు. కమిషనరేట్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో వివరాలు ఇస్తే తామే మార్పు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని వెంకట్ పేర్కొన్నారు. ఇప్పుడేమో పరీక్ష గత నెల 25నే పూర్తయినందున అవకాశం ఇవ్వలేమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతడితో పాటు మరికొందరు కూడా ఇదే విషయమై కమిషనరేట్‌కు వెళ్లారు.

ఇంటర్ ద్వితీయ పరీక్షకు 4,62,201 మంది హాజరు

ఈనాడు, అమరావతి: ఇంటర్ రెండో ఏడాది పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 1,423 కేంద్రాల్లో 4,75,544మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 4,62,201మంది హాజరయ్యారు. ఎలాంటి చూచిరాత కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ విద్యామండలి ప్రకటించింది.

ఇంటర్ కళాశాలల అనుమతి పొడిగింపునకు దరఖాస్తుల ఆహ్వానం..

జూనియర్ కళాశాలల అనుమతి గడువు పొడిగింపు, అదనపు సెక్షన్ల మంజూరు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇంటర్ విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించాలని పేర్కొంది. అదనపు సెక్షన్లకు అనుమతి గరిష్ఠంగా నాలుగేళ్లు, కనిష్ఠంగా రెండేళ్లవరకు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈనెల ఐదో తేదీ నుంచి అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ ఐదో తేదీ వరకు, అపరాధ రుసుములతో జులై ఆరో తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది.

పోలవరంపై డాక్యుమెంటరీ

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్ ఒక డాక్యుమెంటరీ రూపొందించనుంది. ఇందుకోసం రూ.75 లక్షలు చెల్లించేందుకు అనుమతిస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం, ఇందులోని ఇంజినీరింగు పరంగా కీలకమైన అంశాలు, ఎదురయ్యే సవాళ్లు... తదితరమైనవాటిని చిత్రీకరించనున్నారు.

పోలీసుల్ని ఆశ్రయించిన నవ దంపతులు

- తాను మంత్రి బంధువునంటున్న వధువు
- ఖండించిన మంత్రి మాణిక్యాలరావు



సీపీ కార్యాలయంలో నవ దంపతులు, మహిళా చేతన సభ్యులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తాము ప్రేమించి పెళ్లి చేసుకున్నామని, తమ పెద్దల నుంచి ప్రాణహాని ఉందని నవ దంపతులు విశాఖ నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. వధువు తాను దేవదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నయ్య మనవరాలునని చెబుతుండగా మంత్రి దానిని ఖండించారు. ఆమెది నా ఇంటి పేరుగల కుటుంబమే తప్ప తన మనవరాలు కాదన్నారు. తాడేపల్లిగూడెంకు చెందిన బాల సంగీత నగరంలోని ఓ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమెకు కైలాసపురానికి చెందిన సంతోశ్‌బాబు(27)తో ఫేస్‌బుక్ పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. సంతోశ్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. వీరు గత ఏడాది నవంబరు 19న నగరంలోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు. వివాహాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 26న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ నెల 27న తమ అమ్మాయి కనబడటం లేదని తల్లిదండ్రులు తాడేపల్లిగూడెంలో ఫిర్యాదు చేశారు. మంత్రితో బంధుత్వంతో తమకు ప్రాణ హాని ఉందని నవ దంపతులు ఫిర్యాదు చేశారు. మహిళా సంఘాల మద్దతుతో సంయుక్త పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో కేసును నాల్గవ పట్టణ పోలీసులకు పంపించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో వారికి రక్షణ కల్పించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడుతూ సంగీత తన పెద్దల్ని ఒప్పించడానికి తాడేపల్లిగూడెం వెళితే పెద్దలు ఆమెను బంధించి విడాకులు ఇవ్వాలని, లేకపోతే చంపడానికి వెనకాడమని బెదిరించారని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులు మాత్రం తాము బెదిరింపులకు పాల్పడలేదని చెప్పారు.

తీహార్‌లో ఊచలు లెక్కపెట్టాలనుందా?

ఈనాడు, దిల్లీ: తీహార్‌లో ఊచలు లెక్కపెట్టాలనుందా? జైలు కూడు రుచి చూడాలనుందా? అయితే మీరేమీ నేరాలు, కుంభకోణాలు చేయక్కర్లేదు. కరడుగట్టిన నేరస్థుల జైలుజీవితాన్ని.. అనుభవించి చూసే అవకాశం సామాన్యులకూ త్వరలో కలుగనుంది. ఇందుకోసం దిల్లీలోని తీహార్ జైలులో 'ఫీల్ లైక్ జైల్' పేరుతో కొత్త సేవలను మొదలుపెట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు నిర్ణీత రుసుమును చెల్లించి.. కొన్ని గంటలు లేదా రోజులపాటు జైలుజీవితం అనుభవించవచ్చు. అయితే జైల్లో ప్రవేశించగానే.. ఈ 'పర్యటక ఖైదీ'ల దగ్గర నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అధికారులు తీసేసుకుంటారు. బయటి తిండి లోపలకు అనుమతించరు. ఖైదీలకు ఇచ్చే దుస్తులు, గదులనే వీరికీ ఇస్తారు.

ప్రత్యేక హోదా'పై.. చలో దిల్లీ గోడపత్రిక ఆవిష్కరణ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ప్రత్యేక హోదా కాంక్షిస్తూ ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఏపీ యువత, విద్యార్థి ఐకాస తలపెట్టిన చలో దిల్లీ కార్యక్రమ గోడపత్రికను గురువారం మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఏపీ యువత, విద్యార్థి ఐకాస ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి చలసాని శ్రీనివాస్‌తోపాటు, ఏపీజేఎఫ్ అధ్యక్షులు కృష్ణాంజనేయులు, ఐకాస ఛైర్మన్ డీవీ కృష్ణలు పాల్గొన్నారు. అంతకు ముందు విశ్వవిద్యాలయంలో విద్యార్థి నేతలు ర్యాలీ నిర్వహించారు.



చలో దిల్లీ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న చలసాని శ్రీనివాస్, విద్యార్థి నేతలు

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00